
# నా ఐరోపా యాత్ర





# నా ఐరోపా యాత్ర

## స్వామి వివేకానంద

రామకృష్ణ మఠం
దోమలగూడ హైదరాబాదు – 500 029

© 2018 Ramakrishna Math, Hyderabad INDIA. All rights reserved.

Published by:

Adhyaksha

Ramakrishna Math

Domalguda, Hyderabad – 29

rkmath.org

e–Book

074v1.1.0

Date: November 23, 2018

ISBN: 9789388439923

Created by: Sriranga Digital Software Technologies Private Limited

srirangadigital.com

# ముందుమాట

1899 సం ॥ జూన్ 20 వ తేదీన స్వామి వివేకానంద బి.ఐ.ఎస్.ఎన్ నౌక 'గోల్కొండ' లో రెండవసారి పాశ్చాత్యదేశాలకు కలకత్తా నుండి బయలుదేరారు.

ఈ పుటలు చదివేటప్పుడు పాఠకులు ఒక్క విషయాన్ని గుర్తుంచుకోవాలి. స్వామీజీ సున్నితమైన హాస్యాన్ని మేళవించి ఈ రచనను బెంగాలీలో చేశారు. అనువాదంలో యథాతథంగా దాన్ని తీసుకురావటం దాదాపు అసాధ్యం.

ఈ పుస్తకం రెండవ భాగం, 1900 సం ॥ చివరిలో పాశ్చాత్య దేశాలనుండి తిరుగు పయనాన్ని వివరిస్తుంది.

'ఉద్బోధన' పత్రికలో ఇది ధారావాహికంగా మొట్టమొదట ప్రచురించబడింది. ఈ ప్రస్తుత ముద్రణలో భాషను సులభశైలిలో మార్చి ఇచ్చిన స్వామి అర్చనానందగారికి మా కృతజ్ఞతలు.

–ప్రకాశకులు




One infinite pure & holy - beyond thought
beyond qualities - I bow down to thee
Swami Vivekananda

# ప్రథమ భాగము

"ఓం నమో నారాయణాయ"★ స్వామీ, – నమో.... అంటూ ఉచ్ఛ స్వరంతో హృషీకేశ పద్ధతిలో ఉచ్చరించు. వారం రోజులుగా మేం ఓడలో వున్నాం. ప్రతిరోజు యిక్కడ మా జీవన పద్ధతిని గురించి నీకు వ్రాద్దామనుకొంటాను. వ్రాత సామగ్రి కావలసినంత నీవు నాకిచ్చావు. కాని వంగదేశస్థుడికి సహజమైన సోమరితనం అడ్డొచ్చి నన్నేపనీ చెయ్యనివ్వదు. ఈ సోమరితనం మొదటి అడ్డంకి. ప్రతిరోజూ నేను దినచర్య వ్రాద్దామనుకొంటాను. కాని రకరకాలైన వ్యవహారాల్లో పడి, అది అంతులేని 'రేపటి' కి వాయిదా పడుతూనే వుంది. రెండోది: నాకు తేదీలు గుర్తుండవు. అందుచేత నీవే ఈ తేదీలు పూరించుకోవాలి. మరి నీవు కాస్త ఉదారంగా భావిస్తే హనుమంతునిలాగే నాకూ చిత్తం ఈశ్వరాయత్తం కాబట్టి యీ తేదీలు మొదలైనవి గుర్తుంచుకోవటం కష్టమని అనుకోవచ్చును. కాని నిజానికిది నా సోమరితనం, తెలివితక్కువతనం తప్ప మరేంకాదు. ఎంత వెఱ్ఱి! ఆ హనుమంతుడు రవికులాంబుధిసోముడైన శ్రీరామచంద్రుని తన హృదయంలో నిండుగా నింపుకొన్నవాడు! ఇక నేనో, ఓ పిచ్చి 'సన్నాసి' ని! ఆ మారుతికీ మనకూ పోలిక ఏమిటి? ఆ హనుమంతుడు ఒక్క గెంతుతో శత యోజన విస్తీర్ణమైన సముద్రాన్ని అవలీలగా లంఘించినవాడు. మేం ఒక కొయ్య ఓడలో దాటుతున్నాం. ఈ కొయ్య ఓడలో నిలబడాలన్నా మేం ఏదో ఒక స్తంభాన్ని పట్టుకొని నిలబడాలి. కాని అతనికంటె ఒక విషయంలో మనమే గొప్ప! ఆయన సముద్రాన్ని దాటాక రాక్షసులను చూశాడు. మేమో! 'వారితోనే' కలిసి ప్రయాణం చేస్తున్నాం. భోజన సమయంలో వారుపయోగించే వందలకొద్దీ తళ తళ మెరిసే శూలాల సంఘర్షణలు విని తమ్ముడు తురీయానందుడు భయంతో నివ్వెరపోయేవాడు. ఏమో ఒకవేళ ఆ పక్కన కూర్చున్న చింపిరి జుట్టు, పిల్లికళ్ల స్త్రీ పొరపాటుగా

అతని పొట్టలోకి బాకు దింపుతుందేమో! అని అతడి భయం. అతడు కాస్త లావుమనిషి కాబట్టి మరింత భయం. హనుమంతుడు సముద్రాన్ని దాటేటప్పుడు మనలాగే సముద్ర ప్రయాణం వల్ల దాపురించే వ్యాధితో బాధపడ్డాడా? పూర్వగ్రంథాలు ఈ విషయాన్ని గురించి ఏమైనా చెప్పినయ్యా? మీరందరూ బాగా చదువు కొన్నవారు. రామాయణం మొదలైన వాటిల్లో పండితులు. అందుచేత మీరు ఈ సమస్యను తప్పక పరిష్కరించగలరు. కాని అధునాతన పండితులు మాత్రం ఈ విషయమై మౌనం పాటిస్తారు. బహుశా హనుమంతుడికి ఆ వ్యాధి వచ్చి వుండదు. కానీ ఒక సందేహం కలుగుతోంది. అదేమంటే ఒక్కొక్కప్పుడు ఓడ హఠాత్తుగా ఆకాశంకేసి ఇంద్రుడితో మాట్లాడ్డానికా అన్నట్లు లేచినప్పుడు, తక్షణమే పాతాళంలోకి బలిచక్రవర్తిని తొక్కటానికా అన్నట్లు కిందికి దిగిపోయినప్పుడు తురీయానందుడు ఏదో ఒక భయంకర రాక్షసి కోరల్లో చిక్కుకొన్నట్లు అదిరిపోయేవాడు. హనుమంతుడు ఆనాడు ఎదిరించింది ఈ (సురస) రాక్షసినే నేమో!

మన్నించు. నీవీ కార్యాన్ని ఎంతో 'మంచిమనిషి' చేతిలో పెట్టావు! ఈ వారం రోజుల సముద్ర ప్రయాణాన్ని నీకు వర్ణించి చెప్పాల్సి వుంది. దీన్నంతా కవిత్వంతో నింపి, రసవంతంగా చక్కని భాషలో, అలంకారాలతో కూడుకొన్నశైలిలో వ్రాయాలి. నేనేదో యిష్టంవచ్చినట్లు చెబుతున్నాను. కాని నిజమేమంటే నా జీవితమంతా పైనున్న 'మాయ' అనే చిప్పను పగులగొట్టి, లోని బ్రహ్మపదార్థమనే కొబ్బరిని తినే ప్రయత్నం లోనే గడిచింది. కనుక హఠాత్తుగా యీ ప్రకృతి సౌందర్యాన్ని మెచ్చుకోవటానికి తగిన శక్తి నాకెలా లభిస్తుంది? నా జీవితమంతా కాశీనుండి కాశ్మీర్‌కు, ఖొరాసన్ నుండి గుజరాత్‌కు హిందూదేశమంతటా తిరుగుతూనే వున్నాను.

ఎన్ని కొండలు, నదులు, పర్వతాలు, సెలయేళ్లు, లోయలు, మేఘావృత నిరంతర హిమాచ్ఛాదిత పర్వత శిఖరాలు గోచరించాయి! కల్లోలితాలై గర్జిస్తూ, నురుగులు కక్కుతూన్న సముద్రాల నెన్నింటిని చూడలేదు? వినలేదు? కాని ఒక చీకటి గదిలో ఈ మోటు కొయ్యమంచం మీద కూర్చొని — ఇక్కడ పగలుకూడా దీపం పెట్టుకోవలసిందే — ఆ గోడలమీద తమలపాకులు

నమిలి ఉమ్మిన గుర్తులు, ఎలుకలు, చుంచులు, బల్లులు, వాటి కిచకిచలు అంతేగాక పక్క వీధిలో బళ్ల చప్పుళ్లు, ట్రామ్ చప్పుళ్లు, దుమారాలు ఇలాంటి 'కావ్యోచిత' వాతావరణం మధ్యకూడా మన వంగకవి శ్యామాచరణుడు హుక్కాగొట్టాన్ని పీలుస్తూ అత్యంత సజీవంగా చిత్రించిన హిమాలయాలు, సముద్రాలు, పచ్చికబయళ్లు, ఎడార్లు నేనెలా చిత్రించగలను? అది మనకు అసంభవం. శ్యామాచరణుడు తన చిన్నతనంలో వాతావరణ మార్పు నిమిత్తం పై దేశాలకు వెళ్లాడు. అక్కడ నీళ్లు మంచివి, జీర్ణశక్తిని పెంపొందించేవి. నువ్వు కడుపునిండా తిని చెంబుడు నీళ్లు తాగితే, తిన్న తిండి అంతా క్షణంలో అరిగిపోతుంది. తిరిగి కరకర ఆకలివేస్తుంది. ఇక్కడ శ్యామాచరణుని మహాప్రతిభ ప్రకృతిగతమైన మహిమను, సౌందర్యాన్ని ఆస్వాదించగలిగింది. కాని పానకంలో పుడకలా ఒక చిన్న లోపం ఉంది – శ్యామాచరణుని యాత్రలు బర్ద్వాను (వంగదేశం) దాటలేదట.

కాని నీవు నన్ను హృదయపూర్వకంగా అడిగావు. అంతేగాక నాలో 'కవిత్వ శక్తి' పూర్తిగా లోపించలేదు. అందుచేత నేను భగవంతుని స్మరిస్తూ ఈ కార్యభారానికి పూనుకొంటున్నాను, నీమా సావధానుడవు కమ్ము సోదరా!

సామాన్యంగా ఏ రేవునుండైనా, అందులో కలకత్తా వర్తక రేవు నుండి, హుగ్లీలాంటి నదిలో ఓడలు రాత్రివేళ బయల్దేరవు. ఓడ సముద్రంలోకి పోయేంతవరకూ అధికారం కెప్టెన్ చేతిలో వుంటుంది. అంతదాకా అతడే నౌకా నాయకుడు, అతడే ఆజ్ఞ జారీ చేస్తాడు. ఓడను రేవునుండి సముద్రంలోకి నడపటం, సముద్రంనుండి రేవులోకి పోనివ్వటం అతని పని. హుగ్లీ ముఖద్వార సమీపంలో రెండు ప్రమాద స్థలాలున్నాయి. ఒకటి బడ్జి బడ్జి వద్ద జేమ్స్ మేరీ బ్యాంక్స్ అనే ప్రాంతం. రెండవది డైమండ్ హార్బర్‌లోకి పోవటానికి ముందుగా వున్న ఇసుక దిబ్బ. సముద్రం పోటులో వున్నప్పుడు, పగలు మాత్రమే కెప్టెన్ ఎంతో జాగ్రత్తగా ఓడను నడపగలడు. తదితర పరిస్థితుల్లో నడపటం ప్రమాదకరం. అందుచేత మాకు హుగ్లీని దాటేందుకు రెండు రోజులు పట్టింది.

నీకు హృషీకేశ్‌లోని గంగానది గుర్తుందా? ఆ స్వచ్ఛమైన నీలజలంలో ఐదు గజాల లోతులోవున్న చేప పొలుసులనైనా మనం లెక్కపెట్టవచ్చును. హిమశీలమైన తియ్యని చక్కని నీరు, 'హరహర' అంటూ ప్రవహించే ఆ నీటి చప్పుళ్లు, సమీపంలోని జలపాతాల 'హరహర' ధ్వనులు నీకు గుర్తున్నాయా? మన ఆ అరణ్యాల్లోని జీవితం, ఆ మధుకరి★ (భిక్షాన్నం), ఆ గంగానదిలోని చిరుద్వీపాలలోని శిలల మీద ఆ భోజనాలు, దోసిళ్లతో కడుపారా నీళ్లను గ్రోలటం, రొట్టెముక్కల కోసం నిర్భయంగా తిరుగుతూన్న ఆ చేపలు నీకు గుర్తున్నాయా? ఆ గంగానదీ జలాల మీదున్న ప్రేమ, ఆ మహానది వైభవం అనిర్వచనీయాలు. ఆ తల్లి చల్లని స్పర్శ మనస్సును శాంతపరచేది. శ్రీనగరం, తెహరి, ఉత్తరకాశీ, గంగోత్రి మొదలైన ప్రదేశాలగుండా హిమాలయాలమీద ప్రవహించే ఆ గంగామాత నీకు గుర్తేకదా. మీలో కొంతమంది ఆ గంగానదీ జన్మస్థానాన్ని చూసేవున్నారు. కాని కలకత్తాలోని మన గంగానదిలో ఒక సమ్మోహనశక్తి వుంది. నీరు, బురదగా పరమేశ్వర దేహసాంగత్యంవల్లా అన్నట్లు తెల్లగా వుంటుంది. ఆ జాహ్నవీమాత హృదయంమీద అసంఖ్యాకాలైన ఓడలు తిరుగుతుంటాయి. ఇలా అనిపించటం దేశభక్తో, మరి చిన్ననాటి సంస్కారాలో ఎవరి కెరుక? గంగామాతకు, హిందువులకు ఎంత అద్భుతమైన సంబంధముంది? ఇది వట్టి మూఢవిశ్వాసమా? కావొచ్చు. ఈ హిందువులు గంగా నామాన్ని జపిస్తూ జీవిస్తారు, ఆ తల్లి జలాలలోనే మునిగి మరణిస్తారు. సుదూర ప్రాంతాల్లోని జనంకూడా తమతో గంగాజలాన్ని రాగిపాత్రల్లో భద్రపరచి తీసుకెళతారు. పండుగ లేక పవిత్ర దినాల్లో ఆ రాగిపాత్రల్లోని గంగాజలాన్ని రెండు మూడు చుక్కలను నోట్లో పోసుకుంటారు. రాజులు, మహారాజులు పెద్ద గుండిగల్లో గంగాజలాన్ని భద్రపరుచుకొంటారు. ఎంతో ధనవ్యయంతో గంగోత్రినుండి గంగాజలాన్ని రామేశ్వరానికి తీసుకెళ్ళి రామేశ్వర లింగానికి అభిషేకం చేస్తారు. రంగూన్, జావా, హాంకాంగ్, మెడగాస్కర్, సూయజ్ ఏడెన్, మాల్టా మొదలైన విదేశాలకు వెళ్లే హిందువులు తమతో భగవద్గీతతోపాటు, గంగాజలాన్ని కూడా తీసుకెళతారు.

హిందువుల హైందవత్వానికి భగవద్గీత, గంగాజలం ముఖ్య అంశాలు. ఇంతకుముందు పాశ్చాత్య దేశాలకు వెళ్ళినప్పుడు అవసరమవుతుందని నేనూ కొంత గంగాజలాన్ని తీసుకెళ్ళాను.

సందర్భం కలిగినప్పుడు కొన్ని చుక్కలు తాగేవాణ్ణి. తాగినప్పుడల్లా ఆ మహాజన ప్రవాహం మధ్యలో, ఆ నాగరికపు గొడవలో ఆ వేలమంది స్త్రీ పురుషుల విసరు నడక చప్పుళ్ళలో ఒక్కసారిగా నా మనస్సు ప్రశాంతము, స్థిరము అయ్యేది. ఆ జన ప్రవాహం, ఆ గందరగోళం అడుగున కన్పించే ఆ స్పర్థ, ఆ సంఘట్టం భోగనివాసాలైన పారిస్, లండన్, న్యూయార్క్, బెర్లిన్, రోమ్ మొదలైన నగరాలన్నీ అంతర్థానాలై 'హర', 'హర' అనే గంగానదీ ఘోషలు వినిపించేవి. ఆ దివిజ కల్లోలినీ గర్జనలు 'హరహర' అంటూ నా హృదయంలో, నా మేధస్సులో, నా నరాల వెంట ప్రవహిస్తూన్నట్లు నా కనుభవం కలిగేది.

ఈసారి కూడా మీరు గంగామాతను మద్రాసుకు పంపారు. కాని ప్రియసోదరా! అబ్బ! మీ రెలాంటి వింత పాత్రలో ఉంచారా మాతను! సోదరుడు తురీయానందుడు తన చిన్నతనంనుండి బ్రహ్మచారి. ఆధ్యాత్మికశక్తితో అతడు జ్వలంత అగ్నిహోత్రునిలా కనిపిస్తాడు. అతడు బ్రాహ్మణుడు. సన్యసించకపూర్వం 'నమోబ్రహ్మణే' అంటూ అనేకులు అతడికి నమస్కరించేవారు. సన్న్యాసి కాబట్టి ఇప్పుడు 'నమో నారాయణాయ' అంటూ నమస్కరిస్తున్నారు. అందుచేత కాబోలు గంగామాత బ్రహ్మదేవుని కమండలాన్ని విడిచి ఈ నారాయణుని (తురీయానందుని) అధీనంలో కొచ్చి ఒక జాడీలో నింపబడింది! ఏమైనప్పటికీ ఒకరోజు నేను రాత్రి పొద్దుపోయిన తరువాత నిద్రలేచాను. ఆ విచిత్ర పాత్రలో గంగామాత ఉండలేక బైటికొచ్చే ప్రయత్నం చేస్తూన్నది. అలా జరిగితే చాలా అపాయమనుకొన్నాను. ఎందుకంటేగంగామాత ఆమె జీవితంలోని పూర్వ దృశ్యాలను – హిమాలయాలను తొలచుకొంటూ ప్రవహించటం, ఐరావత గజాన్ని నెట్టివేయడం, 'జాహ్ను' ఋషి పర్ణశాలను పడగొట్టి పోవటం మొదలైన కార్యాలను తిరిగి ప్రదర్శిస్తే ఎంతఘోర ప్రమాదం వాటిల్లుతుందోగదా! కావున నేను గంగామాతను ఎంతో ప్రార్థించాను. "అమ్మా! కొంతసేపు ఆగు తల్లీ! దయచేసి మమ్మల్ని రేపు మద్రాసు వెళ్ళనివ్వు. ఆ తరువాత నీ యిష్టం వచ్చినట్లు చేద్దువుగాని. అక్కడ ఏనుగుల కంటె పెద్ద తలకాయల వారున్నారు. వారిలో చాలమందికి జాహ్నునికి మాదిరే పర్ణశాలలుకూడా వున్నాయి. వారి తలకాయలు సగం క్షురకర్మ చెయ్యబడి నడినెత్తిని పెద్ద జుట్టుముడితో వుంటాయి. అవి

నిజంగా రాతితో చెయ్యబడ్డవే! వాటితో పోలిస్తే హిమాలయాలే వెన్నపూసలా మెత్తగా వుంటాయి. వాటిని నీ ఇష్టంవచ్చినట్లు కొట్టవచ్చు. ఇప్పుడు మాత్రం కొంతసేపు ఓర్పు వహించు" అన్నాను. కాని నేనేం చెప్పినా ఏం లాభం? అంతా వ్యర్థమైంది. గంగామాత ఒక్కమాటకూడా వినలేదు.

అప్పుడు నాకో చక్కని ఉపాయం తోచింది. ఆమెతో యిలా అన్నాను: "అమ్మా! ఆ చొక్కాలు ధరించి, తలపాగాలు చుట్టుకొన్న సేవకులవంక చూడు. ఈ ఓడలో అటు యిటు తిరుగుతున్నారే – వారు మహమ్మదీయులు, సిసలైన మహమ్మదీయులు; ఎద్దు మాంసాన్ని తినే మహమ్మదీయులు. అలాగే ఈ గదులను ఊడుస్తూ, శుభ్రంచేస్తూ తిరుగుతున్న వారిని చూశావా? వీరంతా పాకీవాళ్ళు. 'లాల్‌బెగ్' శిష్యులు. నువ్వు కనుక నా మాట వినకపోయావా వారిని పిలిచి నిన్ను ముట్టుకోమంటాను! ఆ శిక్షకూడా నీకు చాలకపోతే నిన్ను నీ పుట్టింటికి పంపిస్తాను. ఆ గది చూశావా? నిన్నందులో వుంచి తాళం వేస్తే హిమాలయాల్లోని నీ పూర్వ స్థితికి వెళతావు. అంటే నీ ప్రవాహశక్తి అంతా అణగిపోతుంది. మంచుగడ్డలా తయారవుతావు." ఈ పలుకులు ఆ తల్లి తలకెక్కాయి, మెదలకుండా మారుకొంది. చూశావా? ఈ జాడ్యం ఒక్క దేవతలకే కాదు మనుషులకూ వుంది. ఎవడైనా ఒక భక్తుడు దొరికితే చాలు వాడి నెత్తికెక్కి కూర్చుంటారు!

చూడు తమ్ముడూ! మళ్ళీ నేను అసలు సంగతిని వదిలిపెట్టి ఏదో పర ధ్యాసలో పడిపోయాను. నేను ముందే నీకు చెప్పాను. ఈ విషయాలు వర్ణించటం నా స్వభావం కాదు. కాని నీకు ఓపిక ఉంటే మళ్ళీ ప్రయత్నిస్తాను మరి!

స్వజాతి జనంలో ఎక్కడా కన్పించని సౌందర్యం వుంటుంది. మన సోదరులు, సోదరీమణులు, కుమారులు, కుమార్తెలు – ఎంత కురూపులైనా సరే, పోల్చి చూస్తే స్వర్గలోకస్థులకంటె అందంగా కనిపిస్తారు. ఐనా స్వర్గలోకాలకు వెళ్ళి, అక్కడికి జనాన్ని చూసివచ్చాక మనకు చెందినవారు వారికంటే అందంగా వుండటాన్ని చూసి మనకు చెప్పలేని ఆనందం కలుగుతుంది. మన వంగదేశంలో ఒక ప్రత్యేకమైన సౌందర్యం వుంది. విస్తృతమైన

పచ్చికబయళ్ళు, వేలకొద్ది నదులు, వాగులు మెడలో వేసుకొన్న పూలదండల్లా కనిపిస్తాయి. మన దేశంలో ఈ రీతి సౌందర్యం కొంత కేరళలో, కాశ్మీరంలో కానవస్తుంది. నీళ్ళలో సౌందర్యం లేదా? అంతటా నీళ్ళే ఉన్నాయి. పెద్ద వానజల్లులు ఆకులమీదనుండి కురుస్తుంటాయి. కొబ్బరి ఖర్జూరవృక్షాల ఆకులు ఆ జల్లులకు కొంచెం తలలు వంచుతాయి. చుట్టూ కప్పలు నిరంతరం అరుస్తుంటాయి. ఇలాంటి దృశ్యాల్లో సౌందర్యం ఉండదా? మరి మన గంగానదీతీర సౌందర్యం చూసి మెచ్చుకోవాలంటే విదేశాలకు వెళ్లి తిరిగివస్తూ గంగానదీ ముఖద్వారంలో 'డైమండ్ హార్బర్' గుండా ప్రవేశించాలి. అప్పుడుగాని భాగీరథీ మాత తీరముల సౌందర్యం తెలియరాదు. ఆ నీలాకాశం, దాని కడుపులో నల్లని మేఘాలు, వాటి కిందుగా బంగారు అంచులలో తెల్లని మేఘాలు, వాటి కింద వేలకొద్ది విసనకర్రలు విప్పినట్లుండి తలలు ఊపుతున్న కొబ్బరి, ఖర్జూర వృక్షాల తోపులు, వాటికి కిందుగా లేత, గుబురు, పసుపుపచ్చ రంగులు, కొంచెం ముదురు రంగుకు తిరిగిన నానారకాలైన ఆకుపచ్చ వర్ణాలు కలబోసినట్లున్న మామిడి, లీచీ, నల్ల ద్రాక్ష, పనస మొదలైన వృక్షాలు గుబుర్లు గుబుర్లుగా పెరిగిన ఆ చెట్ల బోదెలు, కొమ్మలు, రెమ్మలు కన్నులపండుగ వొనరిస్తాయి. వాని పక్క వెదురు పొదలు గాలికి మాగులాడుతుంటాయి. కింద పచ్చికపట్టు వుంది. దాని మృదుత్వం నిగనిగ ముందు నునుపుగా వుండే పర్షియా, టర్కీస్థాన్ మొదలైన దేశాల్లో దొరికే రత్నకంబళాలు దిగదుడుపే! కనుచూపుమేర పచ్చని పచ్చికపట్టు ఎవరో చక్కగా తీర్చి కత్తిరించినట్లు వుంటుంది. నది ఒడ్డుదాకా, పెద్ద కట్టల కిందదాకా గంగానదీతరంగాలు ఎగసికొట్టేటంతవరకు ఈ నేలంతా పచ్చనిగడ్డితో కప్పబడి వుంటుంది. దీనికి కొంచెం దిగువగా పవిత్రమైన గంగా ప్రవాహం వుంది. నువ్వొక్కసారి నీ చూపును ఆకాశంనుండి కిందికి తిప్పితే, ఒకే రేఖలో భిన్నాలైన యీ దృశ్యాలను చూస్తావు. ఒకే రంగు యొక్క విభిన్న ఛాయలను నువ్వు మరెక్కడా చూసివుండవు. అసలు నువ్వెప్పుడైనా రంగులను చూసి సమ్మోహితుడవైనావా? పురుగులు; అగ్నిలో పడి చచ్చిపోయే కీటకాలు పుష్పముల ఖైదుల్లో పట్టువడి తిండిలేక చచ్చిపోతాయి. రంగుల ఆకర్షణ ఇలాంటిది! నీకొక సంగతి చెబుతాను: నీవు గంగానదీ దృశ్యాల సౌందర్యాన్ని ఆనందింపదలిస్తే, ఇప్పుడే తనివితీరా ఆనందించు! లేకపోతే కొద్ది కాలంలోనే ఈ దృశ్యాలన్నీ విపరీతంగా మార్పుకు లోనౌతాయి. ధనాన్ని గుంజే వర్తకుల

చేతుల్లో ఇవన్నీ మాయమౌతాయి. ఈ పచ్చని పచ్చికలకు బదులు ఆ ప్రాంతాల్లో ఇటుకబట్టీలు బయల్దేరతాయి. మట్టి తియ్యటానికి గుంటలు తీయబడతాయి. గంగానది చిరు తరంగాలు పచ్చగడ్డిలో సయ్యాటలాడుతూన్న ప్రాంతాల్లో జనపనార సరకుల పడవలు లంగరు వేయబడతాయి. ఇకముందు నీకు బహువర్ణ సమ్మిశ్రితమైన ఆ కొబ్బరి, తాటి, మామిడి మొదలైన వృక్షాలు, ఆ నీలాకాశం, ఆ మబ్బుల అందం యివేవీ కనిపించవు. వీటికి బదులు చుట్టలు చుట్టలుగా వ్యాపించే బొగ్గు పొగ, ఆ పొగ మధ్య రాక్షసుల్లా నిలబడిన కర్మాగార పొగగొట్టాలు కనిపిస్తాయి.

ఇప్పటికి మా ఓడ సముద్రంలోకి ప్రవేశించింది. నీవు కాళిదాసు 'రఘువంశం' లోని సముద్రవర్ణనను చదివే వుంటావు. సముద్ర తీరం తాటితోపులతో నీలవర్ణ సంకాశమై ఒక ఇనుపచక్రం అంచుమాదిరి వున్నట్లు వర్ణింపబడింది. కాని అది యథార్థం కాదు. నాకు కాళిదాసంటె ఎంతో గౌరవం. కాని ఆయన ఎన్నడూ సముద్రాన్నిగాని, హిమాలయాలనుగాని చూసివుండడని నా నమ్మకం. (స్వామీజీ తరువాత తన అభిప్రాయాన్ని మార్చుకొన్నారు. కాళిదాసు హిమాలయాలను చూసి వుండొచ్చునని ఆయన తరువాత పలికారు.)

ఇక్కడ ప్రయాగలోని గంగా యమునా నదుల సంగమంలా యీ గంగ సముద్రంలో కలిసేచోట తెల్లని, నల్లని నీళ్లు కలిసి వుంటాయి. ఇతర ప్రదేశాల్లో ముక్తి దొరకటం దుర్లభం. కాని హరిద్వారం, ప్రయాగ, గంగా సాగర సంగమాల్లో ముక్తి ఖచ్చితంగా లభిస్తుంది. కాని కొందరు యిది నిజమైన నదీముఖం కాదంటారు. ఐనా పరమేశ్వరుడు 'సహస్రాక్షుడు, సహస్రముఖుడు, సహస్రశీర్షుడు, సర్వవ్యాపి'* కనుక ఆయన కిక్కడే నమస్కరిస్తాను.

ఈ ప్రాంతం ఎంత రమణీయంగా వుంది! కనుచూపు మేరకు నల్లని సముద్రజలం నురుగు తెట్టెలతో తరంగాలుగా లేచి గాలికి తాళయుక్తంగా నృత్యం చేస్తోంది. వెనుకవైపు పరమేశ్వర శరీర విభూతివల్ల ధవళితమైన పవిత్ర గంగానదీజలం వుంది. శ్రీ శంకరాచార్యులవారు పరమేశ్వరుని జటాజూటాన్ని వర్ణిస్తూ, 'గంగాతరంగ రమణీయ

జటాకలాపం' – (గంగ నురుగుతో ఈశ్వరుని జటాజూటం ధవళితమైనది) అన్నారు. ఇక్కడ గంగామాత కొంత మందంగా ప్రవహిస్తుంది. మా ముందు గంగాసాగర సంగమంలో నల్లని తెల్లని జలాలమధ్య బద్దెగీసినట్లొక రేఖవుంది. ఇంతవరకు తెల్లని జలం, యిక ఇక్కణ్ణుండి నల్లని సముద్ర జలం. ముందు, వెనుక, చుట్టూ అంతా నల్లని జలమే. అంతా నిరంతర తరంగ సంఘట్టనమే. ఈ సముద్రుడికి జుట్టు నల్లనిది, శరీరం నల్లనిది, దుస్తులుకూడా నల్లనివే. పురాణాల్లో దేవతల భయంతో ఎంతోమంది రాక్షసులు యీ సముద్రజలాల్లో దాక్కొన్నట్లు వర్ణింపబడింది. ఈనాడు ఆ రాక్షసులకు మంచి అవకాశం వచ్చినట్లుంది.ఈనాడు వరుణుడు వారి మిత్రుడు. గ్రీకు వాయుదేవత 'ఏవొలస్' వారి వెనుక వున్నాడు. భయంకరమైన అరుపులతో, గర్జనలతో సముద్ర ఉపరితలంలో ఈ రాక్షసులు నేడు భీకరమైన యుద్ధనృత్యం చేస్తూన్నట్లుంది. ఈ నురుగులు కడుతూన్న తరంగాలే వారి అట్టహాసాలు. ఈ గందరగోళం మధ్య మా ఓడ పయనిస్తోంది.

ఓడ పైభాగంలో ప్రభువుల్లా నడుస్తున్న తెల్లజాతి పురుషులు, స్త్రీలు సాగరపరివృత భూమండలానికి అధినాథులు. వీరంతా అందమైన దుస్తులు ధరించారు. చంద్రికా సందీపిత దేహవర్ణంతో వెలిగిపోతూ, ఆత్మవిశ్వాసం మూర్తీభవించినట్లున్నారు. కాని నల్లజాతులవారికి వీరు మూర్తీభవించిన గర్వాహంకారులుగా కనిపిస్తున్నారు. పైన వర్షసంభరిత మేఘాల ఉరుములతో నిండిన ఆకాశం! – అన్ని దిక్కులా నురుగులు కక్కుతోన్న తరంగాల గర్జనలు, నృత్యాలు! సముద్రుడి బలాన్ని లెక్కచెయ్యని మా ఓడ యంత్రాల పెద్ద చప్పుళ్లు! ఇవన్నీ కలగలిసి విచిత్రమైన ధ్వని సమ్మేళనం! దీన్ని వింటూ సగం నిద్ర, సగం మెలకువగా వున్నట్లు ఆశ్చర్యంలో నిమగ్నుడనయ్యాను. హఠాత్తుగా ఈ ధ్వనులన్నిటినీ కప్పేసి గహన, గంభీర సంగీతనాదం, తాళధ్వని నా చెవుల్లో గింగురుమంది. స్త్రీ పురుషుల కంఠస్వరాల కలయిక వినిపిస్తోంది. వారు జాతీయగీతాన్ని ఆలాపిస్తున్నారు. "ఓ ఆంగ్లదేశమా! ఈ సముద్రాన్ని పాలించు. ఆంగ్లదేశం యీ తరంగాలను పాలిస్తోం" దన్న చరణం దాన్లో వుంది. నేను చుట్టూ పరికించాను. ఓడ భారంగా ముందుకు సాగుతోంది. సోదరుడు తురీయానందుడు తలను రెండు చేతులతోను పట్టుకొని

సముద్ర రోగంతో బాధపడుతున్నాడు.

రెండవ తరగతిలో యిద్దరు బెంగాలీ యువకులున్నారు. వారు పై చదువుల నిమిత్తం విదేశాలకు వెళుతున్నారు. వారి స్థితి అంతకంటే అధ్వాన్నంగా వుంది. అందులో ఒకడు ఎంతో భయపడినట్లు కనిపిస్తున్నాడు. ఓడను ఒడ్డుకుచేర్పిస్తే యింటికి పరిగెత్తు కెళ్ళేట్లున్నాడు. ఈ కుర్రవాళ్ళిద్దరు, మేం యిద్దరం ఓడలో వున్న భారతీయులం. అధునాతన భారతదేశానికి ప్రతినిధులం. ఓడ గంగానదిలో వున్న రెండు రోజులు సోదరుడు తురీయానందుడు "అధునాతన భారతదేశాన్ని" గురించిన నా వ్యాసాన్ని పూర్తిచెయ్యమని తొందరపెడుతూనే వున్నాడు. నన్ను తొందరపెట్టమని 'ఉద్బోధన' పత్రికా సంపాదకుడు రహస్యంగా అతడితో చెప్పినట్లున్నాడు. ఈరోజు నాకు కాస్త అవకాశం చిక్కింది. తురీయానందుణ్ణి యిలా అడిగాను: "సోదరా! అధునాతన భారతదేశ పరిస్థితి గురించి నీ అభిప్రాయమేమిటి?" అతడు రెండవ తరగతి వంక తేరిపారచూసి తన వంక చూసుకొని నిట్టూరుస్తూ "చాలా శోచనీయం! మరీ గందరగోళంగా తయారవుతోంది" అన్నాడు.

గంగానదికి పద్మ, హుగ్లీ అనే రెండు శాఖలున్నాయి. పద్మ పెద్దపాయ.ఐనా హుగ్లీకే యింత ప్రాముఖ్య మెందుకొచ్చింది? అనేకుల దృష్టిలో హుగ్లీ ముఖ్యమైన పాయ. కాలాంతరంలో మరో పాయ ఏర్పడింది. అదే పద్మ. అలాగే ఈనాటి 'తోలీనుల్ల' గంగానది యొక్క ప్రాచీనవాహిని. అది 'ఆది గంగ' గా ప్రసిద్ధి. కవికంకణుడి గ్రంథంలో నాయకుడు సముద్ర వర్తకుడు. అతడు లంకకు యీ పాయగుండానే పయనించాడు. పూర్వకాలంలో గంగానదిలో త్రివేణి వరకు పెద్ద ఓడలే పోయేవి. సప్తగ్రామమనే ఒక ఓడ రేవు త్రివేణీఘట్టానికి కొంచెందూరంలో సరస్వతీనది ఒడ్డున వుండేది. అతిపురాతన కాలంనుండి వంగదేశ విదేశీయ వాణిజ్యానికి సప్తగ్రామం ముఖ్యరేవుగా వుండేది. క్రమంగా సరస్వతీనది ముఖద్వారం వండ్రుమట్టి పట్టి పూడుకుపోయింది. 1539 వ సంవత్సరంలో ఈ ముఖద్వారం బాగా పూడుకుపోవటంచేత పోర్చుగీసు వర్తకులు తమ ఓడలను నడపటానికి గంగానదిలో కొంతదూరం దిగువకు పోవలసి

వచ్చింది. ఆ ప్రదేశమే ప్రస్తుతం ప్రసిద్ధమైన హుగ్లీ నగరంగా రూపొందింది.

16 వ శతాబ్దంనుండి గంగానదీ ముఖద్వారం పూడుకుపోవటంతో చాలమంది దేశీయ, విదేశీయ వర్తకులు ఆందోళనపడ్డారు. కాని దానికేం? ఈ గంగా నదీ జలమార్గం క్రమంగా అప్పటినుండి యిప్పటివరకూ పూడుకుపోతూనే వుంది. యంత్రవిజ్ఞాన ప్రతిభ యిక్కడ ఏమీ పనిచెయ్యలేక పోయింది. 1666 వ సంవత్సరంలో గంగానదిలో 'సూతి' అనే ప్రాంతం వద్ద పూర్తిగా పూడుకుపోయిందని ఒక ఫ్రెంచ్ మతప్రచారకుడు వ్రాశాడు. హాల్వెల్ (బ్లాక్‌హోల్ ప్రసిద్ధుడు) ముర్షీదాబాద్ శాంతి పురాలవద్ద గంగానది లోతు తక్కువగా వుండటంతో నాటుపడవలపై పోవాల్సివచ్చింది. 1797 వ సంవత్సరంలో కెప్టెన్ కోల్‌బ్రూక్ హుగ్లీలోనూ, జలంగీలోను వేసవిలో నాటు పడవలుకూడా నడపటం సాధ్యంకాదని వ్రాశాడు. 1822 నుండి 1854 వరకు ఏ రకమైన పడవల రాకపోకలూ హుగ్లీలో వీలుకాకపోయాయి. 24 సంవత్సరాల కాలం హుగ్లీలో రెండు మూడు అడుగుల లోతు నీరు మాత్రమే వుండేది. 17 వ శతాబ్దంలో హుగ్లీకి ఒక మైలు దిగువ చింసురాలో (చిన్‌సురా) డచ్చివారు ఒక వర్తక కేంద్రాన్ని నెలకొల్పారు. తరువాత వచ్చిన ఫ్రెంచ్‌వారు నదికి మరింత దిగువ 'చంద్రనగర్' స్థావరాన్ని నెలకొల్పుకున్నారు. 1723 వ సంవత్సరంలో జర్మనీ దేశపు ఓస్టెండ్ కంపెనీవారు బంకిపూర్‌లో చంద్రనగర్‌కు ఐదు మైళ్ళ దిగువ నదికి అవతలివైపు ఒక కర్మాగారాన్ని స్థాపించారు. 1616 వ సంవత్సరంలో డెన్మార్క్ దేశస్థులు చంద్రనగర్‌కు ఎనిమిది మైళ్ల దిగువన సేరంపూర్‌లో ఒక కర్మాగారాన్ని స్థాపించారు. తరువాత నదికి ఇంకా దిగువన ఆంగ్లేయులు కలకత్తానగరాన్ని నిర్మించారు. కలకత్తాకు తప్ప ఈ పై చెప్పిన ఏ ఒక్క ప్రాంతానికీ యిప్పుడు ఓడలు పోవు. కానీ కలకత్తా భవిష్యత్తు గురించి అందరూ భయపడుతున్నారు.

శాంతిపురం దాకా వేసవిలో కూడా గంగానదిలో యింత నీరు వుండటానికి కారణం చాల విచిత్రమైనది: పైన ప్రవహించే ప్రవాహం కట్టుపడ్డాక యింతకు పూర్వం భూమిలోకి ఇంకిన నీరు మారివచ్చి నదిలోకి చేరుతుంది. నదీతలం యిప్పుడూ రెండు వైపుల్లోవున్న

భూతలంకంటె ఎంతో లోతు. నదీతలం కొత్త మన్ను చేరటంతో క్రమంగా పెరిగినప్పుడు యిబ్బంది మొదలవుతుంది. అంతేకాక యింకో ప్రమాదంకూడా కలుగవచ్చనే మాటా ఉంది. కలకలత్తాకు సమీపంలో కూడా భూకంపాల వల్లో, ఇతర కారణాల వల్లో నది ఇటునుండి అటుకు నడిచిపోయేటంత వీలుగా అప్పుడప్పుడు ఎండిపోతుండేది. 1770 వ సంవత్సరంలో ఇలాగే జరిగింది. 1734 వ సంవత్సరం అక్టోబర్ 9 గురువారంనాడు మధ్యాహ్నం సముద్ర 'ఆటు' కాలంలో నది పూర్తిగా ఎండిపోయిందట. అదే కొంచెం తరువాత, సాయంకాలం ఏ అమంగళకరమైన సమయంలోనో జరిగివుంటే, ఫలితం ఎలా వుండేదో నీ మాహకే వదలివేస్తాను. బహుశ మళ్లీ నది అక్కడ ప్రవహించేది కాదేమో.

పూర్వం హుగ్లీ పైభాగాలకు పట్టిన గతే యిప్పుడు దిగువ భాగానికి పట్టింది. ఇక్కడ మనం రెండు ప్రమాదాల నెదుర్కోవలసి వుంది. అది జేమ్స్ దిబ్బలు, మేరీ దిబ్బలు. పూర్వం కలకత్తాకు 30 మైళ్ళ ఎగువ 'దామోదర్‌నది' వచ్చి గంగలో కలిసేది. ఇప్పుడు కాలమహిమతో గంగకు 31 మైళ్లు దక్షిణంగా యీ నది వచ్చి పడుతోంది. ఈ ప్రాంతానికి 6 మైళ్ల దిగువ 'రూపనారాయణ' నది గంగలో కలుస్తోంది. ఈ రెండు నదులు గంగలోకి ఎంతో నీళ్ళను తీసుకొస్తున్నాయి. కాని అవి తీసుకొచ్చే ఒండ్రునంతా తొలగించటం ఎట్లా? ఫలితంగా నదీతలంలో పెద్ద లంకలు తలచూపాయి. ఈ లంకలు నిరంతరం వేర్వేరు చోట్లకు మార్పు చెందుతుంటాయి. ఒక్కొక్కప్పుడు ఇవి దిబ్బవేసుకొని పోతాయి, వదులుగా ఉంటాయి. ఒక్కొక్కప్పుడు బిగిసి దిబ్బకడుతుంది. ఈ లంకలే ఎంతో భయకారణాలు. రాత్రింబవళ్లు నది లోతును కొలిచి చూసుకోవలసిందే. అజాగ్రత్తతో కొన్ని రోజులు ఈ కొలతలు తీసుకోకపోతే ఓడలకు చాలా నష్టం కలుగుతుంది. ఓడ వెళ్ళి ఈ లంకలకు తగలగానే మళ్లీ ఓడ కదలకుండా వుండిపోవటమో, కూరుకొనిపోవటమో జరుగుతుంది. మూడు తెరచాపలున్న ఓడకూడా ఈ దిబ్బలకు తగిలిన అరగంటలో లోపలకు కూరుకొనిపోగా తెరచాప కొయ్యల కొసలు మాత్రమే కనిపించే సందర్భాలు అనేకం నమోదయ్యాయి. ఈ ఇసుక దిబ్బలు దామోదర్, రూపనారాయణ* నదుల ముఖాలని మనం అనుకోవచ్చును. దామోదర్ నది ఇప్పుడు

'సంతాలు' జాతివారి గ్రామాలను మింగటంతో తృప్తిపడటంలేదు. ఇప్పుడు ఓడలను, స్టీమర్లనుకూడా రుచి వైవిధ్యంకోసం మింగుతోంది. 1877 వ సంవత్సరంలో "కౌంటీ ఆఫ్ స్టెర్లింగ్" అనే ఓడ 1444 టన్నుల గోధుమలను నింపుకొని కలకత్తానుండి వస్తూ, ఈ ఇసుక దిబ్బల ఊబిలో చిక్కుకొని కేవలం ఎనిమిదే నిమిషాల్లో చిక్కుకొన్న జాడకూడా లేకుండా అదృశ్యమైంది. 1874 వ సం ॥ లో 2, 400 టన్నుల సరుకుల్ని తీసుకెళుతున్న ఒక స్టీమరుకూ రెండే నిమిషాల్లో అదే గతి పట్టింది. ఓ గంగామాతా! నీ వదనం చిరకాలం వర్ధిల్లాలి! మమ్మల్ని సురక్షితంగా నీ ముఖకమలం నుండి బైటపడనిచ్చినందుకు నీకు ప్రణామాలను సమర్పించుకొంటున్నాను. సోదరుడు తురీయానందుడు "అయ్యా! జాహ్నవీమాత ఔదార్యానికి ఒక మేకను బలి ఇవ్వాలి" అన్నాడు. "తప్పకుండా యివ్వాలి. కాని తమ్ముడూ! ఒక్కరోజే ఎందుకు? ప్రతిరోజు ఇవ్వాలి" అన్నాన్నేను. మర్నాడు సోదరుడు తురీయానందుడు మళ్ళీ అదే ప్రసక్తి తెచ్చాడు. కాని నేను మౌనం వహించాను. మర్నాటి భోజనవేళ మేకల బలి ఎంతవరకు వచ్చిందని నేనడిగాను. సోదరుడు కాస్త కలవరపడి ఇలా అన్నాడు: "ఏమిటి నీ అభిప్రాయం? తినేవాడివి నువ్వే కదా!" అప్పుడు నేనతడికొక కథ చెప్పాల్సి వచ్చింది. కలకత్తాలో ఒక యువకుడుండేవాడు. గంగానదికి ఎంతో దూరంలో అతడి అత్తగారి మారుంది. అతడక్కడికెళ్ళాడు. భోజన సమయంలో కొంతమంది తప్పెట్లు పట్టుకొని అక్కడకు వచ్చారు. అతడి అత్తగారు భోజనానికి ముందు అతణ్ణి కొంచెం పాలు తీసుకోమంది. 'బహుశా ఇది ఇక్కడి ఆచారమేమో! ఒప్పుకుంటే సరిపోతుంది' అనుకొని అల్లుడు ఒక గుక్కెడు పాలు తాగాడు. వెంటనే చుట్టుపక్కల తప్పెట్లు మోగటం ప్రారంభమైంది. అతడి అత్తగారు అతడి తలమీద చెయ్యివుంచి ఆనందాశ్రువులతో యిలా అంది: "నాయనా! నువ్వు నిజంగా పుత్రధర్మాన్ని యీరోజు నిర్వర్తించావు. ఇలా చూడు. నీ కడుపులో గంగాజలం వుంది. నువ్వు అక్కడి వాడివేకదా. మరి యీ పాలలో 'చనిపోయిన' నీ మామగారి అస్థికల పొడిని కలిపాం. ఇవి నువ్వు తాగటంతో ఇక ఆ అస్థికలు గంగలో కలిపినట్లేకదా! దానివల్ల వచ్చే పుణ్యం నీ మామగారి జీవాత్మకు లభించింది." ఈ కథ నేను తురీయానందుడికి చెప్పి ప్రస్తుత విషయానికి అన్వయించాను. కలకత్తానుండి ఒక వ్యక్తి ఈ ఓడలో ప్రయాణం చేస్తున్నాడు. ఇక్కడ మాంసంతో

పలు రకాల వంటకాలు తయారుచేస్తున్నారు. ఆ కలకత్తా వ్యక్తి ఆ వంటకాలు తిన్నప్పుడల్లా గంగామాతకు మాంసం పెట్టినట్లే! కాబట్టి సోదరుడు దాన్ని గురించి మరోవిధంగా ఆలోచించనక్కర్లేదు. తురీయానందుడు గంభీర స్వభావుడు కదా! నా ఉపన్యాస ప్రభావం అతనిమీద ఎలా పనిచేసిందో తెలుసుకోవటం కష్టం.

ఓడ ఎంత ఆశ్చర్యకరమైన వస్తువు.! ఒడ్డునుండి చూస్తే సముద్రం ఎంతో భయంకరంగా వుంటుంది. దాని గర్భంలో ఆకాశం వంగి కలిసి పోయినట్లుంటుంది. దాన్లోనుండి బాలసూర్యుడుదయించేటట్లు, దాన్లోనే అస్తమించేటట్లు వుంటుంది. ఆ సముద్రుడికి కొంచెం కోపరేఖ తోస్తే, మన హృదయాలు తల్లడిల్లుతాయి. అలాంటి సముద్రం యీ ఓడలవల్ల ఒక రాచబాటగా – ఎంతో తేలికైన మార్గం కింద మార్చివెయ్యబడింది. ఈ ఓడ నెవడు కనిపెట్టాడో – ప్రత్యేకించి ఒకడే కనిపెట్టివుండడు. మానవుడికి ఎంతో అవసరమైన యంత్రపరికరాలన్నీ కనుగొనబడినట్లే క్రమక్రమంగా హెచ్చు తగ్గులు సరిచూసి అనేకులు సమిష్టిగా శ్రమించి దీన్ని కనిపెట్టి వుంటారు. చక్రాలు తీసుకోండి. అవి లేకుండా మన జీవితం గడవనే గడవదు. కిరకిరలాడే ఎడ్లబండి నుండి జగన్నాథస్వామి రథం వరకు, నూలు వడికే రాట్నం నుండి కర్మాగారాల్లోని పెద్ద యంత్రాలదాకా ఈ చక్రం ఉపయోగం వుంది. ఈ చక్రాన్ని ఎవరు కనిపెట్టారు? ఫలానావాడని చెప్పటానికి వీలులేదు. అందుచేత ఇది సమిష్టి ప్రయత్న ఫలితమని చెప్పాలి. ప్రాచీనమానవుడు గొడ్డలితో చెట్లను కొట్టేవాడు. ఏటవాలు ప్రాంతాల్లో పెద్ద పెద్ద చెట్ల బోదెలను దొర్లించేవాడు. క్రమక్రమంగా గుండ్రని చక్రాకృతుల కింద ఈ చెట్ల బోదెలు కొయ్యబడేవి. కాలక్రమంలో చక్రాల ఇతర భాగాలు కనిపెట్టబడ్డాయి. ఈ ఒక్క చక్రం ప్రస్తుత రూపాన్ని పొందటానికి ఎన్ని వేల సంవత్సరాలు పట్టిందో ఎవరు చెప్పగలరు? కాని హిందూదేశంలో ఈ అభివృద్ధి దశాక్రమమంతా జాగ్రత్తగా కాపాడబడింది. అది ఎంత అభివృద్ధి చెందినా, మార్పు చెందినా ఈ పరిణామాల్లోని దశాభేదాల నన్నింటిని ఆశ్రయించి జీవించే జనం వున్నారు. అందుచేత ఈ క్రమమంతా అలాగే నిలిచివుంది. మొదట్లో ఒక వెదురు ముక్కకు ఒక తీగ కట్టి శ్రుతి చెయ్యటానికి ఒక యంత్రం నిర్మించుకొన్నారు. తరువాత ఒక వంపు కర్రకు

గుఱ్ఱపు వెంట్రుకలు కట్టి మొదటి వయోలిన్ యంత్రాన్ని నిర్మాణం గావించారు. అది అనేక మార్పులు చెంది, వివిధాలైన దారాలు, నరాలు కూర్చబడి అనేక పేర్లుపొంది ఇప్పుడు పరిపూర్ణమైన గిటార్ మరియు సారంగి రూపొందాయి. కాని ఇప్పటికీ బండి తోలుకొనే తురకవాడు ఆ గుఱ్ఱపు వెంట్రుక కట్టిన వంపుకఱ్ఱతో కుండకు కలిపి కట్టిన వెదురు గొట్టంమీద వాయిస్తూ, చేపల వల అల్లుతూ 'మజ్వర్ కహర్' కథను గానం చెయ్యటం లేదా? ఇప్పుడూ మధ్యభారత ప్రాంతాలకు వెళ్లి చూడండి. అక్కడ ఈ రబ్బరు టైర్ల రోజుల్లో కూడా వీథుల్లో మొరటయిన కొయ్యచక్రాల బళ్లు మనకు కానవస్తాయి. ఇవి ఆ జనం మందబుద్ధిని ప్రకటిస్తే ప్రకటించవచ్చును.

అతిపురాతన కాలంలో అంటే స్వర్ణయుగంలో ప్రజలు నిష్కపట చిత్తులుగా వున్నప్పుడు, అంటే 'లోపల ఒకటీ, బయట వేరొకటీ' అయితే నయవంచకుల మవుతామేమో అనే భయంతో శరీరాచ్ఛాదనం చేసుకోని రోజుల్లో, స్వార్థమవుతుందేమో అని వివాహంకూడా చేసుకోని రోజుల్లో, స్వపరభేదం లేని రోజుల్లో యితరుల సొమ్మును మట్టితో సమానంగా చూసే రోజుల్లో, కఱ్ఱలను, రాళ్లను ఆయుధాలుగా ఉపయోగించే రోజుల్లో* – అలాంటి 'మంచి' రోజుల్లో నీళ్లమీద ప్రయాణం చెయ్యటానికి వారు తెప్పలను, దోనెలను తయారుచేసేవారు. దీనికోసం ఒక చెట్టు లోపలి భాగాన్ని కాల్చి కొన్ని కొయ్యలకు దగ్గరగా చేర్చి కట్టి నిర్మించిన నాటుపడవలు ఒరిస్సానుండి కొలంబోవరకు పోవటం చూసేవుంటారు గదా! అవి సముద్రంలో ఎంతదూరం పోతాయోకూడా మీరు గమనించి వుంటారు. ఓడల నిర్మాణానికి బీజం మనకు యీ నాటుపడవల్లో కనిపిస్తుంది.

మరి తూర్పు వంగదేశ పల్లెవాళ్ల పడవలను మీరెక్కాలనుకుంటే మీ భద్రతకోసం నదీమతల్లి అభిమాన ఋషుల నైదుగురిని ప్రార్థించి మరీ ఎక్కాలి. చిట్టగాంగ్ పల్లెవాళ్లు నడిపే పడవ ఒక మాదిరి ఇల్లులా వుంటుంది. ఎంత చిన్న గాలికొట్టినా అందలి చుక్కాని పట్టుతప్పిపోతుంది. ఇక ప్రయాణికులందరూ ఆఖరి ప్రయత్నంగా తమ ఇష్టదైవాలను

తలచుకోవలసిందేగాని వేరే దారిలేదు. మరి పెద్ద నాటుపడవలున్నాయి. వాటి ముఖప్రాంతంలో రెండు అద్భుతమైన పెద్దఇత్తడికళ్లు వుంటాయి. తెడ్లవాళ్లు నిలబడి తెడ్లు వేస్తారు. కవికంకణుడు శ్రీమంతుడి ఓడ ప్రయాణానికి వుపయోగించిన పడవ ఇదే. కవికంకణుడు ఇలా చెప్పాడు: "శ్రీమంతుడు తెడ్డు వేసుకొంటూ బంగాళాఖాతాన్ని దాటాడు. ఆ సందర్భంలో కొన్ని సొరచేపల గుంపులో అతడి పడవ చిక్కుకొని మునిగిపోయేటంత పనయ్యింది. అతడొక పెంకును చిన్నచేప అనికూడా పొరపడ్డాడు." – ఇలాంటిది మన గంగాసాగర పడవ. దాని పైకప్పు అందంగా వుంటుంది; లోపలి భాగం వెదురు బద్దలతో నిర్మించబడి ఉంటుంది; దాన్లో గంగాజలంతో నింపిన బిందెలు వరుసలు వరుసలుగా ఉంటాయి; ఆ గంగాజలం చల్లగా తియ్యగా వుంటుంది. (మీరు మంచి శీతాకాలంలో గంగాసాగరాన్ని దర్శిస్తారు. కాబట్టి ఆ ఉత్తరపు చలిగాలి మీకసలు ఆ చల్లని నీటిని త్రాగాలనే కోరికను సమూలంగా నశింపచేస్తుంది) ఈ గంగాసాగరపు చిన్నపడవ ప్రతిరోజు ఈ బెంగాలీబాబులను యింటివద్దనుండి ఆఫీసులకు, తిరిగి ఇంటికి చేరవేస్తుంది. ఒక బాలీవాసి ఈ నావమీద అజమాయిషీ చేస్తుంటాడు. అతడు బహునేర్పరి. మంచి తెలివిగలవాడు. మైలు దూరంలో ఒక మబ్బుతునకను చూసినా వెంటనే అతడు జాగ్రత్తపడి పడవను ఒడ్డుకు చేరుస్తాడు. ఇప్పుడు పడవలు అతిబలిష్ఠులైన జాన్పూర్ మనుషుల చేతుల్లోకి పోయాయి. వీరొక తరహాభాష మాట్లాడతారు. వీరిని మీ మహంత్ మహరాజ్ పరిహాసానికి ఆ సముద్రపు కొంగలను పట్టుకోమని ఆజ్ఞాపించాడు. ఆ సముద్రపు కొంగలను 'బకాసురు' లని ఆయన పేర్కొన్నాడు. ఇది వారికర్థంకాక కంగారు పడిపోయి "అయ్యా! ఆ రాక్షసుడు మాకెక్కడ చిక్కుతాడు? మాకు బొత్తిగా అర్థమవటంలేదు" అని గొణిగారు. మరి 'గాడిద' (గాధా) అనే వెక్కిరింత పేరున్న పడవ వుంది. అది నెమ్మదిగా పోతుంది. అదెప్పుడూ నియమంగా సూటిగా వెళ్ళక పక్కలకే వెళుతుంది! మరి ఆ పెద్దతరహా పడవలు ఓడలకు పక్కకట్టు పడవల లాంటివి. వీటికి ఒకటో, రెండో, మూడో తెరచాపలుంటాయి. ఇవి సిలోన్, మాల్దీవులు, అరేబియా దేశాలనుండి కొబ్బరికాయలు, ఖర్జూరాలు, ఎండు చేపలు మొదలైన వాటిని మనకు దిగుమతి చేస్తాయి. ఈ పడవలన్నీ నౌకానిర్మాణ పరిణామంలో విభిన్న దశాభేదాలను తెలియచేస్తాయి.

తెరచాపలతో పడవలను నడిపే విధానం కనిపెట్టటం విచిత్రమైన విషయం. ఏ పక్కకు గాలివీస్తున్నా ఆ తెరచాపలను నేర్పుగా సడలిస్తే మన గమ్యప్రాంతానికే ఓడ చేరుతుంది. గాలి వ్యతిరేక దిశలో వీచేటప్పుడు ప్రయాణానికి కొంత ఎక్కువ సమయం పడుతుంది. ప్రయాణం చేస్తూన్న పడవ చూడ్డానికి ఎంతో అందంగా వుంటుంది. దూరంనుండి చూస్తే అనేక రెక్కలున్న పెద్ద పక్షి ఆకాశం నుండి దిగుతున్నట్లు వుంటుంది. తెరచాపలు ఓడను సూటిగా పోనివ్వవు. కాస్త గాలి వ్యతిరేకంగా వుంటే కొంచెం అడ్డదిడ్డంగా పోవాల్సి వుంటుంది. మరి గాలి అసలేమాత్రం లేకుండా నిశ్చలంగా వుంటే అప్పుడు ఓడ నిస్సహాయస్థితిలో పడిపోతుంది. భూమధ్యరేఖకు సమీప ప్రాంతాల్లో సామాన్యంగా ఇప్పటికీ అలాంటి స్థితే వుంది. ప్రస్తుతం తెరచాపలున్న పడవలు అధికభాగం ఇనుముతో నిర్మించబడినవి. ఏ కొంచెమో కలప వుండొచ్చు. ఈ తెరచాప పడవల్లో సరంగుగా వుండటం స్టీమర్‌లోకంటె కష్టమైన పని. ఎంతో అనుభవశాలై వుంటేగాని మంచి సరంగు కాలేడు. ముఖ్యంగా ఈ తెరచాప పడవల్లో సరంగుకు రెండు విషయాలు బాగా తెలిసుండాలి. ఒకటి అడుగడుక్కూ గాలి స్వభావం ఎలా వుంటుంది అనేది. రెండోది మార్గమంతటా ఎక్కడెక్కడ అపాయ ప్రాంతాలున్నాయో తెలుసుకొని, ముందు జాగ్రత్త తీసుకోవటం. ఈ రెండు విషయాలు స్టీమర్ సరంగుకంటె తెరచాపల ఓడ సరంగుకు ఎక్కువ అవసరం. స్టీమర్ అధిక భాగం మనిషి అదుపులో వుంటుంది. కావలసినప్పుడు క్షణంలో యంత్రాలను ఆపేయవచ్చును.ముందుకు, వెనక్కు, పక్కలకు, కావలసిన దిక్కుకు, స్వల్పవ్యవధిలోనే స్టీమర్‌ను తిప్పవచ్చును. కాని తెరచాప ఓడలు గాలి అధీనంలో వుంటాయి. చాపలు దించేలోపు, చుక్కాని తిప్పేలోపు ఓడ వెళ్లి ఏ దిబ్బనో, ఏ నీళ్లలోవున్న కొండనో ఢీకొనవచ్చును. లేక మరో ఓడను ఢీకొనవచ్చును. ఈ రోజుల్లో తెరచాప పడవలు కూలీలను తప్ప ప్రయాణీకులను అరుదుగా ఎక్కించుకొంటాయి. సామాన్యంగా యివి సరుకులను చేరవేస్తాయి. అవికూడా ఉప్పు వగైరావంటి తక్కువ ఖరీదు సరుకులను మాత్రమే. కొన్ని చిన్న తెరచాప పడవలు తీర వాణిజ్యానికి ఉపయోగపడతాయి. తెరచాప పడవలు సూయజ్ కాలువగుండా ప్రయాణం చెయ్యవు. దానికి కారణాలు రెండు: ఒకటి, సూయజ్ గుండా వాటిని

చేరవెయ్యటానికి స్టీమర్లకు బాడుగ పైకం చెల్లించుకోలేవు. రెండు, కాలువ అధికారులకు వేలకొద్దీ రూపాయల పన్ను చెల్లించుకోలేవు. అందుచేత యివి ఆఫ్రికానంతా చుట్టుతిరిగి, ఆరు నెలలకు ఇంగ్లండుకు పోవాలి.

తెరచాప పడవల్లో వున్న ఈ ఇబ్బందుల కారణంగా పూర్వకాలంలో నౌకాయుద్ధం ఎంతో ప్రమాదభరితంగా వుండేది. గాలిలో ఏ కాస్త మార్పు వచ్చినా, సముద్ర ప్రవాహంలో ఏ కాస్త మార్పు కలిగినా యుద్ధఫలితాన్ని అదే నిర్ణయిస్తుంది. అంతేకాక ఆ ఓడలు కలపతో నిర్మించినవి కాబట్టి తేలిగ్గా వాటికి మంటలంటుకొనేవి. అంటుకొంటే ఆర్పటం కష్టం. వాటి నిర్మాణం ఎంతో భిన్నమైంది. ఒక పక్క చదునుగా, ఎక్కువ ఎత్తుగా వుండేది. ఐదారు అంతస్తులుండేవి, ఆ పైఅంతస్తులో ఒక పక్క ఒక కొయ్య వరండా. దానిముందు ఓడ నాయకుడి గది, కార్యాలయం, రెండు పక్కల తక్కిన ఉద్యోగుల గదులు, తరువాత పెద్ద ఖాళీ ప్రదేశం ఏర్పాటై వుండేది. రెండోపక్క కొన్ని గదులుండేవి. కింది అంతస్తుల్లో కూడా అటువంటివే వుండేవి. పైకప్పున్న చావడులు ఒకదాని కింద ఒకటిగా ఉండేవి. మొదటి అంతస్తులో నావికుల భోజనశాలలు, పడకగదులు ఉండేవి. ప్రతి అంతస్తులో ఇరుపక్కల వరుసగా పెట్టిన ఫిరంగులు. వాటి గొట్టాలు, ఓడ గోడల్లో వరుస కంతలనుండి ముందుకు పొడుచుకొని ఉండేవి. ఆ ఫిరంగుల ఇరుపక్కలా ఫిరంగి గుళ్లు కుప్పలు పోసి ఉండేవి. తుపాకి మందు సంచుల్లో పెట్టబడివుండేది. ఈ పురాతన యుద్ధనౌకల్లోని అంతస్తులన్నీ అంత ఎత్తుగా వుండని కప్పులతోకూడి వుండేవి. మనిషి తలవంచి నడువవలసిందే. మరి ఇంతేగాక నౌకాయుద్ధానికి ఓడలను సమకూర్చుకోవటంకూడా ఇబ్బందితో కూడుకొన్న పనే. ప్రభుత్వం ఒక ఆజ్ఞను జారీచేసి వుండేది. మనుషులు కనిపిస్తేచాలు. బలవంతంగానో, కపటంగానో వారిని యీ ఓడల్లోకి చేర్చేవారు. దౌర్జన్యంగా తల్లులనుండి కొడుకులను, భార్యలనుండి భర్తలను లాక్కొనిపోయేవారు. ఒకసారి వారిని ఓడపై ఎక్కిస్తే చాలు. (వారి జన్మలో పాపం పూర్వమెప్పుడూ వాటి నెక్కివుండరు) వారిని ఓడ తెరచాప కొయ్యమీద కెక్కిస్తారు. వారు భయంతో ఎక్కలేకపోతే వీపు చీలిందన్నమాటే. ఈ అగ్నిపరీక్షకు తట్టుకోలేక కొందరు చచ్చిపోయేవారు. ఈ నియమాలు, ఈ సూత్రాలు జారీచేసేవారంతా ఆయా

దేశాల్లోని ధనవంతులు, పలుకుబడి వున్నవారు. వ్యాపారం, దోపిడి, ఇతర దేశాలను జయించటం మొదలైన పనులతో వచ్చిన లాభాలన్నీ వీరి వంతు. తక్కిన పేద ప్రజలు రక్తాన్ని చిందించాలి. జీవితాలు ధారపొయ్యాలి. ప్రపంచ చరిత్ర మొత్తంలో జరుగుతోంది ఇదే! ఇప్పుడు యిలాంటి నియమాలు లేవు. ఇప్పుడు యుద్ధనౌకలలోకి మనుషులను చేర్చుకొనే అధికారుల పేరు విని పేదవారెవరూ గజగజలాడిపోనక్కర్లేదు. ఇప్పుడు ఓడలోకి చేరటం స్వేచ్ఛా వ్యవహారం. యువకులైన అపరాధులు జైళ్ళలోకి పంపబడటానికి బదులు యుద్ధనౌకల్లో నావికులుగా శిక్షణపొందుతున్నారు.

ఆవిరిశక్తి పరిస్థితినంతా మార్చేసింది. ఇప్పుడు ఓడల్లో తెరచాపలు వట్టి అలంకారాలు. ఇప్పుడు ఓడలు గాలిమీద ఆధారపడవు. ప్రస్తుతం తుపానులవల్ల అంత ప్రమాదం లేదు. తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ సముద్రంలోని కొండలను గురించి మాత్రమే. ఓడలు వాటిని ఢీకొనకుండా వుంటే చాలు. ప్రస్తుతం యుద్ధనౌకలుకూడా పూర్వపు నౌకలకంటె ఎంతో వ్యత్యాసమైనవి. అవి యిప్పుడు ఓడల మాదిరి కన్పించనే కనిపించవు. నీళ్లమీద విభిన్న పరిమాణాల్లో తేలుతున్న ఉక్కుకోటల మాదిరి అవి కనిపిస్తాయి. ఫిరంగుల సంఖ్యకూడా చాలతగ్గింది. వాటి యిప్పటి "టర్రెటు తుపాకుల" ముందు పూర్వపు ఫిరంగులు వట్టి పిల్ల సమీరులే. ఈ అధునాతన యుద్ధనౌకలు ఎంతో వేగవంతమైనవి. వీటిలో అతిచిన్నవి టార్పెడో పడవలు. కొంచెం పెద్దవి శత్రువుల వర్తక నౌకలను పట్టుకోవటానికి ఉపయోగించేవి. ఇంకా పెద్ద నౌకలు నౌకాయుద్ధంలో పాల్గొనటానికి నిర్మించబడ్డాయి.

అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజాయుద్ధ కాలంలో కొయ్య ఓడల బైటి గోడలను కప్పటానికి ఉక్కుకడ్డీలను వరుసలుగా యూనియనిస్ట్ పార్టీ ఉపయోగించింది. శత్రువుల ఫిరంగి గుళ్ళు ఈ ఉక్కుకడ్డీలకు తగిలి క్రింద పడిపోయేవి. ఓడకు నష్టమేమీ జరిగేది కాదు. దీనితో ఓడ గోడలకు శత్రువుల తుపాకి గుళ్లవల్ల ముప్పులేకుండా వుండటానికి ఉక్కు తొడుగు వెయ్యటం ఆరంభమైంది. ఓడ ఫిరంగులుకూడా ఎంతో పురోభివృద్ధి గాంచాయి. పెద్ద పెద్ద ఫిరంగులు

వచ్చాయి. వాటిని మందుతో నింపటం, కావలసిన పక్కకు తిప్పటం, ప్రయోగించటం మొదలైన పనులకూ కావలసిన యంత్రాలు వచ్చాయి. పూర్వం ఐదు వందలమంది మనుషులు కూడా కదిలించలేని ఫిరంగిని నిలువుగాకాని, అడ్డంగాకాని ఒక మీటనొక్కటంతో ఒక చిన్నకుర్రవాడు తిప్పగలడు. మందుతో, గుళ్లతో నింపగలడు. ప్రయోగించగలడు. దీనికంతా ఒక క్షణమైనా పట్టదు! ఓడల గోడల యీ ఉక్కు తొడుగుల మందం పెరుగుతున్నకొద్దీ ఫిరంగుల శక్తి కూడా పెంపొందింది. పిడుగుల్లాంటి ఫిరంగులు నిర్మించబడుతున్నాయి. ఈనాటి యుద్ధనౌకలంటే ఉక్కుగోడలతో నిర్మించబడ్డ కోటే. ఫిరంగులంటే కేవలం మృత్యువే! ఒక్క దెబ్బతో ఎంత పెద్ద ఓడనైనా ముక్కలుగా కొట్టివెయ్యవచ్చును. కాని బెంగాలీ జానపద కథలోని నకిందరుని తండ్రి కూడా మాహించలేని "ఈ ఉక్కు అంతఃపురం", "సాతాలీకొండ" మీదకెక్కి పట్టుబడటానికి బదులు డెబ్బైవేల పర్వత సదృశ తరంగాలమీద నాట్యం చేస్తుంది. అయినా యిదికూడా టార్పెడోలంటే గజగజ వణికిపోతుంది. 'టార్పెడో' అంటె చుట్టమాదిరి వుండి ఒక వంకకు ప్రయోగించబడితే నీళ్ల లోపలినుండి చేపవలె వెళ్లి గురికి తగులుతుంది, క్షణంలో ఆ గురిని కొడుతుంది. దీనిలో వుండే శక్తివంతమైన పేలుడు పదార్థం విపరీతమైన ధ్వనితో పేలుతుంది. ఇది తగలగానే ఓడ ముక్కలు ముక్కలుగా పగిలిపోతుంది. ఈ పేలుడులో చిక్కుకొన్న మనుషుల జాడకూడా తెలియదు. ఏ కొంచెమైనా తెలిస్తే అది మాంసపు తునకల రూపంలో తెలుస్తుంది, ఆకారం వుండదు. ఈ టార్పెడోలు వచ్చినప్పటినుండి నౌకాయుద్ధాలు ఎక్కువ వ్యవధి పట్టటంలేదు. ఒకటి రెండు పోరాటాలతో ఒక పెద్ద విజయమో, అపజయమో సంభవిస్తుంది. కాని ఈ రకం యుద్ధనౌకలు ప్రవేశపెట్టబడటానికి పూర్వం వీటివల్ల నౌకాయుద్ధంలో ఉభయ పక్షాల జనం 'ఇంతమంది నశిస్తా' రని వెయ్యబడ్డ అంచనా యథార్థస్థితి పరిశీలనలో తప్పని తేలింది.

నౌకాయుద్ధంలో యీ నౌకలనుండి ప్రయోగించబడ్డ ఫిరంగి గుళ్లలో ఏ కొన్నైనా ఎదుటి ఓడలకు తగిలితే రెండు నిమిషాల కొకరు వంతున చావటం తథ్యం. ఇలాగే ఒక యుద్ధనౌకనుండి పేల్చబడిన ఐదువందల గుళ్లకొకటి చొప్పున తగిలితే ఉభయపక్షాల్లోనూ ఒక్క

ఓడైనా లేకుండా నశించిపోవలసిందే. కాని ఆశ్చర్యం ఏమంటే ఈ ఫిరంగులు తుపాకులు అభివృద్ధి చెందేకొద్దీ, తుపాకులు మరింత తేలికగా రూపొందే కొద్దీ, వాటిని పేల్చే కౌశల్యం పెరిగేకొద్దీ, గురి దూరం పెరిగేకొద్దీ, తుపాకిని గుళ్లతో నింపే యంత్రాంగం పెరిగేకొద్దీ, త్వరత్వరగా పేల్చటం పెరిగేకొద్దీ అవి ఎక్కువ గురితప్పటం జరుగుతూన్నట్లుంది. పూర్వం బారఖ్ జాయీలు, ఆఫ్రీదులు, పురాతనమైన పొడవైన తుపాకులతో పంగలి కర్ర మీద ఎత్తిపెట్టుకొని తుపాకి నిప్పుముట్టించి పేల్చేటప్పుడే గురితప్పేది కాదు. ఇప్పుడు సుశిక్షితుడైన యుద్ధభటుడు ఎంతో అభివృద్ధిగాంచిన యంత్ర శతఘ్నులను నిమిషానికి నూటయాభైసార్లు కాల్చగలిగినప్పటికీ దానివల్ల కలిగే ఫలితం వాతావరణం వేడెక్కటం మాత్రమే. యంత్రాంగం కొద్దిలో మంచిదే. యంత్రాంగం ఎక్కువైనప్పుడు మనిషిలోని ఉత్సాహశక్తిని నశింపచేసి, అతణ్ణి నిర్జీవమైన ఒక యంత్రంగా మార్చివేస్తుంది. కర్మాగారాల్లో మనుషులు ఒకేరకమైన పనిని రాత్రింబవళ్లు సంవత్సరాల తరబడి చేస్తుంటారు; ఒక్కొక్కతరహా పనికి కొంతమంది మనుషులు – సూదులు మొనలు చెయ్యటం, దారాలు ముడివెయ్యటం, మగ్గంతో ముందుకు వెనక్కు తిరుగుతుండటం – యిలాంటి పనులు జీవితాంతం చేస్తారు. ఆ ఉద్యోగం పోతే ఆ మనిషి చావవలసిందే. వారికి జీవనాధారం మరొకటి దొరకదు. ఈ పద్ధతిలో పనిచెయ్యటం వల్ల మనిషి నిర్జీవమైన యంత్రంలాగా మారిపోతాడు. ఈ కారణంతోనే జీవితకాలమంతా బడిపంతులుగానో, గుమాస్తాగానో పనిచేసేవారు పరమమూఢులుగా తయారవుతారు.

వాణిజ్యనౌకలు, ప్రయాణికుల నౌకలు – వీటి ఆకారం వేరు. వాణిజ్య నౌకలు యుద్ధకాలంలో ఫిరంగులతో అమర్చటానికి, శత్రువుల వాణిజ్యనౌకలను వేటాడటానికి అనువుగా నిర్మించబడి వుంటాయి. ఈ పనికి ప్రభుత్వాలనుండి ధనం లభిస్తుంది. ఇలా నిర్మించబడ్డ యుద్ధ నౌకలతో వీటికి ఎంతో వ్యత్యాసం వుంది. ఈ రెండురకాల నౌకలు చాల భాగం స్టీమర్లే. ఇవి చాల పెద్దవి, ఎంతో ఖర్చుతో కూడినవి. ఇవి ఒకే వ్యక్తి భరించేవికావు. కాబట్టి కొందరు సంఘంగా ఏర్పడి వీటి యాజమాన్యం వహిస్తారు. భారతదేశం, యూరప్ ప్రాంతాల వర్తకానికి ఉపయోగపడే నౌకలున్న కంపెనీలలో పి. అండ్ ఓ కంపెనీ ఎంతో పాతది

— ఎంతో సంపన్నమైంది. బి.ఐ.యస్.యన్. కంపెనీ రెండవది. తరువాత చాలా కంపెనీలున్నాయి. విదేశీయులకు సంబంధించిన వాటిలో మెస్సాజరీస్ మారిటైమ్స్ కంపెనీ ఫ్రెంచ్‌వారిది. ఆస్ట్రియన్ లాయడ్ కంపెనీ, జర్మన్ లాయడ్ కంపెనీ, రుదాటినో కంపెనీ ఇటలీ వారిది, చాల ప్రసిద్ధమైనవి. వీటిలో పి ఎండ్ ఓ కంపెనీవారి ప్రయాణీకుల నౌకలు భద్రమైనవి, వేగవంతాలని ప్రసిద్ధిపొందాయి. మెస్సాజరీస్ మారిటైమ్స్ కంపెనీవారి ఓడల్లో భోజన సదుపాయాలు బాగుంటాయి. ఆ సారి మేం యూరప్‌కు బయల్దేరేటప్పుడు యీ రెండు కంపెనీలవారు ప్లేగువ్యాధి భయంతో స్వజాతీయులను అంటే హిందువులను ఎక్కించుకోవటానికి నిరాకరించారు. హిందువులెవరైనా వలస కార్యాలయంనుండి తాము విదేశాలకు స్వేచ్ఛగానే పోతున్నారు; కాని ఏ విదేశీయులూ తమను బలవంతంగా బానిసలుగా అమ్మివెయ్యటానికో లేక కూలి పని చేయించటానికో తీసుకెళ్లటం లేదని నిర్ధారణపరిచే సర్టిఫికెట్ పొందనిదే విదేశాలకు పోవటానికి వీలులేదని భారతదేశ ప్రభుత్వం ఒక ఆజ్ఞ జారీచేసింది. ఈ సర్టిఫికెట్‌ను ఓడలో ఎక్కటానికి ముందు దాఖలు చెయ్యాలి. ఈ ఆజ్ఞ చాలకాలం పెద్దమనుషులైన భారతీయులకు సంబంధించినంతవరకు అమలులోకి రాలేదు. ప్రస్తుతం ప్లేగువ్యాధి ప్రబలివుంది. కాబట్టి మళ్ళీ దీన్ని పైకి తీశారు. ఫలితంగా విదేశాలకు వెళ్లే ప్రతి భారతీయుడు తన ప్రయాణ విషయాన్ని ప్రభుత్వానికి తెలుపవలసిందే. మన దేశంలో కొంతమంది పెద్దమనుషులమని, కొంతమంది నిమ్నజాతులవారిమని చెప్పుకొంటారు. కాని ప్రభుత్వం దృష్టిలో అందరూ స్వజాతీయులే! మహారాజులు, రాజులు, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అంతా ఒకే తరగతి స్వజాతి మనుషులే. కూలివాళ్లకు చెందిన న్యాయసూత్రమే ఏ రకమైన మినహాయింపు లేక నేటివ్‌లందరికీ వర్తించవలసిందే! ఓ ఆంగ్ల ప్రభుత్వమా! నీకు అభివందనాలు. నీ దయవల్ల కనీసం ఒక్క క్షణమైనా నేను "నేటివ్" లందరిలోను ఒకణ్ణని తలుస్తున్నాను. ఇలాంటి భావన ఎంతో యోగ్యమైంది. ఈ నా శరీరం కాయస్థ జాతికి చెందింది. అందుచేత అనేక తరగతులకు చెందిన జనుల విమర్శలకు గురైంది. ఈ రోజుల్లో అన్ని వర్ణాల జనులు తాము పరిశుద్ధ రక్తమున్న ఆర్యులమని చెప్పుకోవటం మనం వింటుంటాం. అభిప్రాయ భేదమంతా వారివారి నరాల్లో యీ ఆర్య రక్తం ఎంత శాతం

ప్రవహిస్తుందనే. కొంతమంది మొత్తమంతా ఆర్య రక్తమని, కొంతమంది నరాల్లో మాత్రం ఒక ఔన్సో అంతకంటె ఎక్కువో తక్కువో అని అంటుంటారు. ఒక్క విషయంలో మాత్రం వారంతా ఏకీభవిస్తారు. అది వారి వర్ణాలు కాయస్థజాతి కంటె అగ్రమని. అంతేకాక వీరూ, ఆంగ్లజాతీ ఒకే మూలం నుండి వచ్చారట. వారు ఒకరికొకరు దాయాదులట. కాబట్టి వారు దేశీయులు కారట. అంతేగాక ఈ దేశానికి వారు ఆంగ్లేయుల మాదిరే మానవీయ సూత్రాలను పురస్కరించుకొని వచ్చారట. వారి మతంలో బాల్యవివాహం, బహుభార్యాత్వం, విగ్రహారాధన, సతీ సహగమనం, ఘోషాపద్ధతి మొదలైన దురాచారాలు లేవట. ఈ దురాచారాలన్నీ కాయస్థులు, వారి సంబంధీకులైన వారివల్ల వారి మతంలోకి జొరపబడ్డాయట. వారి మతం ఆంగ్లేయుల మతంవంటిదేనట. వారి తాత, ముత్తాతలందరూ. ఆంగ్లేయుల మాదిరి వుండేవారట. ఈ ఉష్ణదేశ ఎండలతో వారు నల్లబడ్డారట. ఇప్పుడు మీ వ్యాజ్యవాదాల్లో ధైర్యంవుంటే ముందుకురండి. ప్రభుత్వం మీ అందరిని 'నేటివ్' లంటోంది. ఇంత నల్లని పూతలో యిక్కడ కొంచెం కారునలుపు, అక్కడ కొంచెం చామనచాయ అని గుర్తుపట్టటానికి వీలు లేదు. ప్రభుత్వం వారందరిని 'నేటివ్' అంటోంది. ఇప్పుడు మీరు ఆంగ్లేయుల మాదిరి వేషం వేసుకొంటే లాభంలేదు. ఇకనుండి మీ దొర టోపీలు మీకేం లాభం తెచ్చిపెట్టవు. మీరు హిందువుల నెత్తిమీద తప్పంతాపెట్టి, ఆంగ్లేయులతో సఖ్యం చెయ్యటానికి ప్రయత్నించినా దానివల్ల మీకు లభించేది ఎక్కువ చీవాట్లు, దెబ్బలు తప్ప మరేవీ కావు. ఓ ఆంగ్లరాజ్యమా! నీకు ఆశీస్సులు. నువ్వు అదృష్టదేవత ఒడిలో పెరిగే శిశువ్వి. నువ్వు ఇతోధికవృద్ధిని పొందుతావు. అందువల్ల తిరిగి మేం పూర్వీకుల నాటు దుస్తులు, అంగవస్త్రం, ధోవతి హాయిగా ధరిస్తాం. మీ దయతో మా దేశంలో యీ చివరినుండి ఆ చివరి వరకు వట్టి కాళ్లతో వట్టి తలతో ప్రయాణం చేస్తాం. మేం అలవాటు పడ్డ పప్పు, అన్నం మా పద్ధతిలో, మా చేతులతో తింటాం. ఓ భగవంతుడా! అనుగ్రహించు. మేం ఆంగ్లేయ ఇండియన్ పద్ధతుల వల్ల పాశ్చాత్య వ్యామోహంలో పడ్డాం. మేం మా స్వజాతిదుస్తులను వదలి, స్వజాతి మతాన్ని వదలి స్వజాతి మర్యాదలను, స్వజాతి పద్ధతులను వదలివేసిన వెంటనే ఈ ఆంగ్లేయులు మమ్మల్ని తమ భుజాలమీద ఎక్కించుకొని సింహాలుగా మార్చివేస్తారని చెప్పుకోవటం వింటుంటాం. మేం అలా వదలివెయ్యటానికి సిద్ధంగావున్న

సందర్భాల్లో ఈ ఆంగ్లేయుని కొరడా ఝుళిపింపు, బ్రిటీష్ బూటుతన్ను మాకు నసాళమంటాయి. వెంటనే అంతా భయభూతంచే కబళింపబడి వెనక్కు పరిగెత్తారు. ఆ ఆంగ్లపద్ధతులకు స్వస్తిచెప్పి తమ స్వజాతితనాన్ని ఒప్పుకోవటానికి ఉత్సాహపడ్డారు. "మేమెంతో శ్రమతో నేర్చుకొన్న ఆంగ్లపద్ధతులు ఆంగ్లేయుల బూట్ల తన్నులతో పారిపోయాయి."

ఓ ఆంగ్ల ప్రభుత్వమా! వర్ధిల్లు. ఈ ఆంగ్లేయుల సింహాసనం స్థిరపడనీ! వారి ప్రభుత్వం శాశ్వతమవనీ! నాలో ఆంగ్లపద్ధతులను అవలంబించాలనే యిసుమంత కోరికా ఇగిరిపోయింది. అమెరికా ప్రజలకు నా అభినందనలు. నా గడ్డం బాగా మాసి బాధ కలిగిస్తోంది. నేను ఒక మంగలి దుకాణంలోకి అడుగుపెట్టగానే, "నీలాంటి చింకిపాతలు ధరించిన వ్యక్తులకోసం ఈ దుకాణం పెట్టలేదు" అని ఎవరో కేకపెట్టారు. నా తలపాగా, కాషాయరంగు అంగరఖా చూసి వాడిలా అనుకొని వుంటాడనుకొన్నాను. ఇక నేను వెళ్లి ఒక ఇంగ్లీషు కోటు, హేట్ కొని తీరాలనుకున్నాను. నేను కొనబోతుండగా అదృష్టవశాత్తు ఒక అమెరికన్ పెద్దమనిషి కనిపించి "ఓయీ! నువ్వా కాషాయదుస్తుల్లోనే వుండటం మంచిర్రి. అప్పుడు నిన్ను గురించి ఎవరూ పొరబడరు.నువ్వు యూరోపియను దుస్తులను ధరిస్తే నిన్ను ప్రతివాడు తరిమేస్తాడు సుమా" అన్నాడు. తరువాత ఒకటి రెండు మంగలిదుకాణాల్లో నా కిలాంటి మర్యాదే లభించింది. తరువాత నేను స్వయంగా గడ్డం చేసుకోవడం నేర్చుకొన్నాను. ఒకసారి నాకు ఆకలి మండిపోతోంది. ఒక భోజనశాల కెళ్లి 'ఫలానా వస్తువు ఉందా?' అని అడిగాను. దానికి అతడిలా అన్నాడు: "మేము వాటిని నిలువచెయ్యం." "అదిగో! అదిక్కడ వుందే!" అన్నాన్నేను. తేటతెల్లగా చెప్పాలంటే ఆ మాటల కర్థం ఇది: "నీలాంటివారు ఇక్కడ కూర్చొని భోజనం చెయ్యడానికి వీలులేదు. ఎందుకంటే నువ్వు కూర్చొని భోజనం చేసే బల్ల మీద ఎవరూ కూర్చుని భోజనం చెయ్యరు. అలాచేస్తే అతగాణ్ణి వెలివేస్తారు." అని వివరించాడతడు. అప్పుడు అమెరికా, జాతి భేదాలతో కూడుకొన్న నా స్వదేశంలా బాగానే కనిపించింది. ఈ తెల్ల, నల్ల వ్యత్యాసాలు స్వజాతి మనుషుల్లోని, ఈ ఆర్యరక్తంలోని హెచ్చుతగ్గులు, ఈ వంశవృక్షాన్ని గురించి 'బానిసలు' యింత కట్టుదిట్టంగా వుండటం ఎంత అసహ్యకరం! ఒక 'డోము' జాతివాడు (చిమ్మేజాతి) యిలా

అంటుండేవాడు: "మా జాతికంటె గొప్ప జాతి ప్రపంచంలో లేదు. మేం దోములం సుమా." ఇది ఎంత హాస్యాస్పదమైన విషయమో చూడండి. ఈ వర్ణ భేదమంతా లోకంలో మర్యాదలేని హీనజాతుల్లోనే అధికంగా కనిపిస్తుంది.

సాధారణంగా స్టీమర్లు తెరచాప ఓడలకంటె పెద్దవి. అట్లాంటిక్ మహాసముద్రంగుండా ప్రయాణం చేసే స్టీమర్లు 'గోల్కొండ'* స్టీమరుకంటె ఒకటిన్నర రెట్లు వుంటాయి. జపాన్‌నుండి పసిఫిక్ మహాసముద్రంలో నేను ప్రయాణం చేసిన ఓడకూడా చాల పెద్దది. పెద్ద ఓడల్లో మధ్యభాగంలో మొదటి తరగతి గదులుంటాయి. వాటికి రెండు పక్కల ఖాళీ స్థలం వుంటుంది. తరువాత రెండవ తరగతి గదులుంటాయి. వాటి కిరువైపుల తక్కువ తరగతి ప్రయాణీకులు కూర్చునే వసారాలుంటాయి. ఒక చివర నావికులకు, పనివారికి గదులుంటాయి. ఈ తక్కువ తరగతి ప్రయాణీకులు మూడవ తరగతివారు. వీరిలో చాల పేదవారు, అమెరికా, ఆస్ట్రేలియాలకు వలసపోయినవారిని పోలినవారు ఉంటారు. ఆ గదులు ఎంతో ఇరుకుగా వుంటాయి. వారికి తిండి బల్లలమీద పెట్టరు. చేతుల్లో పెడతారు. భారతదేశం, ఇంగ్లండ్ మధ్య పయనించే ఓడల్లో ఇలాంటి గదులు లేవు. కాని ఆ ఓడల్లో 'డెక్' ప్రయాణీకులుంటారు. ఒకటి, రెండు తరగతుల మధ్యవుండే ఖాళీస్థలాన్ని ఈ డెక్ ప్రయాణీకులు కూర్చోటానికి, పడుకోటానికి ఉపయోగిస్తారు. కాని దూరప్రయాణం చేసే డెక్ ప్రయాణీకుడెవరూ నాకు తారసపడలేదు. 1893 వ సంవత్సరంలో బొంబాయినుండి హాంకాంగ్‌కు చైనా దేశస్థులనేకులు డెక్ మీద ప్రయాణం చెయ్యటం నేను చూశాను.

తుపాన్ గాల్లో ఈ డెక్ ప్రయాణీకులు చాల ఇబ్బందిపడతారు. ఇంతేకాకుండా రేవుల్లో సరుకులు దింపేటప్పుడుకూడా కొంత యిబ్బందికి గురౌతారు. అన్నిటికంటె పైనవుండే తుపాన్ డెక్‌లో తప్ప తక్కిన కింది డెక్‌లలో ఒక చదరమైన ఖాళీస్థలం వుంటుంది. దాన్లోనుండి సరుకుల నెక్కించటం, దించటం చేస్తారు. ఆ సందర్భాల్లో మాత్రం డెక్ ప్రయాణీకులకు కొంత యిబ్బంది తప్పదు. కాకపోతే కలకత్తానుండి సూయజ్‌కు, వేసవికాలంలో ఐతే యూరప్ దేశాల గుండానైనా

డెక్ మీద ప్రయాణం రాత్రిళ్లు ఎంతో హాయిగా వుంటుంది. మొదటి తరగతి, రెండవ తరగతి ప్రయాణీకులు, వారి సౌకర్యవంతమైన గదుల్లో అమితమైన ఆవిరిలో వుడికిపోతూంటే డెక్‌మీద స్వర్గంలో వున్నట్లుగా వుంటుంది. ఇలాంటి ఓడల్లో రెండవ తరగతి చాల అసౌకర్యంగా వుంటుంది. జర్మనీలోని బెర్లిన్ ఆస్ట్రేలియాల మధ్య తిరుగుతున్న కొత్తగా స్థాపించిన జర్మన్ లాయడ్ కంపెనీవారి ఓడల్లో మాత్రం రెండవ తరగతిలో చాలా సౌకర్యాలున్నాయి. 'తుపాన్‌డెక్' లో కూడా కొన్ని గదులున్నాయి. భోజన సదుపాయాలు 'గోల్కొండ' ఓడలోని మొదటి తరగతితో దాదాపు సమానంగా వుంటాయి. ఆ ఓడల మార్గమధ్యంలో కొలంబో తగులుతుంది.

గోల్కొండ ఓడలో తుపాన్ డెక్ మీద రెండు వైపుల రెండు గదులున్నాయి. ఒకటి డాక్టరుకు, ఒకటి మాకు యిచ్చారు. కాని వేడి చాలా ఎక్కువగా వుండటంవల్ల మేం కింది డెక్‌లో వుండాల్సి వచ్చింది. తుపాన్‌డెక్‌లో మాకు యిచ్చిన గది సరిగ్గా ఇంజనుపైన వుంది. అందువల్ల మాకు వేడి ఎక్కువ. ఓడ ఉక్కుతో చెయ్యబడ్డా ప్రయాణీకుల గదులు మాత్రం చెక్కతోనే కట్టారు. ఈ చెక్కగోడలకు పైన, కింద గాలి ధారాళంగా ప్రసరించటానికి కొన్ని కంత లేర్పాటు చేశారు. ఈ గోడలకు దంతపురంగు వేశారు. ఒక్కొక్క గదికి యీ రంగు వెయ్యటానికి 25 పౌనులు ఖర్చు అయివుంటుంది. నేలమీద ఒక చిన్న పట్టా పరిచారు. ఒక గోడ పక్కన గోడలోనే రెండు ఇనుప బల్లలు, కాళ్లులేని మంచాలు ఒకదాని మీద ఒకటి గోడలో నుంచి అమర్చారు. దాని కెదురుగా వున్న గోడకు కూడా యిలాంటివే రెండు బల్లలు కూర్చారు. ద్వారాని కెదురుగా చేతులు కడుక్కోవటానికి ఒక తొట్టె, ఒక అద్దం, రెండు సీసాలు, నీళ్లు తాగటానికి రెండు గ్లాసులు, మంచాల పక్క ఇత్తడి తడక అమర్చబడ్డాయి. దీన్ని గోడకు వాల్చవచ్చును, తీసెయ్యవచ్చును. దానిమీద ప్రయాణీకులు నిద్రించటానికి ముందు వారి చేతి గడియారంగాని యితర ముఖ్య వస్తువులుగాని పెట్టుకోవచ్చును. రెండవ తరగతిలోకూడా ఇలాంటి సదుపాయాలే ఉన్నాయి. ఒక్కటే వ్యత్యాసం. చోటు కొంచెం తక్కువ. కుర్చీలు, మంచాలు మొదలైనవి అంత నాణ్యమైనవికావు. ఈ ఓడ వ్యాపారమంతా దాదాపు ఆంగ్లేయుల హస్తగతమైంది. అందుచేత యితర దేశస్థులు నిర్మించిన నౌకల్లో కూడా ఆహార సదుపాయాలు, కాలనియమాలు వాటిలో

ప్రయాణంచేసే ఆంగ్లేయులకు అనువుగా వుండేట్లు ఆంగ్లపద్ధతినే పాటిస్తారు. ఇంగ్లండు, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా మొదలైన దేశాల్లో ఆహర విషయంలో కాలనియమంలో ఒక దేశానికి మరొక దేశానికి మధ్య చాలవ్యత్యాసం వుంటుంది. మన దేశంలోకూడా వంగదేశం, ఉత్తర హిందూస్థానం, మహారాష్ట్ర, గుజరాత్ మొదలైన ప్రాంతాల మధ్యకూడా ఇలాంటి వ్యత్యాసమే వుంది కదా. కాని ఈ వ్యత్యాసాలు ఓడల్లో అంతగా పాటించరు. ఎందుకంటే వీటిలో ప్రయాణం చేసేవారిలో ఆంగ్లం మాట్లాడే ప్రయాణీకుల సంఖ్య అధికం. అందువల్ల ప్రతి విషయం ఆంగ్ల పద్ధతిలో మలచబడింది.

ఓడలో కెప్టెన్ పెద్ద అధికారి. పూర్వం సముద్రాలమీద యీ కెప్టెన్ ఓడలను పరిపాలించేవాడు. దోషులను శిక్షించటం, ఓడ దొంగలను ఉరితీయటం మొదలైన పనులు చేసేవాడు. ప్రస్తుతం ఈ విషయాల్లో అతడు అంతదూరం వెళ్లలేదు; కాని అతడి మాటకు ఓడమీద తిరుగు లేదు. అతని కింద నలుగురధికారులుంటారు. తరువాత నలుగురో, ఐదుగురో ఇంజనీర్లు వుంటారు. వీరు అధికారుల తరువాతి వారు. కాని వీరిలో ప్రధానుడు అధికారితో సమానుడే. అతనికి మొదటి తరగతి ఆహారం లభిస్తుంది. తరువాత నలుగురైదుగురు చుక్కానివారుంటారు; వంతులవారీగా చుక్కాని పట్టుకోవటం వీరి పని. ఇంతవరకు వీరంతా యూరోపియన్లే. తక్కినవారు పనివారు, నావికులు, బొగ్గు వేసేవారు. వీరంతా హిందువులు, మహమ్మదీయులు. పి అండ్ ఓ కంపెనీలో మాత్రం బొంబాయి ప్రాంతంలో నేను హిందువులైన నావికులను చూశాను. ఈ పనివారు, నావికులు కలకత్తానుండి వచ్చినవారు. బొగ్గు వేసేవారు మాత్రం తూర్పు వంగ ప్రాంతానికి చెందినవారు. వంటవారుకూడా ఆ ప్రాంతానికే చెందిన కాథలిక్ క్రైస్తవులు. వారితోబాటు నలుగురు ఊడ్పు పనిచేసేవారుకూడా వున్నారు. ఓడ గదులలోని మురికి నీటిని తీసెయ్యటం, స్నానానికి ఏర్పాటు చెయ్యటం, మరుగుదొడ్లు శుభ్రపరచటం మొదలైనవి వీరి పని. మహమ్మదీయ సేవకులు, లస్కర్లు క్రైస్తవుల తిండి తినరు. ప్రతిరోజూ ఓడమీద పందిమాంసం వండుతారు. అందుచేత ఏదోవిధంగా యీ మహమ్మదీయులు తమకు తామే ప్రత్యేకంగా తిండిసంపాదించుకొంటారు. కాని ఓడ

వంటశాలలో తయారైన రొట్టెను తినటానికి వారికి అభ్యంతరం లేదు. కాని కలకత్తానుండి వచ్చిన, ఆంగ్ల నాగరికత సోకిన ఆంగ్ల నావికులు మాత్రం ఆహర విషయంలో ఏ నియమాన్ని పాటించరు. పురుషులకు మూడు భోజనశాలలున్నాయి. ఒకటి పని వారికి, ఒకటి నావికులకు, ఒకటి బొగ్గువేసేవారికి. కంపెనీవారు ప్రతి భోజనశాలకు ఒక వంటవాణ్ణి, ఒక పనివాణ్ణి నియమిస్తారు. ప్రతి భోజనశాలకు వంటగదులు ప్రత్యేకంగా వున్నాయి. కొద్దిమంది హిందూ ప్రయాణీకులు కలకత్తానుండి కొలంబోకు పోతుంటారు. వారు ఆ పనివార్ల పనులయ్యాక వాటిలో ఏ వంటగదిలోనో వండుకొంటారు. ఈ పనివారు వారి మంచినీళ్లను వారే తోడుకుంటారు. ప్రతి డెక్‌మీద డెక్ గోడలకు రెండు కుళాయిలు అమర్చబడి వుంటాయి. ఇందులో ఒక కుళాయి మంచినీటిని ఒక కొళాయి ఉప్పునీటిని సరఫరా చేస్తుంది. ఈ మహమ్మదీయులంతా తమ కోసం ఈ కుళాయినుండి తోడుకొంటారు. కుళాయి నీటిని తాగటానికి అభ్యంతరంలేని హిందువులు ఇంగ్లండుకు గాని మరెక్కడకుగాని ఆహారపానీయాల విషయాల్లో తమ తమ ఆచారాలను పాటించుకొంటూ, యీ ఓడలమీద ప్రయాణం చెయ్యవచ్చును. వారు ఒక వంటశాల, మంచినీళ్లు యితరుల సంపర్కం లేకుండా వాడుకోవచ్చును. స్నానం నీరుకూడా ఎవరూ ముట్టుకోకుండా సంపాదించుకోవచ్చును. బియ్యం, పప్పులు, కూరగాయలు, చేపలు, మాంసం, పాలు, నెయ్యి మొదలైన పదార్థాలన్నీ యీ ఓడల్లో లభిస్తాయి. ఎందుచేతంటే యీ ఓడలమీదున్న పనివారిలో అధికులు హిందువులు. వీరంతా తినటానికి ముల్లంగి, క్యాబేజి, బంగాళాదుంపలు సరఫరా చెయ్యాలి. ప్రయాణానికి ముఖ్యంగా కావలసింది డబ్బు. అది వుంటే ఎక్కడకైనా వెళ్లొచ్చును. నీ ఆచార నియమాలన్నింటిని పాటించవచ్చును.

కలకత్తా, ఐరోపాల మధ్య తిరిగే ఓడలన్నింట్లోను వంగదేశ పనివారే నియమించబడతారు. క్రమంగా వారొక కులంగా రూపొందుతున్నారు. వారు కొన్ని నావిక పదాలను తయారుచేసుకొన్నారు. కెప్టెనుకు 'బారీ వాలా', ఆఫీసరుకు 'మాలం', తెరచాపకొయ్యకు 'దోల్', తెరచాపకు 'సరహ్', వంచటానికి 'ఎరియా' ఎత్తటానికి 'హబిష్' అనే

మాటలు పర్యాయపదాలైనాయి.

లస్కర్లకు, బొగ్గువారికి 'సరంగి' అనే నాయకులుంటారు. వీరి కింద ఇద్దరుగాని, ముగ్గురుగాని 'థిండల్లులు' అనే అధికారులుంటారు. వీరి కింద లస్కర్లు, బొగ్గువారు పనిచేస్తారు.

ఈ నౌకర్లకు పైన బట్లరు, అతడిపైన ఒక ఐరోపీయ 'స్టెవర్డ్' వుంటారు. లస్కర్లు ఓడలను కడుగుతారు. తాళ్లను విప్పటం, చుట్టటం మొదలైన పనులు చేస్తారు. పడవలను కిందికి దింపటం పైకిలాగటం, తెరచాపలను ఎత్తటం, దించటం వీరి పనులు. ఇలాంటివే మరికొన్ని పనులు వీరు చేస్తారు. 'సరంగు', 'తిందాలు' ఈ లస్కర్లు చేసే పనులను పర్యవేక్షిస్తూ, తిరుగుతూ వారికి సహకరిస్తారు. బొగ్గువారు ఇంజను గదిలో మంట వేస్తారు. వారు రేయింబవళ్లు ఆ మంటతో కుస్తీపట్టాలి. ఇంజనులను పరిశుభ్రం చెయ్యాలి. అంత పెద్ద ఇంజన్లను, వాటి భాగాలను పరిశుభ్రపరచటం అంత తేలికకాదు. సరంగు అతడి సహాయకుడు కలకత్తా వాళ్లు. వంగ భాష మాట్లాడతారు. పెద్దమనుషుల వేషంలో వుంటారు. చదవటం, వ్రాయటం వారికి తెలుసు. స్కూల్లో చదువుకోవటంవల్ల చక్కని ఇంగ్లీషుకూడా మాట్లాడతారు. సరంగుకు ఒక కొడుకున్నాడు, 13 ఏళ్లవాడు. కెప్టెనుకు వాడు నౌకరు. కెప్టెన్ గదిముందు వాడు ప్రతీహారిగా వుంటాడు. వంగదేస్థులైన ఈ లస్కర్లు, బొగ్గువాళ్లు, పని వారిని, వంటవారిని – వీరందరిని చూసినప్పుడు నా దేశ ప్రజలను గురించిన నా నిరాశాభావం చాలవరకు తొలగిపోయింది. బలిష్ఠమైన శరీర దార్ఢ్యంతో వీరు నెమ్మదిగా తమ మనుష్యత్వాన్ని ప్రకటించుకొంటున్నారు. వీరు నిర్భీకులు, ఐనా వినయశీలురు. 'దేశీ' యులకు సహజమైన 'అతి వినయం ధూర్తలక్షణ' మనేది యిక్కడ పాకీవారికికూడా లేదు. ఎంత మార్పు!

భారతీయ లస్కర్లు సణుగుడు లేకుండా అద్భుతంగా పనిచేస్తారు. కాని వారి జీతం ఐరోపా నావికుని జీతంలో నాల్గవవంతు మాత్రమే. ఇంగ్లండులో చాలమంది దీనివల్ల అసంతృప్తి చెందారు. ముఖ్యంగా ఓడల మీద ఉద్యోగాలు పోగొట్టుకొన్న తెల్లవారికిది అసంతృప్తి కలిగించింది. వీరంతా ఒక్కొక్కప్పుడు ఉద్యమాలుకూడా లేవదీశారు. కాని భారతీయ నావికులకు

వ్యతిరేకంగా వారు చెప్పగలదేమీ లేదు. ఎందుకంటె యీ భారతీయ లస్కర్లు తెల్లవారికంటె చురుకైనవారు. అందుచేత యీ తెల్లవారు వారిమీద చేసేఒకే ఒక్క ఆరోపణ తుఫాన్‌గాల్లో ఓడ ప్రమాదంలో వున్నప్పుడు ఈ భారతీయ నావికులు ధైర్యం కోల్పోతారని. ఓ భగవంతుడా! నిజానికి ఈ ఆరోపణకు ఆధారంలేదు. అపాయ పరిస్థితుల్లో తెల్లవారంతా భయంతో యిష్టంవచ్చినట్లు తాగుతారు. తాగి, ఒళ్లు తెలియక తిరుగుతారు. భారతీయ నావికులైతే, ఎన్నడూ వారి జీవితంలో ఒక చుక్కైనా సారా తాగరు. అపాయ పరిస్థితుల్లో వారు పిరికితనాన్ని చూపలేదు. అసలు భారతీయ సైనికుడెవడైనా యుద్ధరంగంలో వెన్నుచూపాడా? అన్నది ప్రశ్న. లేదు. కాని భారతీయ సైనికులకు నాయకులు వుండాలి. జనరల్ స్ట్రాంగ్ అని నాకొక ఆంగ్లేయ మిత్రుడున్నాడు. అతడు సిపాయి తిరుగుబాటుకాలంలో భారతదేశంలో పనిచేశాడు. అతడు నాకు అనేక కథలు చెప్పాడు. ఒకరోజు నేనతడితో మాట్లాడుతూ ఇలా అడిగాను: “ఈ సిపాయి లందరికి తుపాకులు, మందుగుండుసామగ్రి, ఆహార పదార్థాలు సమృద్ధిగా వున్నాయి కదా! అంతా ఆరితేరిన వీరభటులే గదా. అలాంటివారు ఎందుకు ఓడిపోయారు?” దాని కాయన ఇలా జవాబిచ్చాడు: “అది వారి తప్పుకాదు, వారి నాయకుల తప్పు. ఆ నాయకులు ముందు నిలబడి సైన్యాన్ని నడిపించటానికి బదులు, వెనుక సురక్షితమైన చోట నిలబడి ‘వీరులారా! పోరాడండి! ధైర్యంగా పోరాడండి.’ అంటూ అరుస్తూ వారిని పురికొల్పేవారు. నాయకుడు ముందు నిలబడి మృత్యువు నెదుర్కొంటేగాని వెనుకవుండే వీరభటులు ధైర్యంగా పోరాడలేరు. సర్వత్రా ఇదింతే. నాయకుడు తన ప్రాణాలను లక్ష్యపెట్టకూడదు. ఏదైనా ఒక ప్రయోజన సిద్ధికోసం ప్రాణత్యాగం చెయ్యటానికి సంసిద్ధుడైనప్పుడు మాత్రమే నువ్వు నాయకుడ వవటానికి అర్హుడివి. మనకలాంటి త్యాగం లేదు. కాని మనమంతా నాయకత్వాన్ని కోరతాం. కాని దానివల్ల ఫలితం శూన్యం. మన మాట ఎవడు వింటాడు?

‘ఆర్యులనుండి నేనుద్భవించా’ నని నువ్వెంత అరిచినా ప్రాచీన భారతదేశాన్ని గురించి నువ్వు రాత్రింబవళ్లు ఎంత సంకీర్తనం చేసినా, నీ జన్మకు నువ్వెంత విర్రవీగినా ఉత్తమ కులానికి చెందిన ఓ భారతీయుడా! నువ్వు, నీ తోడివారు బతికివున్నారనుకొంటున్నావా? మీరంతా

పదివేల సంవత్సరాల ముసలమ్మలు. మీ పూర్వులు నడయాడే శవాలని ఎవరిని నిందించారో నిజంగా వారిలోనే ఇప్పటికీ ఏ కొంచమో జీవశక్తి కనబడుతోంది. నిజంగా నడయాడే శవాలు మీరే! మీ ఇళ్లు, వాటిలోని వస్తుసామగ్రి, పురాతన వస్తుప్రదర్శనశాలలో ప్రదర్శ యోగ్యాలు — అవి అంత నిర్జీవాలు, ప్రాచీనాలు. మీ పద్ధతులను, ప్రవర్తనలను. కదలికలను, జీవిత పోకడలను కళ్లారా చూస్తున్నవాడు తానేదో బొమ్మ చెప్పే కథలను వినేట్లుగా భావిస్తాడు. మీతో ప్రత్యక్ష పరిచయం తరువాత ఇంటికొచ్చి ఎవడైనా తానంతకు పూర్వం ఒక పురాతన చిత్రశాలకు వెళ్లి బొమ్మలను చూసివచ్చానా? అని సందేహంలో పడతాడు. ఈ మాయా లోకంలో ఉత్తమ కులానికి చెందిన భారతీయులు; మీరే నిజమైన మాయ బొమ్మలు, ఎడారిలోని ఎండమావులు. మీరు భూతకాలానికి, దాని వైవిధ్యాలకు ప్రతినిధులు. మీరింకా కనబడటం అజీర్ణంవల్ల కలిగిన ఒక దారుణపీడకల. మీరు వట్టిశూన్యులు, భవిష్యత్తులోని వట్టి గాలి మూటలు. స్వప్నలోక నివాసులట! మీరింకా ఎందుకిక్కడ మసలుతున్నారు? మీలో మాంసం, నెత్తురు లేవు. వట్టి పురాతన భారతదేశ బొమికలగూళ్లు మీరు — మీరు త్వరగా దుమ్మై, గాలిలో ఎందుకు కలిసిపోరు? మీ కంకాళం వేళ్లకు కొన్ని అమూల్యమైన రత్నపుటుంగరాలు వున్నాయి. అవి మీ పూర్వులు సంపాదించి పెట్టినవి. మీ దుర్వాసనాభూయిష్టమైన శవాల కౌగిలింతలో ఎన్నో ప్రాచీన రత్నపేటికలు పదిలపరచబడ్డాయి. ఇప్పటి వరకు మీకు వాటిని ఇతరులకు అప్పగించే సమయం చిక్కలేదు. ఇప్పుడు ఈ ఆంగ్లేయుల పరిపాలనలో ఈ ఉచిత విద్యావిధానపు రోజుల్లో, ఈ వెలుగులో వాటిని మీ వారసులకు అప్పగించండి; వీలైనంత త్వరలో ఆ పని చెయ్యండి. చేసి మీరు శూన్యంలో కలిసిపోండి, మాయమైపోండి. మీ స్థానంలో నూతన హిందూదేశం ఉద్భవించనివ్వండి. నూతన భారతదేశం తలఎత్తనివ్వండి. నాగలి చేతబట్టిన రైతుల గుడిసెలనుండి, బెస్తవారి పూరిపాకలనుండి, చెప్పులు కుట్టేవారి పూరిళ్ళనుండి, పాకీవాళ్ళ గుడిసెలనుండి నవీన భారతదేశం ఉద్భవించనీ! వర్తకుని దుకాణంనుండి, పెసరట్టు అమ్ముకొనేవాడి పెనంనుండి నూతన హిందూదేశం జన్మించనీ! కర్మాగారాలనుండి, విపణి వీథులనుండి, తోటలనుండి, అడవులనుండి, గుట్టలనుండి, పర్వతాలనుండి, నూతన భారతదేశం తలెత్తనీ. ఈ జనసామాన్యం వేల సంవత్సరాలనుండి అణగద్రొక్కబడి కిక్కురు

మనకుండా సహిస్తూ వచ్చింది. ఫలితంగా వారిలో అద్భుతమైన సహనశక్తి అలవడింది. అచిరకాల దుఃఖానుభవ ఫలితంగా వారిలో అనంతమైన జీవనశక్తి నెలకొంది. గుప్పెడు ధాన్యం గింజలతో పొట్టపోసుకుని వారు ప్రపంచాన్నంతా తలక్రిందులు చెయ్యగలరు. వారికి చిన్న రొట్టెముక్క పెట్టండి, చాలు. ఈ సమస్త ప్రపంచం వారి శక్తికి చాలదు. వారు రక్తబీజుడి* మాదిరి అనంతమైన జీవనశక్తి గలవారు. దీనికితోడు ప్రపంచంలో మరెక్కడా లభ్యంకాని పరిశుద్ధమైన నైతిక జీవిత బలంకూడా వారికుంది. అలాంటి శాంతి, తృప్తి, ప్రేమ, ఏకధాటిగా, నిశ్శబ్దంగా పనిచేసే అలాంటిశక్తి అవసర సమయాల్లో ఆ సింహబల ప్రదర్శనం – యివన్నీ మీకెక్కడ కనిపిస్తాయి? ప్రాచీన అస్థిపంజరాలైన మీముందు మీ వారసులు, భవిష్యద్భారతదేశం వున్నాయి. ఆ భవిష్యద్భారతదేశవాసులకు మీ రత్నపేటికలను, మీరత్నపుటుంగరాలను అందించండి, త్వరగా అందించి మీరు అంతర్ధానమైపోండి. కాని అదృశ్యులై మారికే మీచెవులు మాత్రం రిక్కించి వినండి. మీరు మాయమైన మరుక్షణమే భారతదేశ పునరుజ్జీవన ప్రారంభతూర్యారావం, కోటి పిడుగుల ధ్వనికి సమానమై, విశ్వాంతరాళంలో 'జయగురు! జయగురు!' అని మారుమ్రోగే విజయనాదం ప్రతిధ్వనించటం ఆలకించండి.

మా ఓడ ఇప్పుడు బంగాళాఖాతంలో వుంది. ఇది చాల లోతైన సముద్రం. దానిలో అంత లోతులేని ప్రాంతంలో హిమాలయాలనుండి దూసుకొస్తూ, ఉత్తరప్రదేశంగుండా ప్రవహిస్తూన్న గంగానదివల్ల, ఒండ్రు పేరుకుంది. ఆ సారవంతమైన ప్రాంతమంతా మన వంగదేశం. 'సుందర వనాలు' దాటి మన వంగదేశం విస్తరించే సూచనలు లేవు. కొంతమంది 'సుందరవనాలు' పూర్వం చాలా ఎత్తైన ప్రాంతమని, అక్కడ అనేక పట్టణాలు, గ్రామాలు వుండేవని చెప్తారు. కాని అనేకులీ విషయాన్ని అంగీకరించరు. ఏమైనా 'సుందరవనాల' లో బంగాళాఖాతంలోని ఉత్తర ప్రాంతంలో అనేక చారిత్రక సంఘటనలు జరిగాయి. ఈ ప్రాంతాలు పోర్చుగీసులైన ఓడ దొంగలకు స్థావరాలు. అరకాన్ రాజు ఈ ప్రాంతాన్ని ఆక్రమించటానికి అనేక ప్రయత్నాలు చేశాడు. మొగలు చక్రవర్తి ప్రతినిధి ఈ ఓడ దొంగలను, వారి నాయకుడైన 'గొంజాలెజ్' ను శిక్షించటానికి ఎంతో ప్రయత్నించాడు. ఇక్కడే క్రైస్తవులకు, మొగలులకు, మగ్గులకు,

వంగీయులకు మధ్య అనేక యుద్ధాలు జరిగాయి.

బంగాళాఖాతం సహజంగా కల్లోలంగా వుంటుంది. దీనికితోడు ఇది వర్షాకాలం. అందుచేత మా ఓడ భారంగా ముందుకెళుతోంది. ప్రారంభమే యిలా వుంది. ఇక దీని తరువాత ఏం జరుగబోతుందో మాకే తెలియదు! మేం మద్రాసు వెళుతున్నాం కదా. దక్షిణ భారతదేశంలో అధిక ప్రాంతం మద్రాసుకు చేరింది. కాని భూవైశాల్యంలో ఏం వుంది? ఎడారైనా ఒక అదృష్టవంతుడి చేతిలో స్వర్గంగా రూపుదిద్దుకొంటుంది. పూర్వం ఈ మద్రాసు వట్టి కుగ్రామం. చెన్నపట్నమని, మద్రాసుపట్నమని దీన్ని పిలిచేవారు. చంద్రగిరి రాజు దీన్నొక వర్తకుల కంపెనీకి అమ్మాడు. అప్పుడు ఆంగ్లేయులు జావాలో వర్తకం చేసుకొనేవారు. ఇంగ్లండు యొక్క ఆసియాదేశ వాణిజ్యానికి బాంటం కేంద్రంగా ఉండేది. మద్రాసు తక్కిన ఆంగ్ల వాణిజ్యకేంద్రాలు బాంటం అజమాయిషీలో వుండేవి. ఇప్పుడా బాంటం ఏమైందో! ఇప్పుడు మద్రాసు ఎంత పెరిగిపోయిందో! 'సాహసే లక్ష్మీః' అనే నానుడిలో కొంతే సత్యం వుంది. దానికితోడు జగజ్జనని అనుగ్రహం కూడా వుండాలి. ఐనా సాహసవంతులకే లోకమాత అలాంటి అనుగ్రహాన్ని ప్రసాదిస్తుందని అంగీకరిస్తాను.

మద్రాసు దక్షిణ భారతదేశ రాష్ట్రాలకు నమూనా, కలకత్తాలోని జగన్నాథ ఘట్టంలో మనకీ దక్షిణదేశ ఛాయలు కనిపిస్తాయి. అక్కడ మనకు నడినెత్తిన పిలక పెట్టించి, తలంతా ముండనం చేయించి ముఖం మీద గంధాక్షతలు మెత్తి, బొటనవేళ్లు మాత్రమే దూరే యిరుకు చెప్పులు తొడుక్కొని, ముక్కుకు పొడుం దట్టిస్తూ, పిల్లల ఒళ్లంతా గంధం పట్టించి తిరిగే ఒరిస్సా బ్రాహ్మణులు కనిపిస్తారు కదా! గుజరాతీ బ్రాహ్మణులు, కారునలుపు, మహారాష్ట్ర బ్రాహ్మణులు, చదరపు తల, పిల్లి కళ్లు, మంచి రంగువున్న కొంకణ బ్రాహ్మణులు – వీరంతా వేషంలో ఒకే విధంగా వుంటారు. అందరూ దక్కను బ్రాహ్మణులే. అయినా దక్షిణాది నమూనా బ్రాహ్మణుడు నీకు మద్రాసులోనే కనిపిస్తాడు. అతడి ముఖం మీద పెద్ద పెద్ద నామాలు (కొత్తవారికిది బీభత్సం) వుంటాయి. (ఉత్తర భారతదేశంలో రామానంద మతంవారు ఈ రామానుజ

నామాలను అనుసరిస్తారు. మన వంగదేశ వైష్ణవులు ఒళ్లంతా భయంకరంగా నామాలు పెట్టుకొంటారు) తెలుగు, తమిళం, మళయాళం ఇక్కడి భాషలు. ఆరుసంవత్సరాలపాటు వాటిని విన్నా వాటిలో నీకొక్క మాటకూడా అర్థం కాదు. వీటిలో 'ఇ' కార 'ద' కారాల బహుభేదాలు ధ్వనిస్తాయి. ఆ అన్నం, ఆ మిరియాల పప్పుచారు కలిసిన ఒక ముద్ద మెల్లగా మింగు, నీ శక్తి ఎలాంటిదో బైటపడుతుంది. ఓహ్! ఆ కారం ఘాటూ, ఆ పులుపూ! వణికిపోతావ్ తమ్ముడూ! కరివేపాకు, పోపు వగైరాలు గల అన్నంలో పెరుగు కలిపి తినటం, నువ్వుల నూనెతో తలంటిపోసుకోవటం, నువ్వుల నూనెలో చేపలు వేయించటం, వీటిని వదిలేసి దక్షిణ భారతదేశాన్ని ఊహించలేం.

మహమ్మదీయుల కాలంలోను, అంతకు పూర్వమూ దక్షిణ భారతదేశంలో హిందూమతం సజీవంగా వుండినది. ఇక్కడే శంకరాచార్యులు జన్మించాడు. ఆయన జన్మించిన బ్రాహ్మణ శాఖలో తలమీద ముందుభాగంలో పిలక పెట్టుకొనేవారు. వీరు కొబ్బరినూనెతో వండిన ఆహారం తింటారు. ఈ దేశంలోనే రామానుజుడు జన్మించాడు. మధ్వముని కూడా యిక్కడే జన్మించాడు. ఈ ముగ్గురికే నవీన హిందూమతం ఋణపడివుంది. చైతన్యుని వైష్ణవం మధ్వమతానికి నకలు. ఉత్తర భారతదేశంలో మత సంస్కర్తలైన కబీరు, దాదూ, నానక్, రాంసనేహీ మొదలైనవారంతా శంకరాచార్యునకు ప్రతిధ్వనులు మాత్రమే. ఉత్తర భారతదేశంలో రామానుజుని శిష్యులు అయోధ్య మొదలైన ప్రదేశాలను ఆక్రమించుకొన్నారు. ఈ దక్షిణాదివారు ఉత్తరాది బ్రాహ్మణులను నిజమైన బ్రాహ్మణులుగా గుర్తించరు. వారిని శిష్యులుగా కూడా అంగీకరించరు. నిన్నమొన్నటిదాకా వీరికి సన్యాసంకూడా ఇవ్వలేదు. ఈ మద్రాసు బ్రాహ్మణులు ఇప్పుడుకూడా మతంలో ప్రముఖస్థానాలు ఆక్రమించి కూర్చున్నారు. ఉత్తరదేశ ప్రజలు మహమ్మదీయ దండయాత్రలకు తట్టుకోలేక, ధన మానాలను, గృహదేవతలను, ఆలుబిడ్డలను వదలి అరణ్యాల్లో తలదాచుకొనే రోజుల్లో, ఈ దక్షిణ దేశంలో విద్యానగర సామ్రాజ్యం సుస్థిరపడింది. మహానుభావుడైన సాయనాచార్యుడు* జన్మించింది ఇక్కడే. ఈయన భుజబలంతో మహమ్మదీయులు పరాజితులయ్యారు; బుక్కరాయుడు సింహాసనాన్ని

అలంకరించాడు. ఆయన ధీశక్తి, వివేకం విద్యానగర సామ్రాజ్యానికి స్థైర్యాన్ని ఒసగింది. ఆయన రాజనీతి దక్షిణదేశంలో చిరశాంతిని, అభ్యున్నతిని నెలకొల్పింది. ఆయన లోకోత్తర ప్రతిభ, అసాధారణ కృషి సర్వవేద భాష్యాలకు వ్యాఖ్యానాలను రూపొందించింది. ఆయన త్యాగశీలం, పరిశోధనాశక్తి కలిసి 'పంచదశి' గా భాసించింది. ఆ విద్యారణ్యమునే సాయనుడు. ఆయన దక్షిణదేశంలో జన్మించాడు.

ఈ మద్రాసు రాష్ట్రంలో తమిళు లెక్కువ. వీరిది అతిప్రాచీనమైన నాగరికత. వీరిలో ఒక శాఖ సుమేరియన్లు. వీరు అతిప్రాచీన కాలంలో యూఫ్రెటిస్ నదీతీరంలో తమ నాగరికతను వ్యాప్తిచేసినవారు. వీరి జ్యోతిష్యం, మతగ్రంథాలు, నీతి, కర్మకాండలు మొదలైనవి అస్సీరియా, బాబిలోనియా నాగరికతలకు పునాదులు వేశాయి. వీరి పురాణగాథలు క్రైస్తవుల బైబిల్‌కు మూలకందాలు. ఈ తమిళులలోనే మరో శాఖ మలబారు తీరంనుండి విస్తరించి ఈజిప్టు నాగరికతను వ్యాపింపచేసింది. ఈ తమిళులకు ఆర్యు లెన్నో విధాల ఋణపడి వున్నారు. దక్షిణదేశంలో వారు నిర్మించిన మహోన్నత దేవాలయాలు వీరశైవ, వీరవైష్ణవ మతాలకు పతాకప్రాయాలు. హిందూదేశంలో ఈ గొప్ప వైష్ణవ మతానికి ఒక తమిళ పంచముడు కర్త. అతడి పేరు శఠగోపుడు. అతడు చేటలు, జల్లెడలు అమ్ముకొని జీవించేవాడు. ఐనా మహాయోగి. ఈ తమిళ ఆళ్వారులంటే వైష్ణవులందరికీ విపరీతమైన గౌరవం. ఇప్పటికీ యితర ప్రాంతాల్లోకంటె దక్షిణదేశంలోనే ద్వైతాద్వైత విశిష్టాద్వైతాలు అధికంగా అధ్యయనం చెయ్యబడుతున్నాయి. మిగిలిన ప్రాంతాలకంటె యిక్కడే నేటికీ మత విషయాల పట్ల శ్రద్ధ అధికం.

జూన్ 24 వ తేదీ రాత్రి మా ఓడ మద్రాసు చేరింది. ఉదయం నిద్రలేవగానే మద్రాసు రేవులో వున్నట్లు నేను గుర్తించాను. రేవులో నీరు నిశ్చలంగా వుంది. కాని బైట ఉత్తుంగతరంగాలు గర్జిస్తున్నాయి. అప్పుడప్పుడు ఆ తరంగాలు రేవు గోడను ఢీకొంటున్నాయి. అవి పదిహేను ఇరవై అడుగుల ఎత్తుకు లేచి, నురుగులు కక్కుతున్నాయి. మద్రాసు రేవుకు

ముందు ప్రసిద్ధమైన స్ట్రాండ్ వీధి వుంది. ఇద్దరు ఆంగ్లేయ పోలీసు ఇనస్పెక్టర్లు, ఒక మద్రాసీ జమేదారు, ఒక డజనుమంది పోలీసువాళ్లు ఓడ మీదకు వచ్చి తెల్లవారికే ఓడ దిగటానికి అనుమతి ఇచ్చారని, హిందూదేశీయులకు అనుమతి లేదని ఎంతో మర్యాదగా చెప్పారు. 'మనవాడు' ఎంత గొప్పవాడైనప్పటికీ అతడికి కొన్ని మురికి అలవాట్లు వుంటాయి. అందుచేత అతడు ప్లేగు క్రిములను వ్యాపింపచెయ్యవచ్చుననే సందేహం వుంది. కాని మద్రాసు ప్రజలు నాకు ప్రత్యేకంగా అనుమతి కోరారు. వారికి అనుమతి రావచ్చును. నెమ్మది నెమ్మదిగా కొంతమంది మద్రాసు స్నేహితులు పడవలమీద చిన్నచిన్న గుంపులుగా మా ఓడవద్దకు రాసాగారు. కాని, వారు మమ్మల్ని కలుసుకోరాదనే నిషేధం వుంది. అందుచేత కాస్త దూరంనుండి — ఓడలోనుండే మేం వారితో మాట్లాడాలి. అలసింగ, బిలిగిరి, నరసింహాచారి, నంజుండరావు, కిడ్డి మొదలైన నా స్నేహితులంతా పడవలమీద వచ్చారు. బుట్టలతో మామిడిపళ్లు, అరటిపళ్లు, కొబ్బరికాయలు, అన్నం, పెరుగు, మిఠాయి, పిండివంటకాలు మొదలైనవన్నీ వచ్చిపడుతున్నాయి. క్రమంగా గుంపు పెరిగింది. స్త్రీలు, పురుషులు. బాలురు పడవలనిండా ఎక్కి వచ్చారు. మద్రాసులో బారిస్టర్ గా పని చేస్తున్న 'ఛామియర్' అనే నా ఆంగ్లేయ స్నేహితుడు కూడా వచ్చాడు. రామకృష్ణానందుడు, నిర్భయానందుడు కొన్నిసార్లు ఓడకు దగ్గరగా వచ్చారు. అంత ఎండలో రోజంతా ఇలాగే పడవలమీద నుండే మాట్లాడతామని పట్టుపట్టారు. నేను ఎంతో వ్యతిరేకించిన తరువాత వారు చివరకు ఆ ప్రయత్నం మానుకొన్నారు. కిందకు దిగటానికి నన్ను అనుమతించలేదనే వార్త నగరంలో వ్యాపించగానే పడవల సంఖ్య పెరగసాగింది. ఓడమీద పిట్టగోడను ఆనుకొని నిలబడే వుండటంచేత నేను బాగా అలసిపోయాను. అందువల్ల నా మద్రాసు స్నేహితులందరివద్ద సెలవు తీసుకొని నా గదిలోకి వెళ్ళిపోయాను. 'బ్రహ్మవాదిన్' పత్రికను గురించి మద్రాసులో చెయ్యవలసిన పనులను గురించి అలసింగకు చెప్పటానికి సమయం చిక్కలేదు. అందుచేత అతడే నాతో కొలంబో దాకా రావటానికి సిద్ధపడ్డాడు. ఓడ సాయంకాలం రేవునుండి బయలుదేరింది. బైట ఒక పెద్ద కేకను విని నేను నా గదికిటికీ నుండి తొంగిచూశాను. ఓ వెయ్యిమంది మద్రాసీయులు స్త్రీలు, పురుషులు, పిల్లలు రేవు గోడలమీద కూర్చొని వీడ్కోలు నినాదాలు చేస్తున్నారు. సంతోష సమయంలో వంగీయులకు మాదిరే

మద్రాసీయులుకూడా 'హూలులులూ...' అంటూ నాలికతో ప్రతిధ్వనులు చేస్తారు.

మద్రాసునుండి లంకకు పోవటానికి నాలుగు రోజులు పట్టింది. ఉవ్వెత్తు తరంగాలు లేవటం గంగానది ముఖద్వారంనుండి ప్రారంభమై ముందుకుపోయేకొద్దీ ఈ తరంగాలు పెరుగసాగాయి. మద్రాసు విడిచాక ఈ తరంగాలు మరింత పెరగటంతో మా ఓడ ఎక్కువగా తూగులాడసాగింది. ప్రయాణీకులంతా సముద్రవ్యాధికి గురైనారు. ఆ ఇద్దరు వంగదేశ బాలురుకూడా జబ్బుపడ్డారు. అందులో ఒకడు తాను ఖచ్చితంగా చచ్చిపోతానని గోలపెట్టాడు. ఎంతో కష్టంతో వారిని మేం సముదాయించాం. "నాయనా! నువ్వేమీ భయపడనక్కర్లేదు. ఇది సామాన్యంగా అందరికీ వచ్చే జాడ్యమే. దీంతో చచ్చిన వారెవ్వరూ లేరు" అని వారిద్దరినీ ఊరడించాం. రెండవ తరగతి సరిగ్గా ఓడ 'స్క్రూ' మీద వుంది. ఈ ఇద్దరు కుర్రవాళ్లు స్వజాతివారైనందువల్ల వారికో చీకటి గదినిచ్చారు. అక్కడ గాలి, వెలుతురు రాదు. అందుచేత ఆ కుర్రవాళ్లు అందులో వుండలేకపోయారు. డెక్‌మీద ఓడ మాపు ఎక్కువగా వుంది. ఓడ ముందుభాగం తరంగాలు లేచిన పల్లంలో ప్రవేశించి ముందుకు వంగగా వెనుక భాగం ఎంతో పైకి లేస్తూంది. ఓడ ముందుభాగం కేవలం గాల్లోకి లేచిపోయింది. ఊపు ఎక్కువైనప్పుడు ఓడంతా విపరీతమైన సంచలనం కలిగేది. రెండవ తరగతి అంతా పిల్లి చేతుల్లోబడ్డ ఎలుకలా గిజగిజలాడిపోయింది.

ఏమైనప్పటికి ఇది వానాకాలం. ఓడ పశ్చిమానికి పోయేకొద్దీ తుపానుగాలి ఎక్కువవుతుంది. మద్రాసు మిత్రులు సమృద్ధిగా పండ్లుయిచ్చారు. అందులో చాలభాగం కొంత మిఠాయి, అన్నం, పెరుగు మొదలైనవి ఆ యిద్దరు కుర్రవాళ్లకు ఇచ్చాం. అలసింగ తొందర తొందరగా టికెట్టుకొని కాళ్లకు చెప్పులు లేకుండా ఓడ ఎక్కాడు. అతడప్పుడప్పుడు చెప్పులు ధరించడట. విభిన్న ప్రాంతాల్లో వాడుకలు విభిన్నాలుగా వుంటాయి. పాశ్చాత్య దేశాల్లో స్త్రీలు చెప్పులు ధరించకపోవటం ఎంతో సిగ్గుచేటు. కాని వారు తమ వక్షస్థలాన్ని సగంవరకూ అనాచ్ఛాదితంగా వుంచుకోవటానికి సిగ్గుపడరు. కాని మన దేశంలో తలకు మేలిముసుగు వుండి

తీరాలి. తక్కిన శరీరం బాగా మరుగుపరచకపోయినా అంత పట్టింపులేదు. 'బ్రహ్మవాదిన్' సంపాదకుడైన అలసింగ రామానుజ మతస్థుడు, మైసూరు బ్రాహ్మణుడు. అతడికి 'చారు' అంటే ఎంతో ప్రీతి. అతడు తల నున్నగా క్షౌరం చేసుకొని ముఖంమీద తెంగల పద్ధతిని నామాలు పెట్టుకొంటాడు. అతడు ఎంతో జాగ్రత్తతో పయనపు బత్తెంకోసం రెండు మూటలు తెచ్చాడు. ఒక మూటలో వేపుడు అటుకులు, మరోదాన్లో మరమరాలు వేయించిన వేరుసెనగ పప్పులు వున్నాయి. లంకకు చేరేంతవరకూ వీటిని తిని ఉండొచ్చునని అతడి మాహ. అప్పుడతని బ్రాహ్మణత్వం పోదు! ఇంతకుపూర్వం అలసింగ లంకకు వెళ్లివున్నాడు. అప్పుడతని కులంవారు అతగాణ్ణి వెలివెయ్యటానికి ప్రయత్నించారు. కాని లాభం లేకపోయింది. హిందూదేశంలో ఈ వర్ణపద్ధతిలో యిదొక మేలు. వాడు చేసిన పనికి అతని కులంలోనివారు అభ్యంతరం పెట్టకపోతే తక్కినవారు ఏమీ చెయ్యలేరు. మరి దక్షిణ భారతదేశంలోని కులాల మాట? కొన్ని కులాల్లో ఐదు వందల మంది, కొన్నిటిలో ఏడు వందలు, వెయ్యిమంది కంటె ఎక్కువ వుండరు. వారిలో వారికి వివాహాలకు కన్యలు కావలసి వచ్చినప్పుడు మేనకోడళ్లను కూడా చేసుకొంటారు. అంత సన్నిహిత సంబంధాలు చేసుకొనేవారు తక్కువ సంఖ్యలున్న కులాలవారు. మైసూర్‌లో మొదట రైలుమార్గాలు వేసినప్పుడు రైలును చూడటానికి వచ్చిన దూరప్రాంతపు బ్రాహ్మణులను వారి కులంవారు వెలివేశారట! ఏమైనా అలసింగ వంటివారు లోకంలో చాల అరుదుగా వుంటారు. అతడు చాలా నిస్వార్థుడు, కార్యతత్పరుడు, గురుభక్తి వున్నవాడు. అంత వినయశీలుడైన శిష్యుడు లోకంలో అరుదు. జన్మచేత అతడు దక్షిణ భారతీయుడు. నెత్తిమీద పిలకపెట్టి తక్కిన తల ముండనం చేయించుకొంటాడు. కాళ్లకు చెప్పులుండవు. ధోవతి ధరిస్తాడు. మొదటి తరగతి టికెట్టు తీసుకొన్నాడు. అప్పుడప్పుడు డెక్‌మీద పచార్లు చేస్తూ ఆకలివేసినప్పుడు మరమరాలు, వేరుసెనగపప్పు నములుతాడు. ఓడలోని పనివారు మద్రాసీయుల నందరినీ చెట్టియార్లనుకొంటారు. వారు గొప్ప ధనవంతులని, ఒక దమ్మిడీకూడా తిండికోసం, దుస్తులకోసం ఖర్చుపెట్టరని చెబుతారు. కాని యీ పనివారంతా అలసింగ మాతో కలవటం వల్ల అతని బ్రాహ్మణత్వం చెడిపోయిందనుకొన్నారు. అది నిజమే. మనతో కలిసినందువల్ల మద్రాసీయులు వారి వర్ణ నియమాలను కొన్నిటిని పోగొట్టుకొంటారు.

అలసింగకు సముద్రపు జ్వరం రాలేదు. సోదరుడు తురీయానందుడు మొదట్లో కాస్త జబ్బుపడ్డాడు. కాని యిప్పుడు బాగానే వున్నాడు. అందుచేత ఈ నాలుగురోజులు అనేక రకాలైన మధుర సంభాషణలతో, కబుర్లతో గడిచాయి. మా ముందిప్పుడు కొలంబో వుంది. ఇదే సింహళ ద్వీపం.శ్రీరాముడు ధనుష్కోటినుండి యిక్కడివరకు వారధికట్టి రావణుణ్ణి జయించాడు. నేనా వారధిని చూశాను. రామ్నాడు రాజైన సేతుపతి మహారాజు ప్రాసాదంలో శ్రీరామచంద్రుడు ఈ మహారాజు పూర్వీకుని సేతుపతిగా పట్టంగట్టి ప్రసాదించిన శిలాఫలకం చూశాను. కాని యీ రోజుల్లో బౌద్ధులు దీన్ని ఒప్పుకోరు. వారి దేశంలో దీన్ని సూచించే సంప్రదాయమేదీ లేదంటారు. వారి నిరాకరణతో మనకేం పని? మన పూర్వ గ్రంథాలు యీ విషయంలో పరమప్రమాణాలు కదా. మరి వారి దేశంలో సింహళాన్ని లంక* అనరు. 'లంక' అని ఎలా అంటారు? వారి మాటల్లో, పనిలో, స్వభావంలో, ఆకారంలో 'మిరపకాయ' లోని చురుకుతనం లేదు మరి! వారు గౌనులు ధరిస్తారు. జట్టు ముడివేసుకొంటారు. అందులో పెద్ద దువ్వెన పెట్టుకొంటారు. వట్టి ఆడంగి అలవాట్లున్న మనుషులు. వారు స్త్రీలమాదిరే సన్నగా పొట్టిగా మృదువుగా వుంటారు. వారా రావణ కుంభకర్ణుల సంతానం! ఏమాత్రం కారు. వారు వంగదేశంనుండి వలసవచ్చినట్లు ఒక ప్రవాదం వుంది. అది నిజమే అయ్యుండొచ్చు. ఇప్పుడు వంగదేశంలో ఎదుగుతున్న జనం ఆడవారి వేషాలతో, మృదువైన, సున్నితమైన పలుకులతో, మందమందాలైన నడకలతో, తిన్నగా ముఖాలను చూడలేని సిగ్గుచూపులతో, పుట్టినప్పటినుండి ప్రేమగీతాలు రచిస్తూ ప్రియుల 'విరహం' తో బాధపడుతూ ఉన్నారు. వీరంతా తమలాంటి 'ఆడంగి' వారున్న సింహళానికి ఎందుకు పోరాదు? మన ప్రభుత్వం నిద్రపోతోందా? నిన్న మొన్న పూరీలో కొందరిని పట్టుకోవటానికి ఎంత గొడవ లేవదీశారు. కలకత్తా ముఖ్య నగరంలోనే పట్టుకొని పైకి పంపదగిన వారెంతమంది లేరూ?

విజయసింహుడనే ఒక తుంటరి వంగ రాజకుమారు డుండేవాడు. అతడు తన తండ్రితో కలహించి తనవంటివారు కొందరితో కలిసి సింహళానికి వచ్చాడట. అప్పుడు సింహళంలో

అడవిజాతి వారుండేవారట. వారిని ఇప్పుడు 'బిదోయను' లంటారు. ఆ అడవిజాతివాళ్ల రాజు ఈ రాజకుమారుడికి ఎంతో మర్యాదచేసి తన కుమార్తెనిచ్చి పెళ్ళి చేసాడు. ఈ రాజకుమారుడు కొంతకాలం నిశ్చింతగా అక్కడే వుండి, ఒకనాటి రాత్రి వేళ తన భార్యతోను, అనుయాయులతోను కుట్రపన్ని రాజును, అతని సర్దారులను చంపేశాడు. తరువాత విజయసింహుడు సింహళ సింహాసనాన్ని అధిష్ఠించాడు. అంతటితో అతడి దుశ్చర్యలు ఆగలేదు. తరువాత కొంతకాలానికి ఆ సింహళపు భార్యమీద విసుగుపుట్టి, హిందూదేశం నుండి అనేకమంది పురుషులను, స్త్రీలను రప్పించి, అందులో అనూరాధ అనే ఆమెను వివాహం చేసుకొన్నాడు. సింహళపు భార్యను వదిలేశాడు. తరువాత ఆ కొండజాతి ప్రజలను నిర్మూలించసాగాడు. ఏ కొద్దిమందో తప్ప అందరూ చంపబడ్డారు. మిగిలినవారిప్పుడు అరణ్యాల్లో అక్కడక్కడ కనిపిస్తుంటారు. ఈ విధంగా లంక, సింహళంగా మారిపోయింది. అది మొదట్లో వంగదేశ దుండగుల వలసగా ప్రారంభమైంది.

కాలాంతరంలో అశోక చక్రవర్తి తన కుమారుడు మహేంద్రుణ్ణి, కుమార్తె సంఘమిత్రను సింహళానికి బౌద్ధ మతప్రచారకులుగా పంపాడు. వీరిద్దరూ సన్యాసులు; ఇక్కడి కొచ్చాక యిక్కడున్న జనం అనాగరికులై వుండటం గమనించారు. తమ జీవితాంతం కష్టపడి వారిని నాగరికులుగా చెయ్యటానికి అనేక విధాల ప్రయత్నించారు. వారు అనేక నీతిసూత్రాలను రచించి, వారి నందరినీ బౌద్ధమతంలోకి మార్చారు. అతి త్వరలోనే సింహళీయులంతా పరమబౌద్ధులయ్యారు. ఒక పెద్దనగరాన్ని దేశం మధ్యలో నిర్మించి దానికి అనూరాధపురమని పేరుపెట్టారు. ఈ నగరశిథిలాలను చూసినవారు యిప్పటికీ ఆశ్చర్యపోతారు. పెద్ద స్తూపాలు, మైళ్లకొద్ది విస్తరించిన శిథిలాలైన రాతికట్టడాలు యీనాటికీ నిలిచి వున్నాయి. ఈ నగరంలో అధిక భాగంలో అడవి పెరిగింది. ఈ అడవి అంతా ఇప్పటికీ నరికివేయబడలేదు. బోడితలల సన్యాసులు, సన్యాసినులు, పసుపుపచ్చని బురఖాలు ధరించి చేతులతో భిక్షాపాత్రలు పట్టుకొని సింహళమంతా వ్యాపించారు. పెద్ద దేవాలయాలు, ధ్యానమగ్నుడైన బుద్ధుని విగ్రహాలు, ధర్మబోధ చేస్తూన్నట్లున్న విగ్రహాలు కొన్ని, పడుకొన్నట్లున్నవి కొన్ని, బుద్ధుడు నిర్వాణగతుడై వున్నట్లున్నవి

కొన్ని వున్నాయి. ఇలాంటి విగ్రహాలతో పెద్దపెద్ద దేవాలయాలనేకం వెలసాయి. దేవాలయాల గోడలమీద యీ సింహళీయులు కొన్ని నరకలోక దృశ్యాలను చిత్రీకరించారు. మనుషులను పిశాచులు బాదుతున్నట్లు, రంపాలతో కోస్తున్నట్లు, తగులబెడుతున్నట్లు, సలసలకాగుతున్న నూనెలో వేయించుచున్నట్లు చర్మాలను ఒలుస్తున్నట్లు – ఇలాంటి ఘోరదృశ్యాలు చిత్రీకరించబడ్డాయి. ఇలా చిత్రించటం ఘోరాతిఘోరం! 'అహింసా పరమోధర్మః' అని బోధించే బౌద్ధమతంలో యిలాంటి ఘోరదృశ్యాలకు స్థానం ఎక్కడ? చైనా, జపాన్ దేశాల్లోని దేవాలయాల్లోకూడా ఇలాంటి చిత్రాలే మనకు కనిపిస్తాయి. సిద్ధాంతపరంగా వారు అహింసను గురించి ప్రచారం చేసినా, చూడటానికి ఘోరమైన శిక్షావిధానం అమలులో వుంది. ఒకసారి ఈ అహింసావాదుల తెగకు చిందిన ఒక వ్యక్తి ఇంట్లో ఒక దొంగ పడ్డాడు. ఇంట్లోని పనివారు ఆ దొంగను పట్టుకొని చితకబాదసాగారు. ఈ గోల విని ఆ ఇంటి యజమాని పైనున్న వసారామీదకొచ్చి విషయం తెలుసుకొని, "ఆగండి! అతణ్ణి కొట్టవద్దు. అహింస ఎంతో గొప్పధర్మం" అని కేకపెట్టాడు. ఈ అనుభూతిలేని ఆ అహింసావాదులు కొట్టడం ఆపి "మరి ఈ దొంగను ఏం చెయ్యమంటారు?" అని అడిగారు. యజమాని ఇలా అన్నాడు: "వాణ్ణొక సంచిలో కట్టేసి నీళ్లల్లో పారెయ్యండి." ఆ దొంగ ఈ విధమైన దాక్షిణ్యానికి కృతజ్ఞుడై చేతులు జోడించి "అయ్యగారి దయ ఎంత గొప్పదో!" అన్నాడు. బౌద్ధులు ప్రశాంతులని, సర్వమత సహనం వున్నవారని నేను విన్నాను. బౌద్ధమత ప్రచారకులు కలకత్తాకు వచ్చి మనమెంత మర్యాదచేసినా, తూచితూచి ప్రయోగించిన విశేషణాలతో మనలను నిందిస్తారు. ఒకప్పుడు అనూరాధపురంలో హిందువుల ముందు నేను ప్రసంగిస్తున్నాను. అందులో బౌద్ధులెవరూ లేరు. ఆ ఉపన్యాసం ఏర్పాటు చెయ్యబడింది ఎవరి ఇంట్లోనూ కాదు – ఒక పెద్ద మైదానంలో. అది ఎవరి ఆస్తీకాదు. అక్కడికి కొంతమంది బౌద్ధ సన్న్యాసులు, ఇతరులు, స్త్రీ పురుషులు పెద్ద గుంపుగా దప్పులు, తాళాలు మోగించుకొంటూ వచ్చి పెద్దగోల చేశారు. గతిలేక సభ విరమించవలసి వచ్చింది. లేకపోతే పెద్ద రక్తపాతం జరిగేది. అందుకని నేను అతికష్టంతో "అయ్యలారా! ఆ బౌద్ధులు ఆచరణలో పెట్టకపోయినా, మనమైనా అహింసను కొంత ఆచరిద్దాం" అంటూ హిందువులందరినీ శాంతపరిచాను.

క్రమంగా తమిళ హిందువులు సింహళంలోకి వలస రానారంభించారు. బౌద్ధులు యీ విపరీత పరిస్థితివల్ల వారి ముఖ్యపట్టణాన్ని వదలి ఒక గిరి దుర్గాన్ని నిర్మించుకొని దానికి 'కాండీ' అని పేరుపెట్టారు. కొంత కాలానికి తమిళులు దాన్నికూడా ఆక్రమించి ఒక హిందూరాజ్యాన్ని స్థాపించారు. తరువాత పాశ్చాత్యులు గుంపులు గుంపులుగా రాసాగారు. స్పెయిన్ దేశస్థులు, పోర్చుగీసులు, డచ్‌వారు, ఆంగ్లేయులు వచ్చారు. చివరకు ఆంగ్లేయులు రాజులైనారు. భరణం ఏర్పాటుచేసి కాండీ రాజకుటుంబం తంజామారుకు పంపబడింది. వారిప్పుడు (ములగు తణ్ణి రసం) 'చారు' తో తృప్తులై జీవనం సాగిస్తున్నారు!

ఉత్తర సింహళంలో హిందువు లెక్కువ. దక్షిణ ప్రాంతంలో మాత్రం, సంకరజాతికి చెందిన యురేషియన్లు బహువర్గాలవారు ఎక్కువ మంది వున్నారు. బౌద్ధుల ప్రధానస్థానం ఇప్పటి ముఖ్యపట్టణమైన కోలంబో, హిందువుల ప్రధానస్థానం జాఫ్నా. కులభేదాలు ఇక్కడ భారతదేశంలో వున్నంతగా లేవు. బౌద్ధుల్లో కూడా వివాహానికి సంబంధించినంతవరకు ఏవో కొన్ని భేదాలున్నాయి. భోజన విషయంలో ఈ వ్యత్యాసాలు లేవు. హిందువుల్లో భోజన విషయంలోకూడా ఈ వ్యత్యాసం వుంది కదా. సింహళంలోని కసాయివాళ్లంతా పూర్వం బౌద్ధులే! బౌద్ధమత పునరుజ్జీవనమైన తరువాత వీరి సంఖ్య తగ్గుతోంది. బౌద్ధుల్లో అధికులు ప్రస్తుతం తమ ఆంగ్లేయ బిరుదులను దేశీయంగా మార్చుకొంటున్నారు. హిందూ కులాలన్నీ ఒకే హిందూకులంగా కూడి పంజాబ్‌లోని జాట్‌లలో మాదిరిపరస్పర వివాహాలు చేసుకొంటున్నారు. వివాహ విషయంలో వధువు యూరోపియనైనా బాధలేదు. కుర్రవాడు దేవాలయానికి వెళ్లి ముఖానికి త్రిపుండ్రాలు ధరించి శివనామాన్ని ఉచ్చరించి హిందువవుతాడు. భర్త హిందువైనా, భార్య క్రైస్తవురాలు కావచ్చును. ఆమె హిందూస్త్రీగా మారాలంటే నుదుట కొంచెం విభూతి రాసుకొని 'నమఃపార్వతీపతయే" అంటే చాలు. క్రైస్తవ మిషనరీలకు ఇది చాలా క్రోధకారణమైంది. సింహళంలోకి వచ్చాక చాలమంది క్రైస్తవులు నుదుట విభూతి రాసుకొని – శివనామోచ్చరణంతో హిందువులయినారు. ఈ హిందువుల్లో అద్వైతవాదం, వీరశైవవాదం

ముఖ్యమైన మతాలు. 'హిందు' అనే మాటకు బదులు 'శైవు' దన్నమాట ఎక్కువ వాడుకలో వుంది. భజన సంకీర్తనాలను చైతన్యుడు వంగదేశంలో ప్రవేశపెట్టాడు. కాని అది పుట్టింది తమిళదేశంలో. సింహళంలో పరిశుద్ధమైన తమిళం మాట్లాడతారు. ఆ దేశ మతంకూడా తమిళుల మతమే. ఒక లక్షమంది ఆనందమగ్నులై శివనామ సంకీర్తనం చెయ్యటం, తోడుగా ఒక వెయ్యి మృదంగాలు మోగటం చూడదగ్గ దృశ్యాలు. పెద్దపెద్ద తాళాల శబ్దాలు ప్రతిధ్వనిస్తాయి.

ఎర్రని కళ్లతో, బలిష్ఠ శరీరాలతో, ముఖంలో, ఒంటినిండా విభూది పూతలతో, మెడలో ఒప్పే రుద్రాక్షమాలలతో మహాభక్తుడైన హనుమంతునిలా ఒళ్లు తెలియని శివంతో నృత్యంచేసే యీ తమిళజనాన్ని కళ్లారా చూడకపోతే, ఊహంచనైనా వీలుకాదు!

కొలంబోలోని మా స్నేహితులు మేము ఓడను దిగటానికి అనుమతి పొందారు. మేం ఓడ దిగి మా స్నేహితులను కలుసుకున్నాం. హిందువుల్లో ప్రముఖుడు సర్ కుమారస్వామి. అతని భార్య ఆంగ్లేయురాలు. అతని కుమారుడు కాళ్లకు చెప్పులు ధరించడు. నుదుట విభూది ధరిస్తాడు. అరుణాచలం, మరికొంతమంది స్నేహితులు మమ్మల్ని చూడటానికి వచ్చారు. చాలాకాలం తర్వాత నేను 'ములగుతణ్ణి' (చారు) మరియు పెద్ద కొబ్బరికాయ తిన్నాను. కొన్ని కొబ్బరిబోండాలను వారు ఓడలోని నా గదిలో పెట్టించారు. నేను శ్రీమతి హిగ్గిన్స్‌ను చూశాను. బౌద్ధబాలికలకు భోజనాది సదుపాయాలతో ఏర్పాటుచేసిన ఆమె పాఠశాలను చూశాను. మా పాత స్నేహితురాలైన కానోవారారాణి స్థాపించిన మఠాన్ని, పాఠశాలను చూశాను. శ్రీమతి హిగ్గిన్స్ యింటికంటె కానోవారారాణి ఇల్లే విశాలంగా, ఎక్కువ సౌకర్యాలతో కూడివుంది. రాణి తన స్వంతడబ్బు ఖర్చుపెట్టింది. శ్రీమతి హిగ్గిన్స్ చందాలు వసూలు చేసింది. రాణి వంగదేశ స్త్రీలు చీర ధరించినట్లు కాషాయవస్త్రాన్ని ధరించింది. సింహళ బౌద్ధులకు యిలాంటవేషధారణమంటే ఎంతో ఇష్టం. ఈ రకమైన చీరలను ధరించి బళ్లమీద ఎక్కిన స్త్రీ లనేకమందిని నేను చూశాను.

బౌద్ధుల ప్రధాన యాత్రాస్థలం 'దలాద మాలిగవ' లేక దంత దేవాలయం. ఇది కాండీలో వుంది. ఈ దేవాలయంలో బుద్ధుని దంతం పదిలపరచబడి వుంది. ఈ దంతం మొదట్లో పూరీ జగన్నాథ దేవాలయంలో వుండేదట. తరువాత అనేక చేతులుమారి సింహళం చేరింది. ఇక్కడ కూడా యీ దంతాన్ని గురించి అనేక తగాదాలు బయల్దేరాయని సింహళీయులు చెప్పారు. ఇప్పుడీ దంతం భద్రంగా వుంది. సింహళీయులు అనేక చారిత్రక లిఖితాలను భద్రపరిచారు; అవి మన కాకమ్మకథల వంటివి మాత్రం కావు. ప్రాచీన మాగధి భాషలో రచించిన బౌద్ధమత గ్రంథాలను కూడా చక్కగా పదిలపరిచారు. బౌద్ధమతం సింహళం నుండి బర్మా, సయాం మొదలైన దేశాలకు వ్యాపించింది. సింహళ బౌద్ధులు వారి మత గ్రంథాల్లో ఉదహరించబడ్డ శాక్యముని నొక్కణ్ణి మాత్రమే ఒప్పుకొని అతని బోధనలను అనుసరించటానికి ప్రయత్నిస్తారు. నేపాల్, సిక్కిం, భూటాన్, లడఖ్, చైనా, జపాన్ దేశాల్లో మాదిరి వారు శివుణ్ణి ఆరాధించరు. తారాదేవి మొదలైన దేవతలనుగాని, మంత్రాలనుగాని వారెరుగరు. కాని వారికి భూతావేశం మొదలైన వాటిల్లో నమ్మకముంది. బౌద్ధులు రెండు తెగలక్రింద చీలిపోయారు. ఒకటి ఉత్తరాది తెగ. రెండవది దక్షిణాది తెగ. ఉత్తరాదివారు మహాయానులని చెప్పుకొంటారు. దక్షిణాది తెగలో సింహళీయులు, బర్మాదేశీయులు, సయాం దేశస్థులు వున్నారు. వీరంతా హీనయానులు. మహాయానులు బుద్ధుణ్ణి నామమాత్రంగా ఆరాధిస్తారు. వారు నిజంగా ఆరాధించేది తారాదేవి, అవలోకితేశ్వరులను. జపాన్, చైనా, కొరియా దేశస్థులు అవలోకితేశ్వరుని 'నాన్ఇన్' అంటారు. మహాయాన మతంలో మంత్రతంత్రాలున్నాయి. టిబెట్టు దేశస్థులు నిజమైన శివుని భూతాలు. వారంతా హిందూ దేవతలను ఆరాధిస్తారు, డమరుకాన్ని వాయిస్తారు. కపాలాన్ని భద్రపరుస్తారు. మరణించిన సన్న్యాసుల బొమికలతో చేసిన బూరల నూదుతారు. మద్య మాంసాలు సేవిస్తారు, దయ్యాలను, భూతాలను ప్రయోగిస్తారు; మంత్రాలను ఉచ్చరించి రోగాలను నయంచేస్తారు. చైనా, జపాన్ దేశాల్లో దేవాలయ గోడలమీద పెద్ద గిల్టుగల ఏకాక్షర మంత్రాలను నేను చూశాను. ఇవి వంగ భాషాక్షరాలకు చాలదగ్గరి పోలికలో ఉంటాయి.

అలసింగ కొలంబోనుండి మద్రాసుకు తిరిగి వెళ్లిపోయాడు. మేం మళ్లా ఓడనెక్కాం.

కుమారస్వామి తోటలోని కొన్ని నిమ్మకాయలు, పెద్ద కొబ్బరికాయలు, రెండు పానకపు సీసాలు మొదలైనవి మిత్రులు మాకు బహూకరించారు.

భగవంతుడైన కార్తికేయుడికి సుబ్రహ్మణ్యుడు, కుమారస్వామి మొదలైన అనేక పేర్లున్నాయి: దక్షిణ దేశంలో కార్తికేయుడి ఆరాధన ఎక్కువ. కార్తికేయుడు ఓంకార అవతారమంటారు.

జూన్ 25 వ తేదీ ఉదయం ఓడ కొలంబోనుండి బయలుదేరింది. ఇప్పుడు వర్ష ఋతువు విజృంభించింది. ఈ పరిస్థితులను మేం ఎదుర్కోవాలి. మా ఓడ పోతున్నకొద్దీ తుపాన్ పెరుగుతోంది; గాలి పెద్ద మోతపెడుతోంది; ఎడతెగని వాన కురుస్తోంది. నాలుగు వైపుల కటిక చీకటి వ్యాపించింది. ఓడ డెక్ మీదికి భయంకర శబ్దంతో సముద్ర తరంగాలు కొడుతున్నాయి. కాబట్టి డెక్ మీద నిలబడటానికి అవకాశం ఏమాత్రం లేదు. భోజనం చేసే బల్లను చిన్నచిన్న చదరాలుగా కొయ్య ముక్కలతో అక్కడివారు ఏర్పాటు చేశారు. ఆ కొయ్యచట్రాలలో తినుబండారాలు పైకి ఎగురుతున్నాయి. ఓడ పగులుతుందేమో అన్నట్లు చప్పుడు చేస్తోంది. కెప్టెన్ యిలా అన్నాడు: "ఈ సంవత్సరం వర్షఋతువు పూర్వం ఎన్నడూ లేనంత ఉధృతంగా వుంది." కెప్టెన్ చాలా సరదా మనిషి. చైనా సముద్రంలోనూ, హిందూ మహాసముద్రంలోనూ అనేక సంవత్సరాలు గడిపాడు. కబుర్లతో చాలాసేపు శ్రోతలను ఆకట్టుకోగలడు. కాకమ్మ కథలు చెప్పటంలో నేర్పరి. ఓడ దొంగలు, చైనా కూలివాళ్లు ఓడ అధికారులను చంపి, ఓడనంతా దోచుకొని తప్పించుకొని వెళ్లిన కథ – ఇలాంటి కథలు ఎన్నో అతడు చెబుతున్నాడు. ఇప్పుడు చెయ్యటానికి కూడా వేరే పనేంలేదు. ఈ గాలి మాపులో చదవటం, వ్రాయటం ఏమాత్రం సాధ్యంకాదు. గదిలో కూర్చోవటం ఎంతో కష్టం. అలలు లోపలకు కొడతాయేమో అనే భయంతో కిటికీలు మూసేశాం. ఒక రోజున తురీయానందుడు కిటికీ రెక్క ఓరగా తెరిచాడు. ఒక తరంగలేశం లోపలకి కొట్టి గదిని పూర్తిగా జలమయం చేసింది. గది లోపలే ఇలా వుందికదా! ఇక డెక్‌మీద మాపు, అలజడి ఎంతో వర్ణనాతీతం! ఇలాంటి గందరగోళ

పరిస్థితుల్లోనూ మీ 'ఉద్బోధన్' పత్రిక పని కొంతవరకూ సాగుతోందని నీవు గుర్తుంచుకోవాలి సోదరా!

మా ఓడలో ఇద్దరు క్రైస్తవ ప్రయాణీకులున్నారు. వారిలో ఒకడు అమెరికా దేశస్థుడు. కుటుంబంతోసహా వచ్చాడు. అతడు చాల మంచివాడు, పేరు బోగేష్, అతడికి వివాహమై ఏడేళ్లయింది. ఆరుగురు పిల్లలు పుట్టారు. ఓడమీద పనివారు అది దైవానుగ్రహ మంటారు. కాని ఆ పిల్లలుమాత్రం బహుశా అలా అనుకోవటం లేదు. అతని భార్య డెక్ మీద ఒక మురికి దుప్పటి పరిచి, వారిని దానిమీద పడుకోబెట్టి పోయేది. వాళ్లు ఒళ్లంతా దుమ్ముకొట్టుకొని ఏడుస్తూ, డెక్ మీద దొర్లుతుండేవారు.

డెక్ మీద నడిచే ప్రయాణీకులు వీరెక్కడ కాళ్లకిందపడి నలుగుతారేమో అనే భయంతో యిష్టంవచ్చినట్లు తిరిగేవారు కారు. ఆ భార్యాభర్తలు చంటి పిల్లను ఒక చదరపు బుట్టలో పడుకోబెట్టి, తాము ఒక మూల కూర్చునే వారు. ఈ ఐరోపీయ నాగరికతను మనం మెచ్చుకోలేం. మనం వీథిలో కూర్చొని నోరు కడుక్కొన్నా, పళ్ళు తోముకున్నా అది అనాగరికమని వారంటారు. ఈ పనులు యింట్లోనే చేసుకోవాలి. బాగానే వుంది! నేను మిమ్మల్నొక ప్రశ్న అడుగుతాను. ఇలా పదిమందిలో కౌగిలించుకొని కూర్చోవటం నాగరికమైన పనా? ఇలాంటి నాగరికత వెంటబడి మీరంతా పరిగెత్తుతున్నారే! మీరు యీ ప్రొటెస్టెంట్ మతగురువును చూస్తేగాని ఈ ప్రొటెస్టెంట్ మతం ఉత్తర ఐరోపాకు చేసిన మేలు అర్థం కాదు. పది కోట్ల మంది ఇంగ్లీషువారు చనిపోయినా వారి మతగురువులు బతికితే చాలు. ఇరవై సంవత్సరాల్లో మళ్లీ పది కోట్లమంది పుట్టుకొస్తారు. (అంటే గంపెడుమంది బిడ్డలను కనటంలో ఈ మత గురువులు నిపుణులని అర్థం.)

ఓడ ఇటు అటు తూలడంతో చాలమంది తలనొప్పితో బాధపడసాగారు. ఒక వ్యక్తితో ఆయన కూతురు చిన్నపిల్ల వచ్చింది. ఆమె పేరు టూటిల్. పాపం తల్లి పోయిందట. మన నివేదిత యీ టూటిల్‌కు, ఆ బోగేష్ పిల్లలకు తల్లి అయింది. టూటిల్ తండ్రి మైసూరు

తేయాకును, కాఫీ తోటలను పెంచేవాడు. ఆమె అక్కడే పెరిగింది. "అమ్మాయీ! బాగున్నావా?" అని ఆ పిల్లను అడిగాను. ఆమె యిలా అంది: "ఈ బంగళా అంత బాగాలేదు. ఊపు ఎక్కువగా ఉంది. నాకు కడుపు తిప్పుతోంది." ఆ పిల్ల ఊహలో ప్రతి ఓడా బంగళాయే! ఆ బోగేష్ పిల్లల్లో ఒకడికి సుస్తీగా వుంది. వారిని చూసేవారు లేరు. పాపం ఆ పసివారు రోజంతా డెక్‌మీద దొర్లుతూనే వుంటారు. ఓడ కెప్టెన్ ముసలివాడు. అప్పుడప్పుడు తన గదినుండి బైటకొచ్చి, వాడి నోటికి చిన్న గరిటెతో సూప్ (ఒకవిధమైన రసం) పట్టేవాడు. వాడి పీలకాళ్లవంక చూస్తూ "పాపం! ఎంత ఎండిపోయాడు! పాపం ఎవరూ పట్టించుకోవటం లేదు" అనేవాడు.

అనేకమంది శాశ్వతసౌఖ్యాన్ని కోరతారు. మరి సౌఖ్యమనేది శాశ్వతమైతే దుఃఖంకూడా శాశ్వతం కావాలి. కాస్త ఆలోచించి చూడండి. కాకపోతే ఎప్పటికైనా, మేం ఏడెన్ రేవును చేరుకోగలమా? అదృష్టవశాత్తు సుఖదుఃఖాలు శాశ్వతాలు కావు. కాబట్టి ఆరు రోజుల్లో వెళ్లాల్సిన దూరాన్ని పద్నాల్గు రోజులు పట్టినా యింత భయంకరమైన గాలివానలో రాత్రింబవళ్లు ప్రయాణంచేసి ఏడెన్ రేవు చేరాం. కొలంబో నుండి మేం ముందుకు పోయేకొద్దీ తుపాను, వర్షం ఎక్కువ కాసాగాయి. ఆకాశమంతా ఒక పెద్ద చెరువైపోయింది. గాలి భయంకరంగా వీచసాగింది. తరంగాలు ఉవ్వెత్తుగా లేస్తున్నాయి. ఓడ ఒక్క అడుగు ముందుకు వెయ్యటానికి కూడా శ్రమిస్తోంది. అంత గాల్లో ఆ తరంగాలకెదురుగా వెళ్లటంలో ఓడ వేగమంతా మందగించింది. సొకోత్రా దీవి దగ్గర వర్షం ఉధృతంగా వుంది. ఈ స్థలమే ఋతుపవనాలకు కేంద్రమని, దీన్ని మనం దాటగలిగితే ప్రశాంత వాతావరణంలోకి పోగలుగుతామని కెప్టెన్ చెప్పాడు. అలాగే జరిగింది కూడా. ఇంతటితో యీ దారుణ పీడ అంతమైంది.

8 వ తేదీ సాయంత్రం మేం ఏడెన్ చేరాం. తెల్లవాడుగాని, నల్లవాడు గాని ఓడనుండి కిందికి దిగటానికి, సరుకును ఓడ మీదికి ఎక్కించటానికి అనుమతి యివ్వబడలేదు. చూడదగ్గ విచిత్రాలేవీ ఏడెన్‌లో లేవు. రాజపుత్రస్థానంలో మాదిరి ఎడారి ప్రాంతాలు విస్తరించి వున్నాయి. చెట్లు చేమలులేని గుట్టల మధ్య తోటలు, గుట్టలమీద సిపాయిల ఇళ్లు వున్నాయి. ముందు

హోటళ్లు, అంగళ్లు, అర్ధచంద్రాకృతిలో కట్టబడి వున్నాయి. వీటిని ఓడలోనుండి చూడొచ్చును. ఎన్నో ఓడలు రేవులో లంగరు దింపి వున్నాయి. ఆంగ్లేయుల దొకటి, జర్మన్‌ల దొకటి – రెండు యుద్ధనౌకలున్నాయి. తక్కినవి రవాణానౌకలు, ప్రయాణీకుల నౌకలు. క్రితంసారి నేను వచ్చినప్పుడు పట్టణాన్ని చూశాను. ఈ కొండల వెనుక దేశీయుల ఇళ్ల వరుసలు, బజార్లు వున్నాయి. అక్కణ్ణుంచి కొన్ని మైళ్ల దూరంలో కొండలపక్క గోతులు తవ్వారు. ఆ గోతుల్లోకి వర్షపునీరంతా చేరుకొంటుంది. పూర్వం అక్కడివాళ్లు ఆ నీరే తాగేవారు. ఇప్పుడు యంత్రాల ద్వారా సముద్రంనుండి మంచినీటిని తయారు చేసుకొంటున్నారు. కాని యీ నీటి ఖరీదు ఎక్కువ. ఏడెన్ పట్టణం మన పట్టణాల మాదిరే వుంటుంది. ఎక్కువమంది జనం హిందువులు. సైనికులలోకూడా అధికభాగం హిందువులే. చాలమంది పార్శీ, సింధీ వర్తకులు వున్నారు. ఏడెన్ అతిపురాతన పట్టణం. రోమన్ చక్రవర్తి కాన్‌స్టంటైన్ క్రైస్తవ మతప్రచార నిమిత్తం కొంతమంది మతప్రచారకులను అక్కడికి పంపాడు. అరబ్బులు తిరగబడి వారిని చంపేశారు. దాంతో ఆ రోమన్ చక్రవర్తి వారిని శిక్షించవలసిందిగా అబిసీనియన్ రాజును కోరాడు. అబిసీనియాలో చాలకాలంగా క్రైస్తవమతం ప్రచారంలో వుండేది. అబిసీనియా రాజు ఒక సైన్యాన్ని పంపి ఏడెన్ లోని అరబ్బులను కఠినంగా శిక్షించాడు. తరువాత పర్షియాకు చెందిన 'సమనిధి రాజులు' ఏడెన్ ను ఆక్రమించారు. కొండల్లో నీళ్లు నిలువచెయ్యటానికి గుహలు తొలిచింది వీరేనని ప్రసిద్ధి. తరువాత మహమ్మదీయ మతం విజృంభించింది. అరబ్బులు ఏడెన్ పట్టణాన్ని ఆక్రమించారు. తరువాత కొంతకాలానికి ఒక పోర్చుగీసు సేనాని యీ పట్టణాన్ని ముట్టడించటానికి వ్యర్థప్రయత్నాలు చేశాడు. అప్పుడు టర్కీసుల్తాన్ హిందూమహాసముద్ర ప్రాంతంనుండి పోర్చుగీసులను వెళ్లగొట్టటానికి ఏడెన్ పట్టణాన్ని నౌకాస్థావరంగా మార్చాడు.

మళ్లా ఏడెన్ పట్టణం పొరుగు అరబ్బురాజు అధీనమైంది. తరువాత అతని వద్దనుండి ఇంగ్లీషువారు దాన్నిగైకొని ప్రస్తుత పట్టణాన్ని అభివృద్ధిచేశారు. ప్రస్తుతం ప్రపంచంలోని ప్రతి బలవంతమైన దేశ యుద్ధనౌకలు ప్రపంచమంతటా తిరుగుతున్నాయి. ప్రతి దేశం ప్రపంచంలో ఎక్కడెక్కడ తగాదా పుడుతుందో అక్కడక్కడ తన అధికారం చలామణీ కావాలని వాంఛిస్తోంది.

ప్రతి దేశం తన ఆధిక్యాన్ని, తన రాజకీయ లాభాలను, తన వర్తక వ్యవస్థలను పదిలంగా కాపాడుకోవాలని వాంఛిస్తోంది. అందుచేత యీ దేశా లన్నింటికి సర్వకాల సర్వావస్థల్లో బొగ్గు కావాలి. యుద్ధ కాలంలో శత్రుదేశాలనుండి బొగ్గు సరఫరా అవటం కష్టం. కాబట్టి ప్రతి దేశం బొగ్గు నిలువచేసుకోటానికి కొన్ని ప్రాంతాలను తన అధీనంలోకి తెచ్చుకోవాలని కాంక్షిస్తూంది. ఉన్నవాటిల్లో మంచి ప్రాంతాలను ఆంగ్లేయులు ఆక్రమించుకొన్నారు. మిగిలినవాటిలో మంచివాటిని ఫ్రెంచ్‌వారు ఆక్రమించారు. వారి తరువాత మిగిలిన పాశ్చాత్యదేశాలవారు పనికి వచ్చే తక్కిన ప్రాంతాలను బలవంతంగానో, ధనమూలంగానో, స్నేహసంబంధాలవల్లో తమ అధీనం చేసుకొన్నారు. ఇప్పుడు ఆసియా, ఐరోపా దేశాలను సూయజ్ కాలువ కలుపుతోంది. అదిప్పుడు ఫ్రెంచ్‌వారి అధీనంలో వుంది. అందుకు ప్రతిగా ఆంగ్లేయులు ఏడెన్ రేవులో తమ పరిస్థితిని కట్టుదిట్టం చేసుకొన్నారు. తక్కిన దేశాలవారు ఎర్ర సముద్రం వెంట ఏదో ఒక ప్రాంతాన్ని ఆక్రమించుకొన్నారు. ఒక్కొక్కప్పుడు యిలాంటి కాంక్ష వినాశకరమైన ఫలితాలను తెచ్చిపెడుతుంది. ఇటలీ ఏడు శతాబ్దాల కాలం విదేశీయుల పరిపాలన కింద నలిగిపోయింది. తరువాత అష్టకష్టాలుపడి స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొంది. వెంటనే ఇటలీవారు యితర దేశాలను జయించాలనే దురాశతో దురాలోచనలు చెయ్యసాగారు. ఐరోపాలో ఒక దేశానికి చెందిన భూభాగాన్ని మరో దేశం వారు అంగుళమైనా ఆక్రమించుకోటానికి వీలులేదు. అలా జరిగితే తక్కిన దేశాలన్నీ కలిసి ఆ ఆక్రమించుకొన్న దేశంపై పడతాయి. ఆసియాలో ఈ శక్తివంతులైన ఆంగ్లేయులో, రష్యావారో, ఫ్రెంచ్‌వారో, డచ్చివారో ఆక్రమించుకోకుండా వదిలేసిన స్థలం అంగుళమైనా లేదు. ఆఫ్రికాలో కొన్ని చిన్న ప్రాంతాలు మాత్రం మిగిలాయి. కాబట్టి ఇటలీ తన దృష్టిని ఆ పక్కకు తిప్పింది. మొదట ఇటలీ ఉత్తర ఆఫ్రికాను ఆక్రమించటానికి ప్రయత్నించింది. కాని అక్కడ ఫ్రెంచ్‌వారు ఎదురయ్యారు. అందుచేత ఇటలీ తన ప్రయత్నాలను మానుకోవలసి వచ్చింది. ఇప్పుడు ఇటలీకి ఆంగ్లేయులు ఎర్ర సముద్ర ప్రాంతంలో కొంత భూభాగాన్ని ఇచ్చారు. అక్కణ్ణుండి ఇటలీ అబిసీనియా రాజ్యాన్నంతా ఆక్రమించుకోగలదని ఆంగ్లేయుల కుతంత్రం. ఇటలీకూడా పెద్దసైన్యంతో సిద్ధమైంది. కాని అబిసీనియారాజు 'మనీలిక్' అనేవాడు ఇటలీని చావబాదాడు. ఆఫ్రికానుండి వెనక్కు పారిపోవటానికికూడా ఇటలీకి

కష్టమైంది. ఇంతేకాక రష్యా, అబిసీనియా దేశాల క్రైస్తవంలోని సాదృశ్యంవల్ల రష్యా చక్రవర్తి అబిసీనియాకు స్నేహితుడయ్యాడు.

సరే... ఇప్పుడు మా ఓడ ఎర్ర సముద్రంగుండా ప్రయాణిస్తోంది. ఓడలో వున్న క్రైస్తవ మతాచార్యుడిలా అన్నాడు: "యూదుల నాయకుడైన మోసెస్ తన అనుచరులతో యీ ఎర్ర సముద్రాన్ని కాలినడకన దాటాడు. ఈజిప్టు రాజైన ఫారో వారిని పట్టుకోవటానికి పంపిన సైన్యం సముద్రంలో మునిగిపోయింది. సైన్యంలోని రథాల చక్రాలు బురదలో కూరుకుపోయాయి." మహాభారతంలోని కర్ణుని రథచక్రాల లాగా.

అతడు ఈ సంగతిని అధునాతన భౌతికశాస్త్రీయ కారణాలు చూపించి ధృడపరచ వచ్చన్నాడు. ఈ రోజుల్లో ప్రతి దేశంలోను మన మహిమను భౌతిక శాస్త్రీయ పద్ధతులతో నిరూపించటం ఒక ఫ్యాషనైపోయింది. ఇలాంటి మహిమలన్నీ ప్రకృతి శక్తులవల్ల జరిగేవైతే వీటిద్వారా భగవంతుడున్నాడని నిరూపించటానికి వీలుపడదు గదా? ఇది ఒక పెద్ద సమస్యే. ఈ మహిమలు భౌతికశాస్త్రం వల్ల ఋజువుకాకపోతే అవివట్టి కట్టుకథలవుతాయి. అప్పుడు మీ మతం అప్రామాణికమవుతుంది. భౌతికశాస్త్రంవల్ల ఋజువైనప్పుడే మీ దేవుడు దేవుడు. అలా కాకపోతే మీ దేవుడి వైభవం వట్టి దండుగ. అప్పుడా మహిమలు తక్కిన ప్రకృతి సంఘటనల మాదిరే స్వాభావికాలవుతాయి. అంటే ఉభయసంకటం. దీనికి బోగేష్ మతగురువు సమాధానం: "ఇందులో ఇన్ని చిక్కులున్నాయని నాకు అర్థం కాలేదే! నేను మారికే నమ్మాను అంతే." ఫరవాలేదు దీన్ని సహించవచ్చును. కాని ఇంకోరకం జనం వున్నారు. వీరు ఇతరుల అభిప్రాయాలను గట్టిగా విమర్శిస్తారు. ఆ విమర్శల్లో నానారకాల వాదనలు చేస్తారు. కాని వారి విశ్వాసాల సంగతి వచ్చినప్పుడు ఇలా అంటారు: "మేము మారికే విశ్వసిస్తాం. ఆ విశ్వాసాల్లోని నిజానికి మా మనస్సే సాక్షి." దీన్నిమాత్రం సహించటం కష్టం. వారి బుద్ధికి విలువేముంది? ఏమీ లేదు. ఇతరుల మత విశ్వాసాలన్నీ అంధవిశ్వాసాలని, ముఖ్యంగా ఐరోపీయులచే నిందింపబడ్డ వారి మతవిశ్వాసాలను కొట్టివేస్తారు. ఇతరుల మతవిశ్వాసాలను వారెంతో తేలిగ్గా కొట్టివేస్తారు.

కాని వారి విడ్డూరపు విశ్వాసాలను గురించి కొన్ని భగవద్విషయక సందర్భాలను కల్పించుకొని వాటిపైన ఎంతో ఆవేశాన్ని పెంచుకొంటారు.

మా ఓడ ఉత్తర దిక్కుకేసి ప్రయాణిస్తోంది. ఎర్రసముద్ర తీరంలో ప్రాచీన నాగరికత వర్ధిల్లింది. ఎర్ర సముద్రానికి అటువైపు అరేబియా ఎడారి, యిటుపక్క ఈజిప్టు వున్నాయి. ఇది అతి ప్రాచీన దేశం. వేల సంవత్సరాల కింద యీ ఈజిప్టు దేశస్థులు పుంట్ (ఇది బహుశ మలబారు కావచ్చును) నుండి బైలుదేరి ఎర్ర సముద్రాన్ని దాటి క్రమక్రమంగా వారి రాజ్యాన్ని ఈజిప్టుదాకా వ్యాపింపచేసుకొన్నారు. వారి రాజ్యవిస్తరణ, వారి నాగరికత ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. గ్రీకులు వీరి శిష్యులు. వారి రాజులకు నిర్మించిన గోరీలకు 'పిరమిడ్స్' అని పేరు. శరీరమంతా సింహంగా, ముఖం మాత్రం మానవస్త్రీగా వున్న 'స్ఫింక్స్' అనే దేవతల బొమ్మలతో వుండే ఆశ్చర్యకరమైన కట్టడాలు నేటికీ నిలిచివున్నాయి. ఇప్పటికీ ఆ రాజుల కళేబరాలు పిరమిడ్స్‌లో భద్రంగా వున్నాయి. ప్రాచీన ఈజిప్టు దేశస్థులు యిక్కడ నివసించారు. వారి జుట్టు ఉంగరాలుగా తిరిగి వుండేది. వారు చెవులకు పోగులు పెట్టుకునేవారు. తెల్లని ధోవతులను లుంగీలుగా కట్టుకొనేవారు. హైక్సోలు, ఫారోలు, పర్షియా చక్రవర్తులు, అలెగ్జాండర్, టాలమీలు, రోమన్, అరబ్బు విజేతలు ఈ ఈజిప్టులో వర్ధిల్లారు. ఎన్నో శతాబ్దాల క్రితమే వారు తమ చరిత్రనంతా వారి పురాతన లిపిలో 'పాపైరస్' అనే మొక్కనుండి తయారుచేసిన కాగితంమీద, రాతి పలకలమీద, మట్టికుండలమీద వివరంగా లిఖించారు.

ఐసిస్ పూజించబడింది, హోరస్ వర్ధిల్లింది యీ దేశంలోనే. ఈ ప్రాచీన ఈజిప్టు దేశస్థులు మనిషి మరణించినప్పుడు అతని సూక్ష్మశరీరం తిరుగుతుందని, అతని స్థూల కళేబరానికి ఏవిధమైన గాయం కలిగినా అది అతడి సూక్ష్మశరీరంలో ప్రతిబింబిస్తుందని, యీ స్థూలశరీరాన్ని నాశనం చేస్తే ఆ సూక్ష్మశరీరంకూడా నశిస్తుందని విశ్వసించేవారు. కాబట్టే యీ నిర్జీవ కళేబరాలను భద్రపరచటానికి వారంత శ్రమపడేవారు. అందుచేతనే రాజులకు, చక్రవర్తులకు ఇంత పెద్ద పెద్ద పిరమిడ్లు నిర్మించారు. వీటి నిర్మాణంలో పాపం ఎన్ని

ఉపాయాలను అవలంబించారో! ఎంత శ్రమ పడ్డారో! కాని వారి ప్రయాసంతా వ్యర్థమైంది. ఈ పిరమిడ్లలో వుంచబడ్డ ధనరాసులచే ఆకర్షితులై దొంగలు వీటికి కన్నాలువేసి, వాటిలోని మాయాగదుల్లోకి చొరబడి ఆ రాజుల శవాలను ఎత్తుకుపోయారు. ఇది జరిగింది యిప్పుడు కాదు. ఇదికూడా ఆ ప్రాచీన ఈజిప్టుదేశస్థుల పనే. ఐదారువందల సంవత్సరాల క్రితం యూదు, అరబ్బు వైద్యులు యీ ఎండిపోయిన ప్రాచీన శవాల్లో గొప్ప ఔషధప్రక్రియ లున్నట్లు నమ్మి, యీ మందులను ఐరోపా అంతటా రోగుల కిచ్చేవారు. యునానీ, హకిమీల పద్ధతుల్లో యీ పురాతన శవాలు అసలైన 'ముమియా' వైద్యవిధానానికై పనికివచ్చేవి.

అశోక చక్రవర్తి టాలమీ వంశస్థులు పాలిస్తుండగా ఈజిప్టుకు మత ప్రచారకులను పంపాడు. వారు మతప్రచారంచేస్తూ, రోగాలు నయం చేస్తూ, శాకాహారాన్ని తింటూ, బ్రహ్మచర్యం అవలంబిస్తూ, శిష్యులకు సన్న్యాసమిస్తూ వుండేవారు. వారు థేరపెటే, ఎస్సెనెస్, మనిఛయన్స్ మొదలైన అనేక మతశాఖలను నెలకొల్పారు. వీటిలోనుండే అధునాతన క్రైస్తవమతం జన్మించింది. టాలమీల పరిపాలనలో ఈజిప్టు సమస్త విద్యలకు నెలవయింది. ఇక్కడ అలెగ్జాండ్రియా అనే పెద్దపట్టణం వుంది. ఇక్కడున్న విశ్వవిద్యాలయం ప్రపంచ ప్రసిద్ధిపొందింది, ఇక్కడి గ్రంథాలయం ఎంతో ప్రశస్తిగాంచింది. ఇక్కడి విద్యావంతులు ప్రపంచఖ్యాతి గాంచారు. ఈ అలెగ్జాండ్రియా పట్టణం నిరక్షరాస్యులు, ద్వేషపూరితులు, నీచులైన క్రైస్తవుల చేతిలోపడి సర్వనాశనమైంది. వారీ గ్రంథాలయాన్ని తగులబెట్టారు. ఇక్కడి విజ్ఞానాన్ని పీకిపారవేశారు. చిట్టచివరికీ క్రైస్తవులు 'హైపేషియా' అనే ఒక పరిచారికను చంపి, ఆమె శవాన్ని ఎముకలు తప్ప ఏమీ మిగలకుండా వీథులగుండా ఈడ్చి, మహాఅవమానం జరిపారు.

ఈ దేశానికి దక్షిణంగా అరేబియా ఎడారి వుంది. ఇది అనేకమంది వీరుల పుట్టినిల్లు. మీరెన్నడైనా బురఖా తొడుక్కొన్న బిడోయిన్ అరబ్బును చూశారా? అతడి తలకు ఊలు కుచ్చులతో ఒక పెద్ద రుమాలు చుట్టబడి వుంటుంది. అతడి నడక, నిలబడటంలోని తీరు, ఆ చూపులు, మీకింకో దేశంలో కనబడదు. విశాలమైన ఆ ఎడారి స్వాతంత్ర్యానికి ప్రతీకమైనట్లుగా

వుంటుంది – అలాంటిది అరేబియా. క్రైస్తవుల మతోన్మాదం, గోత్ జాతీయుల అత్యాచారం, గ్రీకు, రోమన్ నాగరికతలను నాశనం చేసినప్పుడు, పర్షియా తన అవినీతిని బంగారపు ఆకులతో కప్పివెయ్యటానికి ప్రయత్నించినప్పుడు, భారతదేశంలోకూడా భారతీయ సంస్కృతిపై దెబ్బపడ్డప్పుడు, పాటలీపుత్ర ఉజ్జయినీ సామ్రాజ్యసూర్యులు అస్తమించినప్పుడు, దేశం నిరక్షరాస్యులైన క్రూరరాజుల పరిపాలనలోకి రాగా, పరమనీచమైన అవినీతి, అశ్లీలత, కామదేవతారాధన విశృంఖల విహారం చేసినప్పుడు – ఇలాంటి ప్రపంచ పరిస్థితుల్లో ఈజిప్టు ఎడారిలో ఈ క్షుద్రమైన, పశుప్రాయులైన అరబ్బుజాతి మెరపులా సర్వత్రా వ్యాపించింది.

ఇక్కడ మక్కానుండి నిండు ప్రయాణీకులతో వచ్చే స్టీమరును గమనించండి. టర్కీవారు ఐరోపావారి మాదిరి వేషం వేసుకొంటారు. ఈజిప్టువారు సగం పాశ్చాత్య వేషంతో వుంటారు. సిరియా మహమ్మదీయులు ఇరాన్ దుస్తులు ధరిస్తారు. అచ్చమైన అరబ్బులు మోకాలు కిందికి వచ్చే బట్టలు ధరిస్తారు. మహమ్మదు జన్మించటానికి పూర్వం దిగంబరులై, కాబా దేవాలయానికి ప్రదక్షిణ చెయ్యటం వారి అలవాటు. మహమ్మదు కాలంనుండి దుస్తులు ధరించటం ప్రారంభమైంది. ఇందువల్లే మన దేశంలో మహమ్మదీయులు ప్రార్థనా సమయాల్లో లాగూ బొందులు విప్పి వారి పాదాలదాకా బట్టను వ్రేలాడగడతారు. ఇప్పుడు అరబ్బుల రోజులు గతించాయి. ఎడతెగకుండా లోపలికి తోసుకొచ్చిన కాఫర్లు, సిదీలు, అబిస్సీనియన్లు అరబ్బుజాతిని సాంకర్యం చేశారు. వారి శరీర దారుఢ్యం, శక్తి పూర్తిగా మారిపోయింది. ఈ ఎడారి అరబ్బుల పూర్వ వైభవమంతా వినష్టమైపోయింది. ఉత్తర దిక్కున టర్కీరాజ్య పౌరులు శాంతజీవనాన్ని గడుపుతున్నారు. కాని ఇక్కడ సుల్తాను కాలంలోని క్రైస్తవ ప్రజలు తురకలను (టర్క్స) ద్వేషిస్తారు. అరబ్బులంటే ఇష్టపడతారు. వారిలా అంటారు: "ఈ అరబ్బులు చెప్పినట్లు వింటారు, చదువుకొంటారు. పెద్దమనుషులవుతారు. వారితో అంత చిక్కులేదు. కాని తురకవారు మాత్రం క్రైస్తవులను బాగా అణచివేస్తారు."

ఈ ఎడారి ఎంతో ఉష్ణప్రాంతమైనప్పటికీ యిక్కడి వేడి బలహీనతను కలిగించదు. నువ్వు

తలను, శరీరాన్ని కప్పుకుంటే చాలు ఎండవల్ల ఏ ప్రమాదమూ వాటిల్లదు. ఈ వేడిలో ఉక్కపోత వుండదు. దీనివల్ల బలహీనత కలుగదు సరికదా యిలాంటి ఎండవల్ల శరీరారోగ్యం బాగుపడుతుంది. రాజపుత్రస్థానం, అరేబియా, ఆఫ్రికాలలోని జనమే దీనికి నిదర్శనం. మార్వారులోని కొన్ని మండలాల్లో మనుషులు, పశువులు, గుర్రాలు బలిష్ఠవంతాలై, దృఢ దీర్ఘకాయాలతో వుండటం చూస్తాం. ఈ అరబ్బులను, సిద్దీలను చూడ్డం సంతోషకరంగా వుంటుంది. బెంగాల్‌లోలాగా వేడిలో తేమవుంటే శరీరం శక్తిహీనమై పోతుంది. ప్రతి జంతువు బలహీనంగా వుంటుంది.

ఎర్రసముద్రం పేరు వినగానే ప్రయాణీకులు భయపడతారు. అక్కడి వేడి భయంకరమైంది. వేసవిలో అది మరింత ఎక్కువగా వుంటుంది. ఇప్పుడూ అంతే. ప్రతివాడూ డెక్ మీద కూర్చుని వాడికి తెలిసిన ఒక భయంకరమైన ఆపదను గురించి కథ చెప్తాడు. కెప్టెన్ వీరందరికంటె గొప్పకథాకారుడు. అతడిలా చెప్పాడు: "కొన్ని రోజుల క్రితం ఒక చైనా యుద్ధనౌక ఎర్రసముద్రంలో ప్రయాణం చేస్తోంది. దాని కెప్టెన్, బొగ్గు గదిలో పనిచేస్తున్న మరి ఎనిమిదిమంది నావికులు ఎండదెబ్బకు చచ్చిపోయారు."

నిజానికి బొగ్గు గదిలో పనిచేస్తున్నవారు అగ్ని మధ్య నిలబడి వుండాలి. దీనికితోడు ఎర్రసముద్రం ఎండతో ఒక్కొక్కప్పుడు వారికి పిచ్చెక్కుతుంది. డెక్‌మీది కెక్కి వారు సముద్రంలోకి దూకి చచ్చేవారు. ఒక్కొక్కప్పుడు ఇంజను గదిలోనే చచ్చిపోయేవారు.

ఈ కథలను విని మాకు పై ప్రాణాలు పైనే పోయినట్లయింది! అదృష్టవశాత్తు మేమంత మండుటెండను అనుభవించలేదు. పైగా అప్పుడు సహజంగా వీచే దక్షిణపు గాలికి బదులు ఉత్తరపుగాలి వీస్తోంది. ఈ ఉత్తరపుగాలి మధ్యధరా సముద్రం నుండి వీస్తుంది కాబట్టి చల్లగా వుంటుంది.

జూలై 14 వ తేదీన స్టీమరు ఎర్ర సముద్రాన్ని దాటి సూయజ్ కాలువలో ప్రవేశించింది.

మాముందు సూయజ్ కాలువ వుంది. సూయజ్ రేవులో సరుకును దింపాలి. ఇప్పుడు ఈజిప్టులో ప్లేగువ్యాధి వ్యాపించివుంది. బహుశా ఓడపైనున్న వారిలో కూడా ప్లేగు క్రిములు వుండొచ్చును. కాబట్టి రెండు పక్కలనుండి ఈ వ్యాధి సోకే ప్రమాదముంది. కాబట్టి ఈ వ్యాధి వ్యాపించకుండా యిక్కడ తీసుకొన్న జాగ్రత్తలతో మన దేశంలో తీసుకొన్న చర్యలను పోలిస్తే అవి శూన్యమనే చెప్పాలి. ఇప్పుడు సరకులు దింపాలి. కాని సూయజ్ రేవులోని పనివారు ఓడను ముట్టుకోకూడదు. అందువల్ల యీ భారం ఓడలోని నావికులమీదపడింది. వారు కూలీలుగా పనిచెయ్యాలి. క్రేనులతో సరకులెత్తి, వాటిని దింపి ముట్టుకోకుండా సూయజ్ రేవులోని పడవల్లోకి దింపాలి. ఈ పడవలు అప్పుడు ఈ సరకును తీరానికి చేరుస్తాయి. కంపెనీ ఏజంట్ ఒక చిన్న లాంచీలో ఓడ వద్దకు వచ్చాడు. కాని అతణ్ణి ఓడపైకి రానివ్వలేదు. అతడు లాంచీలో నిలబడే కెప్టెన్‌తో మాట్లాడాడు. ఇది భారతదేశం కాదు. అందుచేత ప్లేగువ్యాధి సోకకుండా చేసిన కట్టుదిట్టాలు యిక్కడ ఆంగ్లేయులక్కూడా వర్తిస్తాయి. ఇక్కణ్ణుండి ఐరోపా ప్రాంరంభమౌతుంది. కాబట్టి ప్లేగువ్యాధి వ్యాపించకుండా కట్టుదిట్టాలు, నిర్బంధాలు కఠినంగా అమలుపరచబడేవి; ఒకవేళ ఎలుకలోనుండి పుట్టిన ఈ ప్లేగువ్యాధి, అలాంటి కఠిన చర్యలు అమలు కాకపోతే యీ యూరోపు స్వర్గంలోకి చొరబడుతుందేమో అని వారి భయం. ప్లేగు క్రిముల జీవితకాలం పది రోజులు. అందుచేత పది రోజులు మాత్రమే మనం ఓడ దిగకూడదు. మాకు పది రోజులు దాటిపోయాయి. అందుచేత మాకు ఆ వ్యాధి సోకే ప్రమాదం లేదు. కాని మేమిక్కడ ఏ ఈజిప్టు వాడినైనా తాకితే మళ్లీ పదిరోజులు ఓడ దిగకూడదు.

అలా తాకితే నేపుల్స్‌లోగాని, మార్సేల్స్‌లోగాని ఎవరూ ఓడ దిగటానికి వీలుండదు. అందుచేత ఏ పనైనా దూరంనుండే ముట్టుకోకుండా చెయ్యవలసి వచ్చింది. ఓడ నావికులకు యీ కారణంతో సరుకును దింపటానికి ఒకరోజు పట్టింది. ఓడకు సర్చ్‌లైటు వుంటే ఆ రాత్రి అది సూయజ్ కాలువ దాటగలిగేదే కాని ఆ సెర్చ్‌లైట్‌ను ఓడకు బిగించాలంటే సూయజ్‌రేవులోని పనివారు ఓడను ముట్టుకోవలసి వుంటుంది. అప్పుడు ఓడలోని వారికి పది రోజులు వెలి తప్పదు. అందువల్ల ఓడ రాత్రి బైలుదేరకూడదు. కాబట్టి మేం సూయజ్ రేవులో 24 గంటలు

వుండాలి. ఈ సూయజ్ రేవు స్వతస్సిద్ధమైన, సహజమైన రేవు. దీనికి మూడు వైపుల మూడు ఇసుకతిప్పలు, గుట్టలు వున్నాయి. దీన్లో నీరు చాలలోతు. ఈ నీళ్లలో అసంఖ్యాకమైన చేపలు, సొరచేపలు ఈదుతుంటాయి. ఇక్కడా, ఆస్ట్రేలియాలోని సిడ్నీ రేవులోను వున్నంత సమృద్ధిగా సొరచేపలు ప్రపంచంలో మరెక్కడా కనిపించవు. ఏరకమైన సందు దొరికినా అవి మనుషలను మింగివెయ్యటానికి సిద్ధంగా వుంటాయి. ఎవరూ నీళ్లలోకి దిగటానికి సాహసంచెయ్యరు. మనుషులుకూడా పాములు, సొరచేపలు కనిపిస్తే, వాటిని చంపటానికి సందు దొరికితే విడిచిపెట్టరు.

మరునాడు ఉదయం భోజనానికి ముందే పెద్ద పెద్ద సొరచేపలు మా ఓడ వెనుక ఈదుతున్నట్లు మాకు తెలిసింది. నేను బతికున్న సొరచేపను ఎన్నడూ చూడలేదు. పూర్వం నేను వచ్చినప్పుడు మా ఓడ సూయజ్‌లో కొంచెంసేపే ఆగింది. అదికూడా పట్టణం దగ్గరగా ఆగింది. అందుచేత సొరచేపను చూసే అవకాశం నాకప్పుడు లేకపోయింది. సరే, యీ సొరచేపలను గురించి వినగానే మే మక్కడకు పరిగెత్తాం. రెండవ తరగతి ఓడకు వెనుక భాగంలో వుంది. ఓడ డెక్ మీద పురుషులు, స్త్రీలు, పిల్లలు గుమికూడి కటకటాలపైన చేతులానించి ఆ చేపలను చూస్తున్నారు. కాని మేం అక్కడకు వెళ్లగనే సొరచేపలు కొంచెం దూరానికి వెళ్లాయి. అందువల్ల మా ఉత్సాహం మందగించింది. కాని మేం లకుముకి పిట్ట ముక్కువంటి తలలుగల ఒక రకమైన చేపలను నీటిలో ఈదుతుండగా చూస్తున్నాం. అంతేకాక ఎంతో చిన్న చేప జాతులుకూడా ఎక్కువగా వున్నాయి. అప్పుడప్పుడు చాల పెద్ద చేపలు బాణం దూసుకొనిపోయేట్లు అక్కడక్కడ దూకుతున్నాయి. నేను అవి చిన్న సొరచేపలేమో అనుకున్నాను. కాని తరువాత కాదని తేలింది. ఆచేప పేరు 'బోనిటో'. ఇంతకు పూర్వం దాన్ని గురించి చదివాను. ఈ చేపలు మాల్దీవులనుండిపెద్ద పడవల మీద ఎండుచేపలుగా వంగదేశానికి ఎగుమతయ్యేవని కూడా చదివినట్లు నాకు గుర్తు. ఈ చేప మాంసం ఎర్రగా, రుచికరంగా వుంటుందని కూడా చదివాను. ఇప్పుడు దాని వేగం, శక్తి చూసి ఎంతో ఆనందించాను. అంత పెద్ద చేప నీళ్లలో బాణంలా దూసుకుపోయింది. అందులో ఈ సముద్రం నీళ్లు అద్దంలా నిర్మలంగా వున్నాయి. దీన్లో దాని

శారీరక చలనాలన్నీ స్పష్టంగా చూడొచ్చును. మేం ఈ బోనిటో చేప పరుగులను, ఆ చిన్నచేపల చంచల నృత్యాలను ఇరవై, ముప్పై నిమిషాలసేపు చూశాం. అరగంట, ముప్పావుగంటకావచ్చును, మేం చాలా అలసిపోయాం. ఒకడు 'అదుగో! సొరచేప!' అంటూ అరిచాడు. ఒక డజనుమంది మనుషులు 'అదిగో వస్తోంది' అంటూ అరిచారు. నా కళ్లను పక్కకు తిప్పాను. కొంత దూరంలో ఒక పెద్ద నల్లనిదేదో ఆరు ఏడు అంగుళాల లోతున నీళ్లలో మా వంకకు కదలివస్తున్నట్లు కనబడింది. క్రమంగా అది దగ్గరకు వచ్చింది. దాని తల చదునుగా విశాలంగా వుంది. అది నెమ్మదిగా వస్తోంది. బోనిటో చేపకున్న వేగం ఏమీలేదు. కాని అది దాని తలను ఒక్కమారు తిప్పితే చాలు. ఒక పెద్ద వలయం ఏర్పడుతుంది. చాల పెద్ద చేప అది! ఎంతో హుందాగా కదులుతోంది. దాని ముందు ఒకటి, రెండు చిన్న చేపలున్నాయి. అసంఖ్యాకమైన పిల్లచేపలు దాని వీపుమీద, దాని శరీరమంతటా ఆడుకొంటున్నాయి. కొన్ని దాని మెడను అతుక్కొన్నాయి. అదిగో అదే సొరచేప! దాని పరివారంతో, అనుచరులతో బైలుదేరింది. దానిముందు వచ్చే చేపలను మత్స్యాలంటారు. సొరచేపకు ఆహారాన్ని వెదకి చూపించటం వాటిపని. బహుశ అది తినగా మిగిలిన ముక్కలను యీ చేపలు తింటాయేమో. ఈ సొరచేపలు నోరు ఆవులించినప్పుడు మనం చూసి తీరాలి. చాల భయంకరంగా వుంటుంది. ఆ సందర్భంలో అది తిన్న తర్వాత తక్కిన చేపలకు ఏమైనా లభిస్తుందా? అనే సందేహం కలుగుతుంది. ఈ సొరచేపల వీపుమీద ఎక్కిన చేపలను జలగచేప లంటారు. ఈ చేపల వక్షంలో రెండంగుళాల వెడల్పు, నాలుగు అంగుళాల పొడవుగల గుండ్రని భాగాలుంటాయి. అవి సంచుల్లా వేలాడుతుంటాయి. అవి ఆంగ్లేయుల చెప్పులలోని రబ్బరు మాదిరి వుంటాయి. ఈ సంచులను యీ చిన్న చేపలు సొరచేపల శరీరానికి తగినట్లుగా అతుక్కొని వుంటాయి. అవి యీ సొరచేపల వీపుమీద కూర్చుని స్వారీ చేస్తున్నట్లుగా వుంటుంది. ఈ చేపలు, ఈ సొరచేప శరీరంమీద పుట్టే పురుగులను తిని బతుకుతుంటాయనే యింకో అభిప్రాయం వుంది. సొరచేపకు యీ రకమైన రెండు తరగతుల పరివారం వుంటుంది. అది వీటికి మాత్రం ఏ అపాయం తలపెట్టదు. 'తన అనుచరులు, స్నేహితులు' అని దానికి వాటిపై మక్కువ వుంటుంది. ఈ జలగ చేపల్లో ఒకదాన్ని ఒకడు గాలంవేసి పట్టుకొన్నాడు. ఒకడు దాని రొమ్మున వ్రేలాడుతున్న సంచిని తన చెప్పుతో

తొక్కాడు, అతడు కాలు పైకి తియ్యగానే ఆ చెప్పును అది అతుక్కుని పైకి లేచింది. అది యీ రకంగానే సొరచేపను పట్టుకొని వేలాడుతుంది.

రెండవ తరగతి ప్రయాణీకుల ఉత్సాహానికి అంతేలేదు. వారిలో ఒకడు మిలటరీవాడు. అతగాడి ఉత్సాహం మితిమీరింది. ఓడంతా వెతికి వారొక పెద్ద గాలాన్ని తెచ్చారు. అది వంగదేశంలో నూతుల్లోపడ్డ కడవలను తీయడాని కుపయోగించే గాలంకంటే పెద్దది. దీనికి వారు రెండు పౌన్ల మాంసాన్ని, ఒక పెద్ద గట్టి తాడుతో కట్టారు; ఒక పెద్ద కర్రముక్కను నీళ్లపైన తేలటానికి కట్టారు. అప్పుడు యీ తేలే కర్రతోపాటు దాన్ని నీళ్లలోకి వదిలారు. ఓడకు కింది భాగంలో ఒక పోలీసు పడవ ఒడ్డునున్న జనంతో మా కెలాంటి సంపర్కం లేకుండా చెయ్యటానికి కాపలా కాస్తోంది. దానిమీద ఇద్దరు హాయిగా నిద్రపోతున్నారు. ఇది ఓడమీద వున్నవారికి అసూయాజనకంగా వుంది. ఇప్పుడుమాత్రం వారికి, వీరికి స్నేహమైంది. ఒక పెద్ద గోల విని అందులోని ఒక అరబ్బువాడు కళ్లు నులువుకొంటూ లేచి నిలబడ్డాడు. ఏదో ఆపద మూడిందనుకొని అతడు తన దుస్తులను సర్దుకొన్నాడు. తరువాత చూస్తే ఓడమీదున్నవారు ఆ గాలాన్ని, ఆ కర్రముక్కను 'ఇంకా కాస్తదూరం తొయ్యండి' అని వారిని హెచ్చరించారు. అతడు 'బ్రతుకు జీవుడా' అంటూ ఒక నిశ్వాసం విడిచి, నవ్వుతూ ఒక కర్రతో, ఆ తేలుతున్న కర్రను కొంత దూరం తోశాడు. మేం కాలి వేళ్లమీద నిలబడి, కటకటాల నానుకొని, ఎంతో ఆతురతతో సొరచేపకోసం 'జయదేవుని' రాధికలా వేయు కళ్ళతో ఎదురు చూస్తున్నాం! కాని సామాన్యంగా మనం ఎవరికోసం ఆతురతతో నిరీక్షిస్తామో అతడే ఒక్కొక్కప్పుడు రాడు. ఈ సొరచేప ప్రియుడు కూడా రాలేదు. కాని దుః ఖానికికూడా అంతం వుండాలి కదా! అలాగే యీ కష్టానికీ అంతం వుంది. హఠాత్తుగా ఓడను నూరుగజాల దూరంలో తోలుతిత్తిని పోలిన పెద్దదైన చేప నీటిమీద తేలి కనిపించింది. వెంటనే పెద్ద గోల చెలరేగింది. "అదిగో సొరచేప! హుష్! పిల్లల్లారా! నిశ్శబ్దం! మీరు అల్లరి చేస్తే సొరచేప పారిపోతుంది." "ఓ సోదరులారా, మీ తెల్లటోపీలను కొంచెంసేపు తీసేయండి. లేకపోతే సొరచేప సిగ్గుపడుతుంది!" ఈ రకమైన కేకలు చెవుల్లో పడుతూండగా ఉప్పుసముద్రంలో నివసించే సొరచేప ఆ పందిమాంసాన్ని సమీపించింది.

సొరచేప నోటికి ఎరకు మధ్య ఏడెనిమిది అడుగులు మాత్రమే దూరం వుంది. ఇంతలో దాని పెద్ద తోకను కాస్త తిప్పింది. అందుచేత దాని తిన్నని కదలిక కాస్త వంకర తిరిగింది. "అయ్యో! సొరచేప పారిపోతోంది" అంటూ డెక్‌మీదివారు అరిచారు. మళ్లీ దాని తోక కాస్త కదిలింది. దాని పెద్ద శరీరం గాలాన్ని సమీపించింది. మళ్ళీ అది ఆవలిస్తూ ముందుకు తోసుకువస్తోంది. ఎరను కబళించబోతోంది. మళ్ళీ దాని దేహం కదలింది. సొరచేప తన శరీరాన్ని వంచుకొంది. సొరచేప వలయంగా తిరిగి ముందుకు వస్తోంది, ఆవలిస్తోంది, ఎరను నోట్లోకి వేసుకుంది, నిజంగానే ఎరను మింగింది. "లాగండి, నలభై ఏభైమంది కలిసి లాగండి. మీ పూర్తిబలంతో లాగండి. అబ్బ! ఈ చేపకు ఎంత బలం వుంది! ఎంతగా పోరాడుతోంది. ఎంతగా ఆవలిస్తోంది. లాగండి, లాగండి" అంటూ మహాశయు లరిచారు. అది నీళ్లమీదకు వచ్చింది. మళ్లీ లోనికి పోతోంది. పక్కకు తిరుగుతోంది.

"లాగండి! లాగండి! ఆ ఎరను వదలించుకొని పారిపోయింది. సొరచేప పారిపోయింది. ఆ ఎరను కొంచెం మింగేదాకా మీరెందుకు ఓపికపట్టలేకపోయారు? నిజంగా మీరంతా ఎంత హడావిడి జనాలు! కొంచెం కదలగానే ఆ చేపను అంత తొందరగా లాగటానికి ప్రయత్నించారు గదా! చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకొంటే ఏం ప్రయోజనం?" అని వారంటున్నారు. సొరచేప గాలాన్ని వదలించుకొని పారిపోయింది. అది తన పైలట్ చేపలకు ఏం శిక్ష విధించిందో మనకు తెలియదు. జరిగింది మాత్రం యిది. సొరచేప తప్పించుకొనిపోయింది. సొరచేప, ఒంటిమీద నల్లని చారలున్న పెద్దపులిలా వుంది. ఏమైనా, పెద్ద పులిని పోలిన యీ చేప గాలం చాల అపాయకరమైందని గ్రహించి తన పరివారంలోని పైలట్ చేపలతోను, జలగ చేపలతోను మాయమైంది.

అయినప్పటికీ మేం నిరాశపడవలసిన పనిలేదు. ఎందుకంటె యీ 'పెద్దపులి' సొరచేప ఇలా పోతుంటే దాని పక్కనుండే పెద్ద వెడల్పైన తలతో మరో సొరచేప యిటుగా వస్తోంది. సొరచేపలకు భాషలేదు కాబోలు. ఉంటే ఆ వచ్చే చేపకు ఈ పెద్దపులిచారల సొరచేప ఈ

రహస్యాన్ని చెప్పి హెచ్చరించకుండా వుండేదా? తప్పకుండా హెచ్చరించేది. "ఓ మిత్రమా! జాగ్రత్త! అక్కడ ఒక కొత్త జంతువుంది. దాని మాంసం మాత్రం చాలా రుచిగా వుంది. కాని దాని బొమిక ఎంత గట్టిగా వుందో! నేను పుట్టి పెరిగి యిన్నాళ్లయింది. బతికినవాటిని, చచ్చినవాటిని, సగం చచ్చినవాటిని గుట్టలకొద్దీ యిన్ని జంతువులను తిన్నాను. నాపొట్టనిండా పుట్టలకొద్దీ రాళ్లు, పెంకులు, కొయ్యలు నిండివున్నాయి. కాని యీ కొత్త జంతువు బొమికలతో పోలిస్తే అవన్నీ వెన్నపూస వంటివని చెప్పొచ్చు. దాని బొమికలు గుచ్చుకొని పళ్లు, దవడలు ఏమైపోయాయో!" అని అది చెప్పివుంటుంది. ఈ మాటలు చెప్పి ఆ వచ్చే జంతువుకు ఆవులించి తన దవడలను చూపించి వుంటుంది. ఆ రెండవదికూడా దాని వయోలక్షణమైన అనుభవంతో ఈ చేపకు ఏదో ఒకానొక తరహా చేప పైత్యరసమో, మరోచేప మాంసమో, ఆల్చిప్పల చల్లటి చారో ఏదో ఒకటి తిని దాని నోట్లోని పుళ్లను మాన్పుకోమని ఉచిత సలహాయిచ్చి వుంటుంది. కాని అలాంటిదేదీ జరగలేదు. కాబట్టి ఈ సొరచేపలకు ఒక ప్రత్యేకమైన భాష వుండదని, ఒకవేళ ఉన్నా అది నీళ్ల లోపల మాట్లాడటానికి వీలై వుండదని మనం నిశ్చయించుకోవచ్చును. అందువల్ల సొరచేపలు మాట్లాడ్డానికి వీలైన అక్షరసముదాయం కనిపెట్టేదాకా, అవి ఆ భాషను ఉపయోగించేవరకు అవలీలగా వాటిని పట్టుకోవచ్చును. పెద్దపులి చారల సొరచేప మనుషులతో బాగా కలిసి మానవ లక్షణాన్ని కొంత అలవరచుకొంది. కాబట్టి ఆ వచ్చే వెడల్పుతల సొరచేపకు వున్న నిజాన్ని చెప్పక ఒక చిరునవ్వు నవ్వి "ఏమోయ్, బాగున్నావా?" అని పలుకరించి 'నాకు జరిగిన పరాభవం దీనికి మాత్రం జరగకుండా ఎందుకుండాలి?' అని అనుకొని ముందుకు పోయివుంటుంది.

ఒక వంగకావ్యంలో యిలా వుంది; "భగీరథుడు శంఖం పూరిస్తూ ముందకు నడుస్తూంటే వెనుక గంగానది అతణ్ణి అనుసరిస్తోంది." ఇప్పుడు అలాగే యీ శంఖధ్వని వినిపించింది. అంటే ముందు పైలట్ చేపలు వస్తున్నాయి. వీటి వెనుక ఈ 'చదునుతల చేప' తన పర్వత సదృశ శరీరంతో వస్తోంది. చుట్టూ జలగ చేప లెగురుతున్నాయి. ఆహా! ఎవరు అంత ఆకర్షణీయమైన ఎరను చూసి అణచుకోగలరు. మధ్యనున్న ఈ మాంసం ముక్కవల్ల ఐదారుగజాల మేరలో ఆ సముద్రపు నీరంతా జిడ్డు తేరింది. మరి ఆ మాంసంముక్క సువాసన

ఎంత దూరానికి వ్యాపించిందో ఈ 'చదును–తల' వాడికే తెలియాలి. ఆ మాంసంముక్క చూడ్డానికి ఎంత రమ్యంగా వుంది! ఎర్రగా, తెల్లగా, పచ్చగా చిత్రవర్ణంగా వుంది. అది అచ్చమైన ఇంగ్లీషు పంది మాంసం. దాన్ని గాలానికి కట్టి నీళ్లలోకి వదిలారు. అది ఎంతో ఆకర్షణీయంగా నీళ్లలో తేలుతోంది.

"ఎవ్వరూ మాట్లాడవద్దు, కదలద్దు, తొందరపడవద్దు. తాడుపట్టుకొని లాగటానికి సిద్ధంగామాత్రం వుండండి. అదిగో! ఆ సొరచేప గాలం దగ్గరకు వచ్చింది. ఎరను పరీక్షిస్తోంది. నోట్లో పెట్టుకొంటోంది. పెట్టుకోనివ్వండి. మాట్లాడొద్దు. ఇప్పుడది కాస్త పక్కకు తిరిగింది. మొత్తమంతా మింగుతోంది. బాగా మింగనివ్వండి" అన్నారు కొందరు. ఇప్పుడు యీ చదునుతల సొరచేప వత్తిగిలి, తీరుబడిగా ఆ ఎరను కబళించి తిరిగి వెళ్ళిపోదామని కాస్త కదలగానే లాగబడింది. అది ఆశ్చర్యంతో తలను కొంచెం విదిలించి, లోపలున్న గాలాన్ని బైటికి కక్కాలనుకొంది. లాభం లేకపోగా గాలం గొంతులో మరింత లోతుగా గుచ్చుకొంది. పైనుండి పెద్దలు, చిన్నలు అందరూ కలిసి తాడును బలంగా లాగసాగారు. "చూడండి! చూడండి! సొరచేప తల నీళ్లమీదకొచ్చింది. లాగండి! సోదరులారా లాగండి! అప్పుడే సగం శరీరం నీళ్లపైకి వచ్చింది. అబ్బ! ఏం దవడలు. లాగండి! లాగండి! హమ్మయ్య ఇప్పటికి మొత్తమంతా పైకివచ్చింది. ఇప్పుడు గాలం దాని దవడలగుండా సొంతం గుచ్చుకొనిపోయింది. లాగండి. ఆగండి. ఓ అరబ్బు పోలీసూ! దాని తోకకు తాడుకట్టి యిలా విసురు. ఇది పెద్ద దయ్యంలా వుంది. ఏమోయ్ జాగ్రత్త సుమా! అది తోకతో కొడితే చాలు గుర్రపు కాలైనా విరిగిపోతుంది! లాగండి! లాగండి.అబ్బ! ఎంత బరువుంది! ఓయి భగవంతుడా! సొరచేప పొట్టమీద ఏం వేలాడుతోంది! అవి పేగులు కావా! అంత బరువు శరీరంవల్ల ఆ పేగులు బైటకు వచ్చేశాయి. సరే! వాటిని కోసి సముద్రంలో పారెయ్యండి. బరువెంతో తగ్గుతుంది. అబ్బ! ఏం రక్త ప్రవాహం! బట్టలమీద పడకుండా జాగ్రత్తపడ్డా ప్రయోజనం ఏమీలేదు. అదిగో మనం దాన్నందుకోవచ్చును. ఇప్పుడు డెక్‌మీద పెట్టండి. చాలా జాగ్రత్త. అది కానీ మీదపడితే మీ చేతిని ఆసాంతం మింగేయగలదు! తోకవద్దకు పోవద్దు! జాగ్రత్త! ఇప్పుడు తాడు వదలండి! అబ్బ! పక్కన పడింది!

ఎంత పెద్ద సొరచేప! కింద పడ్డప్పుడు ఎంత చప్పుడైంది! సరే ఎంతసేపని తప్పుకొని తిరుగుతాం. అదిగో ఆ మొద్దుతో దాని నెత్తిమీద బాదండి. ఓ మిలటరీ మనిషీ! నువ్వే ఆ పని చెయ్యటానికి తగినవాడివి" అని వారరిచారు. ఓడమీద వున్న స్త్రీలందరూ "ఎంత క్రూరం! ఘోరం! చంపవద్దు! చంపవద్దు!" అని గోలచేస్తున్నారు. కాని వారా దృశ్యాన్ని చూడకుండా మారుకొన్నారా? ఇంతటితో యీ ఘోర దృశ్యం అంతమవనీ! ఆ సొరచేప పొట్ట కోసారు. దాని పొట్టలోనుండి రక్తం ప్రవహించింది. అక్కడున్నవారు గుండెను వేరువేరుగా కోసి దాని పేగులు తీసేశారు. ఐనా దాని శరీరం యింకా కదులుతూనేవుంది. దాని పొట్టలో బొమికలు, చర్మం, మాంసం, కొయ్యలు పోగుపడి వున్నాయి. వాటి నన్నింటిని పైకితీసారు. సరే, ఇక ఈ విషయాలు పోనివ్వండి. ఒక్క సంగతి – ఆ రోజు నా ఆహారం ఇంచుమించుగా పాడైపోయింది. అంతా ఆ సొరచేప కంపే!

కాలువ తవ్వకాల్లో సూయజ్‌కాలువ తవ్వకం ఆశ్చర్యకరమైంది. 'ఫెర్డినాండ్ డి లెస్సెప్స్' అనే ఒక ఫ్రెంచ్ ఇంజనీరు యీ కాలువను తవ్వించాడు. ఈ కాలువ మధ్యధరా సముద్రాన్ని, ఎర్రసముద్రాన్ని కలుపుతూ, భారతదేశానికి ఐరోపాకు మధ్య వాణిజ్య సంబంధాలను అభివృద్ధి చేసింది.

అతిప్రాచీన కాలంనుండి ప్రస్తుత మానవ నాగరికతకు దోహదాలైన సమస్త అంశాలలో భారతీయ వాణిజ్యమే ఎంతో ముఖ్యమైంది. బహు పురాతన కాలంనుండి భారతదేశం భూసారంలోను. వాణిజ్య పరిశ్రమల్లోను తక్కిన అన్ని దేశాల కంటె ఎంతో ఉచ్చదశలో వుంది. ఒక శతాబ్దం క్రితంవరకు ప్రపంచానికంతకీ కావలసిన వస్త్రాలు, ప్రత్తి, జనపనార, నీలిమందు, లక్క, బియ్యం, రత్నాలు, ముత్యాలు అన్నీ భారతదేశంనుండే సరఫరా అయ్యేవి. ఇంతే కాదు, ప్రపంచంలో ఏ యితర దేశంలోకూడా భారతదేశంలో మాదిరి 'కిన్‌కాబు' లాంటి పట్టు, ఉన్నివస్త్రాలు లభించేవి కావు. లవంగాలు, ఏలకులు, మిరియాలు, ఇతర సుగంధద్రవ్యాలు భారతదేశంనుండి లభించేవి. అందుచేత అతిప్రాచీన కాలంనుండి ఎప్పుడెప్పుడు ఏఏ దేశం

నాగరికమౌతూ వస్తోందో అప్పుడప్పుడల్లా ఆయా నాగరిక పదార్థాలకు, వస్తుసామగ్రికి అది భారతదేశం మీదే ఆధారపడుతూ వచ్చింది. ఈ వాణిజ్యమంతా ముఖ్యంగా రెండు మార్గాల ద్వారా జరిగేది. ఒకటి భూమార్గం. ఆఫ్ఘనిస్థాన్, పర్షియాల మీదుగా యీ మార్గం పోతుంది. రెండోది సముద్రమార్గం. ఎర్రసముద్రంగుండా అలెగ్జాండర్ పర్షియాను జయించిన తరువాత భారతదేశానికి ఒక సముద్రమార్గం కనిపెట్టటానికి 'నియార్కస్' అనే సేనాధిపతిని నియమించాడు. ఆ సముద్రమార్గం సింధునదీ ముఖద్వారంనుండి మహాసముద్రం మీదుగా, ఎర్రసముద్రంగుండా ఏర్పాటు చెయ్యబడింది. బాబిలోనియా, పర్షియా, గ్రీసు, రోమ్ దేశాల సౌభాగ్యం ప్రాచీనకాలంలో భారతదేశంతోటి వాణిజ్యంపై చాలభాగం ఆధారపడి వుండేదని చాలామంది జనులకు తెలియదు. రోమన్ సామ్రాజ్యం పతనం చెందాక మహమ్మదీయ దేశాల్లో బాగ్దాద్, ఇటలీలో వెనీసు, జనీవా నగరాలు భారతదేశపు సరుకులకు పాశ్చాత్యదేశాల్లో వాణిజ్య కేంద్రాలైనాయి. తరువాత రోమన్ సామ్రాజ్యాన్ని తురకలు జయించినప్పుడు వారు ఇటలీవారికి భారతదేశానికి వెళ్ళే వాణిజ్య మార్గాన్ని మూసేశారు. అప్పుడు స్పెయిన్ దేశస్థుడైన క్రిస్టోఫర్ కొలంబస్ భారత దేశానికి అట్లాంటిక్ మహాసముద్రంగుండా ఒక కొత్తమార్గాన్ని కనిపెట్టటానికి ప్రయత్నించాడు. ఆ ప్రయత్నంలో అతడు అమెరికా ఖండాన్ని కనుగొన్నాడు. అమెరికా చేరాకకూడా అదే భారతదేశమనే భ్రాంతి అతణ్ణి వదల్లేదు. ఆ కారణం వల్ల అమెరికాలోని ఆదిమవాసులు 'ఇండియన్స్' అని యీనాటికీ పిలువబడుతున్నారు. వేదాల్లో సింధునదికి 'సింధు', 'ఇందు' అనే రెండు పేర్లు కానవస్తున్నాయి. పారశీకులు 'సింధుకు' బదులు 'హిందు' అని వాడారు. గ్రీకులు 'ఇండస్' అని వాడారు. కాబట్టే ఇండియా, ఇండియన్ అనే పేర్లు పుట్టాయి. మహమ్మదీయుల విజృంభణతో 'హిందు' అనే పదానికి అపార్థమేర్పడి నల్లనివాడనే అర్థంలో ప్రయోగించబడింది. ప్రస్తుతం 'నేటివ్' అనే పదం అలాగే ఉపయోగించబడుతోంది కదా.

ఈలోగా పోర్చుగీసులు ఆఫ్రికాను చుట్టి భారతదేశానికి కొక కొత్త మార్గాన్ని కనుగొన్నారు. వీరికి భారతదేశం ఎంతో లాభించింది. తరువాత ఫ్రెంచ్‌వారు, డచ్చివారు,

డెన్మార్కువారు, ఆంగ్లేయులు వచ్చారు. భారతీయ వాణిజ్యం, భూమిశిస్తులు, ఇతర శిస్తులు ప్రస్తుతం ఇంగ్లీషువారి అధీనంలో వున్నాయి. అందుచేత వారు తక్కిన అన్ని దేశాల్లో అగ్రస్థానం వహించారు. కాని ఇప్పుడు అమెరికా మొదలైన దేశాల్లో భారతదేశంలోకంటే భారతదేశపు పంటలు బాగా పండించబడుతున్నాయి. అందుచేత ప్రస్తుతం భారతదేశానికి ప్రతిష్ఠ తగ్గింది. భారతదేశం తమ నాగరికతకు కారణం అనే మాటను ఐరోపీయులు ఇష్టపడరు. తమ నాగరికతకు, సంపదకు ఈ స్వజాతీయుల దేశం ముఖ్య కారణమని వారంగీకరించరు. అయినా ఇది నిజమే! ఇది వారు అర్థంచేసుకోనైనాలేరు. వారికీ విషయం అర్థం అయేంతదాకా మనం ప్రయత్నించాలి.

కాస్త యోచించి చూడండి. మన దేశంలోని ఈ నిమ్నజాతుల వారు విదేశీయులచే జయించబడి, స్వదేశీయులచే నీచంగా చూడబడ్డారు. కర్షకులు, సాలెవాళ్లు యింకా అనేక రకాల వృత్తుల నాశ్రయించినవారు, అతిప్రాచీన కాలంనుండి నిశ్శబ్దంగా పనిచేస్తూండేవారు. వారు తమ కష్టానికి తగిన ప్రతిఫలంకూడా పొందకుండా అణగి పడివున్నారు. దీన్ని గురించి కాస్త ఆలోచించి చూడండి. ప్రపంచమంతటా నెమ్మదిగా ఎంత మార్పు జరుగుతోంది! అది ప్రకృతి సహజమైన నియమం. దేశాలు, నాగరికత, అధికారాలు విప్లవాల పాలవుతున్నాయి. ఓ భారతదేశస్థులైన శ్రమజీవులారా! మీ ప్రశాంతమైన, నిరంతర పరిశ్రమతో, బాబిలోనియా, పర్షియా, అలెగ్జాండ్రియా, గ్రీస్, రోమ్, వెనీస్, జనీవా, సమర్ఖండ్, బాగ్దాద్, స్పెయిన్, పోర్చుగల్, డెన్‌మార్క్, హాలండ్, ఇంగ్లాండ్ దేశాలు క్రమంగా ఆధిక్యాన్ని, సామర్థ్యాన్ని పొందగలిగాయి. పాపం మీరో? మిమ్మల్ని గురించి ఎవడాలోచిస్తాడు? ఓ ప్రియమైన స్వామీ! మీ పూర్వులు కొన్ని వేదాంత గ్రంథాలను, పురాణాలను రచించారు; కొన్ని దేవాలయాలు నిర్మించారు. ఇందుకై మీరు ఆకాశం ప్రతిధ్వనించేటట్లు పెడబొబ్బలు పెడతారు. పాపం! ప్రపంచంలోని సర్వాభివృద్ధికి ఎవరు రక్తమోడ్చి శ్రమపడ్డారో ఆ జనాన్ని గురించి ఎవడు శ్రద్ధ వహిస్తాడు? వారిని గురించి ఒక్క మంచి మాటైనా పలికినవాడున్నాడా? వేదాంతంలోనో, కవిత్వంలోనో, పరాక్రమంలోనో ప్రపంచాన్నంతా జయించిన కొందరు వీరులను గురించి ఎందరెందరికో తెలుసు. వారికి సమస్త

మానవజాతి నీరాజనం పడుతుంది. కాని ఎవ్వరూ తొంగిచూడలేని గొప్పతనాన్ని గురించి ఎవ్వడూ ఒక్క ఉత్సాహకరమైన మాటా పలుకడు. అంతా ద్వేషించేవారే! అంత ద్వేషపూరితమైన వాతావరణంలో దారిద్ర్యజీవనం గడుపుతూ, అనంతమైన ఓర్పుతో, ప్రేమతో, అవ్యాఘాతమైన ఆచరణతో, మన దేశంలోని జనసామాన్యం తమ ఇళ్లలో రేయింబవళ్లు నోరెత్తక తమతమ ధర్మాలను నిర్వర్తిస్తున్నారు. సరే! దీనిలో ధీరత్వం లేదా? చాలా మంది ఏదో ఒక పెద్ద కార్యాన్ని నిర్వర్తించి మహావీరులై కూర్చుంటారు. మెచ్చుకోటానికి గుంపులు గుంపులుగా జనం వున్నప్పుడు ఒక్కొక్కప్పుడు ఎంత పిరికివాడైనా ప్రాణత్యాగానికి సిద్ధపడతాడు, ఎంత స్వార్థపరుడైనా త్యాగం చేస్తాడు. కాని అదే నిస్వార్థం, అదే ధర్మనిర్వహణలోని శ్రద్ధ, అతి స్వల్ప విషయాల్లో, ఎవరి దృష్టిలోను పడకుండా చూపించేవాడే ఎంతో గొప్పవాడు. ఓ అణగదొక్కబడ్డ భారతీయ శ్రామికుల్లారా! ఆ గొప్పతనం మీలో వుంది, తలవంచి మీకు నమస్కరిస్తున్నాను.

ఈ సూయజ్ కాలువకూడా అతిప్రాచీనమైంది. ఈజిప్టును ఫారోలు పరిపాలించినప్పుడు అసంఖ్యాకమైన చిన్నచిన్న సముద్రపు నీటి గుంటలను ఒకదానితో ఒకటి వరుసగా కలిపి వారు యీ సముద్రంనుండి ఆ సముద్రందాకా ఒక పెద్ద కాలువగా ఏర్పాటుచేశారు. ఈజిప్టును రోమన్లు పరిపాలించినప్పుడు యీ కాలువను తెరిచి వుంచటానికి ప్రయత్నాలు జరిగాయి. తరువాత 'అమ్ర' అనే మహమ్మదీయ సేనాపతి ఈజిప్టును జయించి యీ కాలువలో ఇసుక మేటను తీయించి కాలువనంతా చక్కగా బాగుచేయించి దాని స్వరూపాన్నే మార్చేశాడు.

తరువాత దాన్ని గురించి ఎవరూ శ్రద్ధ వహించలేదు. ఇప్పుడున్న యీ కాలువ, ఈజిప్టుకు చెందిన ఖేదీవ్ ఇస్మాయిల్ అనే వ్యక్తి తవ్వించాడు. ఇతడు టర్కీ సుల్తాన్ రాజప్రతినిధి. ఇతడికి ఫ్రెంచివారు పెట్టుబడి, సలహాలు ఇచ్చారు. ఈ కాలువలో పెద్ద చిక్కొకటి వుంది. ఇది ఎడారిగుండా ప్రవహిస్తోంది. అందువల్ల మాటిమాటికి ఇసుకతో మేటవేసుకొని పోతుంటుంది. పెద్ద వాణిజ్యనౌక ఒక్కటి తప్ప, ఒకేసారి ఈ కాలువగుండా ఓడలు ప్రయాణం చెయ్యలేవు. బాగా పెద్దవైన యుద్ధనౌకలుగాని, వాణిజ్యనౌకలుగాని యీ కాలువగుండా ప్రయాణించలేవు. లోపలికి

వచ్చే ఓడలు, బైటకిపోయే ఓడలు ఒకదాన్నొకటి ఢీకొనకుండా ఈ కాలువను కొన్ని విభాగాలుగా చేసి, ఒక్కో విభాగానికి రెండు పక్కల లంగరు దించటానికి వీలైనంత విశాలమైన చెరువులు అప్పటివారు తవ్వించారు. మధ్యధరాసముద్రముఖంలో ఈ కాలువ ప్రధాన కార్యాలయం వుంది. కాలువలోని ప్రతి విభాగానికి రైలుస్టేషన్ల మాదిరి కొన్ని స్టేషన్లు వున్నాయి. ఒక ఓడ, కాలువలో ప్రవేశించగానే ప్రధాన కార్యాలయానికి ఎడతెగకుండా తంతివార్తలు పంపబడతాయి. ఆ ప్రధాన కార్యాలయంలో ఎన్ని ఓడలు లోపలికి వస్తున్నాయో, ఎన్ని ఓడలు బైటికి పోతున్నాయో, ఏ క్షణంలో ఏ ఓడ ఎక్కడుందో యీ పూర్తి సమాచారం తంతివార్తలద్వారా తెలుసుకోబడి ఒక పెద్ద పటంమీద గుర్తించబడి వుంటుంది. ఒక ఓడ మరో ఓడను ఢీకొనకుండా నివారించే మార్గం నిరాటంకంగా వుందనే సమాచారం తెలియకుండా, ఏ ఓడకూడా అది వున్న స్టేషన్నుండి కదలటానికి అనుమతించబడదు.

సూయజ్ కాలువపై ప్రస్తుతం ఫ్రెంచ్‌వారి అజమాయిషీ వుంది. కాలువ కంపెనీలో ఎక్కువ వాటాలు ఆంగ్లేయులవే అయినా ఒకానొక రాజకీయ ఒప్పందం ప్రకారం ఫ్రెంచ్‌వారే కాలువమీద అజమాయిషీ వహిస్తున్నారు.

ఇప్పుడు మధ్యధరాసముద్రం వచ్చింది. హిందూదేశం దాటాక ఇంతకంటే మరువలేని ప్రాంతం మరొకటి ఉండదు. ఈ సముద్రం ఆసియా, ఆఫ్రికాలకు, ప్రాచీన నాగరికతలకు చివరి హద్దు. ఇంతటితో ఒక రకమైన ఆచార వ్యవహారాలు, జీవన పద్ధతులు అంతమై, మరోవిధమైన వైఖరులు, స్వభావాలు, ఆహారపద్ధతులు, వేషధారణలు, ఆచారాలు, అలవాట్లు మొదలౌతాయి. మనం ఇక్కణ్ణుండి ఐరోపాలో ప్రవేశిస్తాం. ఇంతేకాదు, శరీరఛాయలు, జాతులు, నాగరికతలు, సంస్కృతులు, ఆచారాలు అనేక శతాబ్దాలనుండి పరస్పరం యిక్కడే మేళవించబడ్డాయి. వీటినుండి ఒక నూతన నాగరికత జన్మించింది. ఈ మధ్యధరాసముద్రాన్ని చుట్టివున్న ప్రాంతాల్లోనే నేడావరించివున్న మతం, నాగరికత, సంస్కృతి, పరాక్రమం పుట్టాయి. ఈ మధ్యధరా సముద్రానికి దక్షిణం వైపు శిల్పానికి, సంపదకు, పాడిపంటలకు జన్మస్థానమైన,

ప్రాచీనమైన ఈజిప్టు వుంది; తుర్పువైపు ఫొనీషియన్ల, ఫిలిస్టయిన్ల, యూదుల, బాబిలోనియన్ల, అస్సీరియన్ల, పర్షియన్ల నాగరికతలు విలసిల్లిన ఆసియా మైనర్ వుంది; ఉత్తరంలో ప్రపంచంలో ఆశ్చర్యకరమైన నాగరికత వర్ధిల్లిన గ్రీసు వుంది.

అనేక దేశాలను, నదులను, కొండలను, సముద్రాలను పరికించాం. ఇప్పుడు కాస్త ప్రాచీన చరిత్రను గురించి చెబుతాను. ఈ ప్రాచీనకాలాన్ని గురించిన కథలు ఎంతో ఆశ్చర్యకరమైనవి. ఇవి కట్టుకథలు కావు. యథార్థంగా జరిగినవి; నిజమైన మానవజాతి చరిత్ర. శాశ్వతంగా యీ ప్రాచీన దేశాలన్నీ మరుగుపడిపోయాయి. ఏ కొంచమైనా ఈ దేశాలను గురించి తెలిసివుంటే ఆ కొంచెంకూడా ప్రాచీన గ్రీకు చరిత్రకారులు వ్రాసిన కట్టుకథల్లోనుండి లేక యూదుల పురాణమైన బైబిల్ అద్భుత వర్ణనలనుండి గ్రహించబడిందే! ఇప్పుడు ప్రాచీన శిలాశాసనాలు, కట్టడాలు, గదులు, పెంకులు మొదలైన వాటిమీద చెక్కిన వ్రాతలు. భాషా విషయక పరిశోధనలు – యివి ఆయా దేశాలను గురించిన ప్రాచీన చరిత్రను విశదపరుస్తున్నాయి. ఈ రకమైన పరిశోధన యిప్పుడిప్పుడే మొదలైంది. ఐనా దీనివల్ల ఎంతో ఆశ్చర్యకరమైన చరిత్రలు వెలుగులోకి వచ్చాయి. ఇక ముందు ముందు ఏవి బైటపడతాయో ఎవరు చెప్పగలరు? ఒక చిన్న శిలమీదో, శిథిలమైన పాత్రమీదో, కట్టడంమీదో, పెంకుమీదో, లిఖించబడ్డ వ్రాతలను గురించి దేశదేశాల్లోని పండితులు తమ తలలు బద్దలుకొట్టుకొంటూ, కాలగర్భంలో కలిసిపోయిన ప్రాచీన చరిత్రలను బైటికి తవ్వుతున్నారు.

కాన్‌స్టాంట్‌నోపుల్ పట్టణాన్ని మహమ్మదీయ నాయకుడైన ఉస్మాన్ ఆక్రమించుకొన్నాక తూర్పు ఐరోపా అంతా మహమ్మదీయుల ఆధిపత్యం కిందికొచ్చినప్పుడు ప్రాచీన గ్రీకు గ్రంథాలు, విద్యా సంస్కృతులు చాలాకాలం వారి శక్తిహీనులైన వారసుల చేతుల్లో మరుగున వుండిపోయి క్రమంగా పశ్చిమ ఐరోపా దేశాల్లో వ్యాపించాయి. గ్రీకు చాలకాలం రోమన్ల ఆధిపత్యం కింద వున్నప్పటికీ, విద్యాసంస్కృతుల్లో గ్రీకులు రోమన్లకు ఉపాధ్యాయులు. గ్రీకులు క్రైస్తవమతంలో చేరటంతో, క్రైస్తవుల బైబిల్ గ్రీకు భాషలోకి రచించబడటంతో రోమన్ సామ్రాజ్యమంతా క్రైస్తవ

మతం వ్యాపించింది, కాని మనం యవనులని పిలిచే, ఐరోపా నాగరికతకు ప్రథమ దేశీయులైన ప్రాచీన గ్రీకులు క్రైస్తవులకంటే ఎంతో పూర్వమే సంస్కృతిలో అత్యున్నతిని సాధించారు. వారు క్రైస్తవులుగా మారిన తరువాత వారి విద్యాసంస్కృతులు వినష్టమైనాయి. కాని తమ ప్రాచీన సంస్కృతి ఏ కాస్తో హైందవుల యిళ్లలో మాదిరి వున్నట్లే యీనాటి క్రైస్తవగ్రీకుల్లోకూడా వారి సంస్కృతి మిగిలివుంది. ఈ గ్రంథాలు ఐరోపా అంతా వ్యాపించాయి. ఆంగ్లేయుల, జర్మన్ల, ఫ్రెంచ్ మొదలైన యూరోపియన్ల నాగరికతా వ్యాప్తికి ఇవి తోడ్పడ్డాయి. గ్రీకుభాష, కళలు నేర్వటానికి యూరోపియన్లు ఎంతో వ్యామోహపడ్డారు. లభించిన గ్రంథాల్లో వున్నదంతా వారు ఆసక్తితో గ్రహించారు. వారి తెలివితేటలు వికసించేకొద్దీ, వారి వైజ్ఞానికజ్ఞానం అభివృద్ధి చెందేకొద్దీ ఆ గ్రంథాల రచనాకాలం, గ్రంథ కర్త, విషయం, ప్రామాణికత మొదలైనవి పరిశోధించబడసాగాయి. క్రైస్తవుల పవిత్ర గ్రంథాలమీద తప్ప ఇతర గ్రీకు గ్రంథాలమీద యథేచ్ఛగా తమ అభిప్రాయాలను వెలిబుచ్చటానికి అడ్డంకులు లేవు. ఫలితంగా ఒక కొత్త వైజ్ఞానిక శాస్త్రం – అంతర్విమర్శ, బహిర్విమర్శ అనేది – ఉద్భవించింది.

ఉదాహరణకు ఫలానా రోజున ఫలానా సంఘటన జరిగిందని ఒక గ్రంథంలో వ్రాయబడినదనుకోండి. ఎవడో ఒకడు అది జరిగిందని వ్రాసినంత మాత్రాన అది నిజంగా జరిగిందని నమ్మేయటమేనా? ఆనాటి ప్రజల్లో ఊహాగానాన్ననుసరించి ఏదో జరిగినట్లు వ్రాయటం అలవాటుగా వుండేది. అంతేకాక వారికి ప్రకృతిని గురించి మనం వసిస్తోన్న భూమిని గురించి పరిజ్ఞానం ఏమీ లేదు. ఇలాంటి విషయాలన్నీ ఆయా గ్రంథాల్లోని విషయాల యథార్థాల గురించి సందేహాలు పుట్టటానికి కారణాలైనాయి. ఉదాహరణకు ఒక గ్రీకు చరిత్రకారుడు ఫలానాకాలంలో చంద్రగుప్తుడు భారతదేశాన్ని పరిపాలించాడని వ్రాశాడనుకోండి. భారతదేశంలోని గ్రంథాలుకూడా ఆ కాలంలో ఆ రాజు వున్నట్లు వ్రాస్తే ఆ విషయం చాలవరకు నిర్ధారితమైనట్లే. చంద్రగుప్తుని పరిపాలన సూచించే నాణేలు దొరికినా లేక అతడి పరిపాలన సూచించే ఆనాటి ఒక కట్టడం బయల్పడ్డా, అప్పుడు ఆ గ్రీకు చరిత్రకారుడు వ్రాసింది నిజమేనని గ్రహిస్తాం.

మరో గ్రంథకర్త అలెగ్జాండర్ పరిపాలనలో ఫలానా సంఘటన జరిగిందని వ్రాశాడనుకోండి. అందులో ఏ ఒకరో యిద్దరో రోమన్ చక్రవర్తులను గురించికూడా ప్రక్షిప్తాలని చెప్పటానికి వీలులేని పద్ధతిలో కొన్ని విషయాలు చెప్పబడినవనుకోండి. అప్పుడు ఆ గ్రంథం అలెగ్జాండర్ సమకాలంలో వ్రాసింది కాదని చెప్పవచ్చును.

ఇక భాషా విషయాన్ని పరిశీలిద్దాం. కాలాంతరంలో ప్రతి భాషా కొంత మార్పు చెందుతుంది. రచయితశైలి కూడా మార్పుకు లోనవుతూనే వుంటుంది. ఒక గ్రంథంలో హఠాత్తుగా విషయానికి సంబంధించని ఒక వర్ణన తటస్థపడిందనుకోండి. అంతేగాక రచయిత శైలికి, అప్పటి శైలికి, సంబంధం లేదనుకోండి. అప్పుడా వర్ణన ప్రక్షిప్తమని చెప్పవచ్చును. ఈ రీతిగా అనుమానంచేత, పరీక్షచేత అనేక విధాలుగా ఒక పుస్తకం యొక్క సత్యాసత్యాలను నిరూపించే పద్ధతులతో ఒక కొత్త శాస్త్రమే అభివృద్ధి చెందింది.

దీనికితోడు అధునాతన వైజ్ఞానికశాస్త్రం శీఘ్రంగా అభివృద్ధి చెందుతోంది. ఈ శాస్త్ర వ్యాసంగం అనేక విషయాలమీద బహుముఖాల వెలుగుల్ని ప్రసరింపచేస్తోంది. దీని ఫలితంగా ఏ గ్రంథంలోనైనా అస్వాభావికాలైన సంఘటనలు వర్ణింపబడ్డప్పుడు వాటిలో ఏమాత్రం సత్యంలేదని నిరాకరింపబడుతున్నాయి.

వీటన్నింటికి తోడుగా మకుటప్రాయంగా సంస్కృతభాష ఐరోపాలోకి వచ్చిపడింది. భారతదేశంలోను, యూఫ్రెట్స్ నదీతీరంలోను, ఈజిప్టులోను లభిస్తున్న పురాతన శిలాశాసనాలను చదవటం, ఎంతోకాలం భూమికిందో, పర్వతపంక్తుల్లోనో మరుగుపడ్డ దేవాలయాలను కనుగొనటం, వాటి చరిత్రను నిర్దుష్టంగా తెలుసుకోవటం మొదలైన అంశాలు అభివృద్ధి గాంచాయి.

ఈ నూతన పరిశోధనాశాస్త్రం బైబిల్‌ను, అందులోని న్యూటెస్టమెంట్‌ను ఈ విమర్శలకు గురిచెయ్యలేదు. పూర్వం వున్నట్లు యిప్పుడు తీవ్రమైన మతాభియోగాల వల్ల భయంలేదు. కాని

సంఘదూషణానికి పాల్పడవచ్చని భయముంది. దీన్నికూడా లెక్కచెయ్యక అనేకమంది పండితులు ఈ గ్రంథాలనుకూడా తమ శాస్త్రీయ పరిశోధనకు గురిచేశారు. వారు భారతీయుల, ఇతరుల మత గ్రంథాలను ఎంత తీవ్రంగా తమ విమర్శచేత ఛిన్నాభిన్నం చేశారో యూదు, క్రైస్తవ మత గ్రంథాలనుకూడా అలాంటి ధైర్యంతో విమర్శించటానికి వెనుకాడరని మనం ఆశిద్దాం. నేనీ మాటల నెందుకంటున్నానో ఒక ఉదాహరణనిచ్చి చెబుతాను.

ఈజిప్టు పురాతత్త్వశాస్త్ర రచయిత ఐన మాస్పెరో "హిస్టాయిరే ఏన్షియన్నే ఓరియంటలే" అనే పేరున్న ఈజిప్టు బాబిలోనియా దేశాల చరిత్రను ఒక బృహద్గ్రంథంగా రచించాడు. ఒక ఆంగ్లపురాతన శాస్త్రవేత్త దాన్ని ఆంగ్లీకరించాడు. దాన్ని నేను చదివాను. ఒకసారి బ్రిటిష్ మ్యూజియంలోని గ్రంథాలయ ఉద్యోగి నొకణ్ణి ఈజిప్టు, బాబిలోనియాలను గురించిన గ్రంథాలేవైనా వున్నాయా అని అడిగాను. మాస్పెరో రచించిన గ్రంథం వుందని అతడు చెప్పాడు. నేను దాని ఆంగ్లానువాదం నావద్ద వుందన్నాను. అందుకతడు "అది బాగాలేదు. ఆ అనువాదకుడొక మూఢ క్రైస్తవ మతాభిమాని. మాస్పెరో క్రైస్తవమతాన్ని విమర్శించిన సందర్భాల్లో అతడు ఆయా వ్రాతలను తారుమారు చేసి ఇష్టం వచ్చినట్లు మలచి వ్రాశాడు. అందువల్ల ఫ్రెంచ్ లో వ్రాయబడ్డ మూలగ్రంథాన్ని చదవండి "అని చెప్పాడు. అది చదివాక అతడు చెప్పింది యథార్థమని తేలింది – ఇది చాలపెద్ద చిక్కే! మత దురభిమానం ఎంత చెడ్డదో నీకు బాగా తెలుసు. ఈ మత దురభిమానం వల్ల సత్యాసత్యాలు మరుగున పడిపోతాయి. అప్పటినుండి ఈ పరిశోధనా గ్రంథాల అనువాదాల్లో నాకు విశ్వాసం సన్నగిల్లింది.

మరో కొత్తశాస్త్రం అభివృద్ధి చెందింది. అది మానవజాతి చరిత్ర శాస్త్రం. మనుషులను వారి శరీర రంగు, జుట్టు, శరీర నిర్మాణం, తల ఆకారం మొదలైన వాటినిబట్టి తరగతుల వారీగా వర్గీకరించటం యీ శాస్త్రం ఆశయం.

జర్మన్లు అన్ని శాస్త్రాల్లోను ఆరితేరిన వారైనప్పటికీ సంస్కృతంలోను ప్రాచీన అస్సీరియా సంస్కృతిలోను ప్రత్యేక నైపుణ్యాన్ని సాధించారు. బెన్ఫె మొదలైనవారు దీనికి నిదర్శనాలు. ఫ్రెంచ్

వారు ఈజిప్టు పురాతత్త్వ పరిశోధనా శాస్త్రంలో దిట్టలు. మాస్పెరో మొదలైనవారు దీనికి నిదర్శనాలు. డచ్చివారు యూదు, ప్రాచీన క్రైస్తవ మతాల విశ్లేషణలో ప్రఖ్యాతులు. క్యూనెన్ మొదలైన డచ్చి పండితులు ప్రపంచ విఖ్యాతి పొందారు. ఆంగ్లేయులు అనేక శాస్త్రాలను ప్రారంభించి తరువాత మానుకొంటారు.

ఈ పండితుల అభిప్రాయాలను గురించి నీకు కాస్త చెబుతాను. వారి అభిప్రాయాలు నీకు రుచించకపోతే నీవు వారితో పోట్లాడవచ్చు! కాని దయచేసి నన్నుమాత్రం దూషించవద్దు. హిందువులు, యూదులు, బాబిలోనియన్లు, ఈజిప్షియన్లు ఇంకా ప్రాచీనజాతులకు చెందినవారు – వీరంతా మానవజాతిమొత్తం ఒకే ఆదిమదంపతులనుండి ప్రభవించిందని చెబుతారు. ఈ విషయాన్ని యిప్పటి ప్రజలు ఎక్కువగా విశ్వసించరు.

కాఫిర్లను నీవెప్పుడైనా చూశావా? వారు కారు నలుపుగా వుంటారు. వారిది చట్టిముక్కు. పెదవులు మందం, జుట్టు ఉంగరాలు తిరిగి వుంటుంది, నుదురు సన్నం. అండమాన్ దీవుల్లో వుండే జనం, భిల్లులు వీరిమాదిరే వుంటారు. కాని వారు కాస్త పొట్టి; జుట్టు అంత ఉంగరాలు తిరిగి ఉండదు. ఈ కాఫిర్లలో ప్రథములు నీగ్రోలు. వీరు ఆఫ్రికాలో నివసిస్తున్నారు. రెండవ తరగతికి చెందినవారు నీగ్రిటోలు. (అంటే చిన్న నీగ్రోలు) ప్రాచీనకాలంలో వీరు అరేబియాలోని కొన్ని ప్రాంతాల్లోను యూఫ్రెటిస్ నదీతీరాల్లోను, దక్షిణ పర్షియాలోను, భారతదేశమంతటా, అండమాన్ దీవుల్లో, మరికొన్ని యితర దీవుల్లో, ఆస్ట్రేలియా వరకూ వ్యాపించి వుండేవారు. అధునాతన కాలంలో భారతదేశంలోని కొన్ని అరణ్యప్రాంతాల్లోను, అండమాన్ దీవులు, ఆస్ట్రేలియాలోను వీరు కానవస్తారు.

లెప్చాలు, భూటియాలు, చైనీయులు, వీరిని నీవు చూశావా? వీరు పసుపుపచ్చగానో, తెల్లగానో వుంటారు. వీరి జుట్టు తిన్నగా, నల్లగా వుంటుంది. వీరి కళ్లు చాలనల్లగా వుంటాయి. గడ్డం, మీసం స్వల్పం. ముఖం చదునుగా వుంటుంది. దవడ బొమికలు పెద్దవి. నేపాలీయులను, బర్మీయులను, సయామీయులను, మలయావారిని, జపాన్‌వారిని నీవు చూశావా? వారి

ఆకారంకూడా అలాగే వుంటుంది. కాని కాస్త పొట్టివారు.

పైన చెప్పబడిన యీ రెండు తరగతుల ప్రజలు మంగోలులని, చిన్న మంగోలులని పిలువబడతారు. ఈ మంగోలియన్లు ఆసియాలో అధిక ప్రాంతాన్ని ప్రస్తుతం ఆక్రమించుకొన్నారు. ఇప్పుడు వారు మంగోలులు, కల్మకులు, హూణులు, చైనీయులు, తార్తారులు, టర్కులు, మంచూలు, కిర్ఘిజులు అనే అనేక శాఖలుగా విడిపోయారు. వీరు దేశదిమ్మరులుగా జీవిస్తారు. డేరాలు వేసుకొని, మేకలను, గొర్రెలను, పశువులను, గుర్రాలను పెంచుతూ తిరుగుతుంటారు. అవకాశం లభిస్తే మిడుతలదండ్ల మాదిరి ప్రపంచం మీదపడి ధ్వంసం చేస్తారు. చైనీయులు, టిబెట్టువారు యిందులో చేరరు. వీరికి టురేనియన్లనే పేరుంది. ఇరాన్, తురాన్ అనే ప్రసిద్ధమైన పదబంధంలో కనిపించేది యీ తురానన్నమాటే.

ప్రాచీనకాలం నాటి ఈజిప్టులోను, ప్రాచీన బాబిలోనియాలోను, ప్రస్తుతం ఇండియా అంతటా, ముఖ్యంగా దక్షిణ భాగంలో నల్లని దేహవర్ణాలున్న ఒక జాతి నివసించేది. వీరి జుట్టు తిన్నగా వుంటుంది. ముక్కు కోటేరు వేసినట్లుంటుంది. తిన్ననైన నల్లని కళ్లు. ఐరోపాలో కూడా అక్కడక్కడ అపురూపంగా వీరు కానవస్తారు. వీరంతా ఒక జాతికి చెందిన వారు. వీరిని ద్రావిడులని పిలుస్తారు.

మరోజాతి శరీరవర్ణం తెలుపుగాను. కళ్లు తిన్నగాను వుంటాయి. వీరి చెవులు, ముక్కు వంపు తిరిగి కొసలో మందంగా వుంటాయి. వీరికి సన్నని నుదురు, బండ పెదవులు వుంటాయి. ఉత్తర అరేబియాలో ప్రజలు, అధునాతన యూదులు, ప్రాచీన బాబిలోనియన్లు, అస్సీరియన్లు, ఫోనీషియన్లు యీ కోవకు చెందినవారు. వీరి భాషలన్నీ ఒక ప్రాచీన భాషనుండి వచ్చిన శాఖలే. ఈ జాతికి 'సెమిటిక్' జాతి అనిపేరు.

మరి ఆర్యజాతి వేరు. వీరు సంస్కృతంనుండి వచ్చిన భాషలు మాట్లాడతారు. వీరి ముక్కులు, కళ్లు, నోళ్లు తీర్చిదిద్దినట్లుంటాయి. వీరు తెల్లని దేహచ్ఛాయ గలవారు. జుట్టు

నల్లగాను, ధూమ్రవర్ణంలోను వుంటుంది. కళ్లు నల్లగానో, నీలవర్ణంగానో వుంటాయి.

అధునాతన మానవ జాతులన్నీ యీ ప్రాచీన జాతుల సంపర్కంవల్ల ఏర్పడినవే. ఏ దేశంలో ఏజాతి జనం ఎక్కువగా వుంటారో ఆ దేశంలో చాలా వరకు ఆ నిర్దిష్ట జాతిని పోలిన శారీరక నిర్మాణం, ఆ జాతి భాష కలిగి వుంటారు.

ఉష్ణదేశాల్లో నివసించేవారు నల్లగాను, శీతల దేశాల్లో నివసించేవారు తెల్లగాను వుంటారనే సిద్ధాంతాన్ని పాశ్చాత్యదేశాల్లో అంతగా ఒప్పుకోరు. నలుపు, తెలుపులకు మధ్యవుండే అనేక దేహవర్ణాలు ఈ నల్ల, తెల్ల జాతుల సంపర్కంచేత ఏర్పడ్డాయని చాలమంది అభిప్రాయం. ఈజిప్టు, ప్రాచీన బాబిలోనియా నాగరికతలు అత్యంత ప్రాచీనమైనవని పండితుల అభిప్రాయం. క్రీస్తుపూర్వం ఆరువేల సంవత్సరాలకంటె కూడా పురాతనమైన ఇళ్ళు, శిథిల భవనాలు ఈ దేశాల్లో వున్నాయి. భారతదేశంలో కనుగొనబడ్డ పురాతన భవనాలు క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దానికి చెందినవి. చంద్రగుప్తుని కాలంకంటె ప్రాచీనమైనవి లేవు. కాని అంతకంటె అతిప్రాచీనమైన గ్రంథాలు మాత్రం వున్నాయి. ఇలాంటి పురాతన గ్రంథాలు మరే దేశంలోను లేవు.★ క్రీస్తుకు ఐదువేల సంవత్సరాలకు పూర్వమే యిప్పుడున్న క్రమంలోనే వేదాలుండేవని బాలగంగాధరతిలక్ పండితుడు కావలిసినంత సాక్ష్యం చూపించి నిరూపించాడు. క్రీస్తుకు పూర్వం కనీసం ఐదువేల సంవత్సరాలముందు ఇప్పుడున్న పద్ధతిలోనే హిందువు లుండేవారు.

ప్రపంచాన్నంతా జయించిన పాశ్చాత్యనాగరికతా జన్మస్థానం యీ మధ్యధరా సముద్రతీరాల్లోదే. సెమిటిక్ జాతులైన ఈజిప్షియన్లు, బాబిలోనియన్లు, ఫొనీషియన్లు, యూదులు, ఆర్యజాతులైన పర్షియన్లు, గ్రీకులు, రోమన్లు వీరంతా ఒకరితో ఒకరు కలిసిపోయి అధునాతన పాశ్చాత్య నాగరికతను రూపొందించారు.

ఈజిప్టులో 'రోజెట్టాశిల' అనబడే ఒక పెద్ద రాతి ఫలకంమీద ఎన్నో శాసనాలు లిఖించబడి వుండటం కనుగొనబడింది. దీనిమీద చిత్రలిపిలో శాసనాలున్నాయి. దానికింద

మరో రకమైన వ్రాతలో, దానికి కింద గ్రీకు అక్షరాలను పోలిన లిపిలో శాసనాలు లిఖించబడి వున్నాయి. ఒక పండితుడు యీ మూడు రకాలైన శాసనాలు ఒకటే అని ఊహించి ఈ ప్రాచీన ఈజిప్టు శాసనాలను 'కోప్ట్' భాషాక్షరాల సహాయంతో చదువగలిగాడు. ఈ కోప్ట్‌లనేవారు యిప్పటికీ ఈజిప్టులో నివసించే ఒక క్రైస్తవ జాతివారు. ప్రాచీన ఈజిప్షియన్లనుండి వచ్చినవారు. బాబిలోనియాలో పెంకులమీద, ఇటుకరాళ్లమీద మలచబడ్డ క్యూనీఫాం లిపి శాసనాలుకూడా క్రమంగా చదువబడ్డాయి. ఈలోపు భారతదేశంలో నాగలి ఆకారంలోని అక్షరాలతో వున్న కొన్ని శాసనాలు అశోకచక్రవర్తి కాలంనాటివని నిర్ధారించారు. ఇంతకంటె ప్రాచీనమైన శాసనాలు భారతదేశంలో కనిపించలేదు.* ఈజిప్టులో ప్రాచీన లిపిలో దేవాలయాలమీద, స్తంభాలమీద, శవాలను భద్రపరచిన పేటికలమీద లిఖించబడిన వ్రాతలన్నీ క్రమంగా చదువబడి ఈజిప్టు ప్రాచీనత్వాన్ని వెలుగులోకి తెచ్చాయి.

ఈ ప్రాచీన ఈజిప్షియన్లు దక్షిణాది దేశమైన పుంట్ అనబడే ప్రాంతంనుండి సముద్రాల మీదుగా ఈజిప్టుకు వచ్చారు. ఈ పుంట్ యిప్పటమలబార్ అనీ, ఈజిప్షియన్లు, ద్రావిడులు ఒకే జాతివారని కొందరి అభిప్రాయం. వీరి మొట్టమొదటి రాజు మెనెస్. వీరి ప్రాచీన మతం కొంతదాకా మన పురాణ కథలను పోలివుంటుంది. 'షిబూ' అనే దేవుడు 'నూయీ' అనే స్త్రీ దేవతచేత ఆవరించబడ్డాడు. తరవాత 'షూ' అనే దేవుడు వచ్చి షిబూని కప్పిన నూయీని తొలగించాడు. నూయీ దేవత శరీరం ఆకాశం కాగా, ఆమె రెండు చేతులు, రెండు కాళ్లు ఆకాశాన్ని ఆదుకొనే నాలుగు స్తంభాలైనాయి. షిబూ దేవుడు భూమి అయ్యాడు. నూయీ దేవతకు ఒక కుమారుడు, ఒక కుమార్తె వున్నారు. కుమారుడి పేరు 'ఒసిరిస్'. కుమార్తె పేరు 'ఐసిస్'. ఈజిప్టు దేవతల్లో వీరు ప్రధానులు. వీరిద్దరి కుమారుడు 'హోరస్' అనే దేవుడు విశ్వజనీన ఆరాధ్యుడు. ఈ ముగ్గురు ఒక వర్గంగా కొలువబడతారు. మరల వీరిలో ఐసిస్ ఆవురూపంగా కొలువబడుతుంది.

భూమిమీద ప్రవహించే నైలునది లాగే ఆకాశంలో మరో నైలు నది వుంది. ఈ నైలునదికి

భూమిమీది నైలునది ఒక శాఖ. ఈజిప్షియన్ల దృష్టిలో సూర్యుడు ఒక పడవనెక్కి భూమిచుట్టూ తిరుగుతాడు. అప్పుడుప్పుడు 'అహి' అనబడే పాము అతణ్ణి మింగుతుంది. అప్పుడు గ్రహణం ఏర్పడుతుంది. చంద్రుణ్ణి అప్పుడప్పుడు ఒక వరాహం ఎదుర్కొని చీల్చి వేస్తుంది. మళ్లా ఆ ముక్కలు అతకబడటానికి పదిహేను రోజులు పడుతుంది. అప్పటి కతడు స్వస్వరూపాన్ని పొందుతాడు. ఈజిప్టు దేవతల్లో కొందరికి నక్క ముఖాలు, డేగ ముఖాలు, ఆవు ముఖాలు కలిగి వివిధ రూపాల్లో వుంటారు.

ఈజిప్షియన్ల నాగరికతతో సమకాలీనంగా యూఫ్రెట్స్ నదీతీరంలో మరో నాగరికత వెల్లివిరిసింది. ఇక్కడ బాల్, మోలోఖ్, ఇస్టార్టె, డాముజీ – ముఖ్యదేవతలు. ఇస్టార్టె దేవత, డాముజీ అనే గొల్లవాడిని ప్రేమించింది. ఒక వరాహం డాముజీని చంపేసింది. ఇస్టార్టె అతణ్ణి వెదుక్కొంటూ భూమి కిందవున్న హేడ్స్ అనే నరకానికి వెళ్లింది. అక్కడ 'అలాట్' అనే దేవత ఆమెను చిత్రహింసలకు గురిచేసింది. ఇస్టార్టె వాటన్నింటిని సహించి డాముజీని తన కిప్పిస్తేగాని తాను భూలోకానికి తిరిగి వెళ్ళనంది. ఇది పెద్ద చిక్కుసమస్య. ఇస్టార్టె కామదేవత. ఆమె తిరిగి భూలోకానికి వెళ్లకపోతే అక్కడ మానవుల, జంతుజాతుల అభివృద్ధి స్తంభించిపోతుంది. అప్పుడు దేవతలంతా సమావేశమై ఒక పరిష్కార మార్గానికొచ్చారు. డాముజీ నాలుగు నెలలు నరకంలో వుండాలి. ఎనిమిది నెలలు భూమ్మీద వుండాలి. ఇస్టార్టె దీనికి అంగీకరించి, తిరిగి భూలోకానికి వచ్చేసింది. ఆమె రాకతో వసంతోదయమయింది. పంటలు సమృద్ధిగా పండాయి.

ఈ డాముజీకి ఇందువల్ల 'అదునోయి', 'అదోసిస్' అనే పేర్లు వచ్చాయి. ఏవో చిన్నచిన్న వ్యత్యాసాలను మినహాయిస్తే సెమిటిక్ జాతుల మతాలన్నీ ఒక్కటే. బాబిలోనియన్లు, యూదులు, ఫోనీషియన్లు, తరువాతి అరబ్బుజాతులు ఒకే రకమైన మతాచారాలను కలిగి వుండేవారు. వారిలో ప్రతి దేవుడికి 'మొలోఖ్' అనే పేరు వుంటుంది. వంగభాషలో యిప్పటికీ 'మాలిక్' (రాజు) 'ముల్లక్' అంటే రాజ్యం అనే మాటలు ప్రచారంలో వున్నాయి. 'బాల్' అనికూడా వారి

దైవానికి పేరు; ఏవో చిన్నచిన్న వ్యత్యాసాలు వుంటాయనుకోండి. కొందరి దృష్టిలో 'అలాత్' అనే దేవతే తరువాత అరబ్బుల 'అల్లా' గా మారాడు.

ఈ దేవతారాధనలో కొన్ని క్రూరమైన కర్మకాండలుండేవి. మొలోఖ్ లేక బాల్ ఆరాధనలో చిన్నపిల్లలను సజీవంగా దహనం చేసేవారు. ఇస్టార్టె దేవాలయంలో సహజంగాగాని, అసహజంగాగాని కామతృప్తిని పొందటం ముఖ్యాంశం.

బాబిలోనియా జాతికంటె యూదు జాతుల చరిత్ర అధునాతనమైంది. కొందరు పండితుల అభిప్రాయంలో బైబిల్ అనబడే గ్రంథం క్రీస్తు పూర్వం ఐదవ శతాబ్దంనుండి క్రీస్తు తరవాత చాల సంవత్సరాల వరకు రచించబడుతూనే వుందట. బైబిల్‌లో అతిప్రాచీనమని భావించబడే అనేక భాగాలు చాలకాలం తరువాత రచించబడ్డాయి. బైబిల్‌లోని ప్రధాన విషయాలు బాబిలోనియన్లకు సంబంధించినవి. బాబిలోనియన్ల సృష్టి క్రమపద్ధతి, జలప్రళయవర్ణనం బైబిల్‌లోకి మొత్తం మొత్తంగా ఎక్కించబడ్డాయి. వీటన్నిటిని మించి ఆసియా మైనర్‌ను పర్షియన్ చక్రవర్తులు పరిపాలించేకాలంలో అనేక పర్షియన్ సిద్ధాంతాలు యూదుల అంగీకారాన్ని పొందాయి. పాత టెస్టమెంట్‌నుబట్టి చూస్తే, వున్నదంతా ఈ ప్రపంచమే, ఆత్మలేదు, మరణానంతరం ఏమీ వుండదు. కొత్త టెస్టమెంట్‌లో మాత్రం, మరణానంతర జీవనం, పునర్జన్మ అనే యీ రెండు పర్షియన్ సిద్ధాంతాలు చేర్చబడ్డాయి. 'సైతాన్' సిద్ధాంతం కేవలం పర్షియన్లదే. ఈ సిద్ధాంతాలన్నీ కొత్త టెస్టమెంట్‌లోకి చక్కగా ఎక్కించబడ్డాయి.

యూదులమతంలో 'యావ్ – మోలోక్' అనే దేవతను ప్రధానంగా ఆరాధిస్తారు. కాని ఈ పేరు యూదుల భాషలోనిది కాదు. కొందరి అభిప్రాయానుసారం ఇది ఈజిప్షియన్ల పదం. కాని ఈ పదం ఎక్కణ్ణుండి వచ్చిందో ఎవరికీ తెలియదు. ఇజ్రేలీయులు ఈజిప్టులో చాలకాలం నివసించినట్లు బైబిల్‌లో దృష్టాంతాలున్నాయి. కాని ఈ దృష్టాంతాలనెవరూ ప్రస్తుతం అంగీకరించరు. అబ్రహాం, ఐసాక్, జోసెఫ్ మొదలైన పురాణపురుషులందరూ కల్పిత పాత్రలని అనేకుల అభిప్రాయం.

యూదులు 'యావ్' అనే పేరు ఉచ్చరించరు. దానికి బదులు 'అదునోయి' అని ఉచ్చరిస్తారు. యూదులు 'ఇజ్రేయిల్', 'ఎఫ్రెయిమ్' అనే రెండు శాఖలుగా విడిపోయినప్పుడు రెండు దేశాల్లోను రెండు ముఖ్యదేవాలయాలు నిర్మించబడ్డాయి. ఇజ్రేలీయులు జెరూసలెంలో ఒక దేవాలయాన్ని నిర్మించుకొన్నారు. ఆ దేవాలయంలో వున్న ప్రతిమ 'యావ్' ది. ఆ ప్రతిమ స్త్రీ పురుష యుగళమూర్తి. ఈ ప్రతిమను ఒక చెక్కపెట్టెలో వుంచి భద్రపరిచారు. ద్వారంవద్ద ఒక లింగాకృతి వుంది. ఎఫ్రెయిమ్ వారు నిర్మించిన దేవాలయంలో యావ్ ప్రతిమ బంగారుతొడుగు వేసిన వృషభాకృతిలో వుంటుంది.

ఈ రెండు ప్రాంతాల్లోను మొదటి కుమారుణ్ణి దైవప్రీతికై సజీవదహనం చేసే ఆచారం వుంది. ఈ రెండు దేవాలయ ప్రాంగణాల్లోను కొందరు స్త్రీలు పడుపువృత్తితో జీవిస్తుంటారు. ఈ వృత్తివల్ల వచ్చే సంపాదనను దేవాలయ ఖర్చుల నిమిత్తం ఉపయోగిస్తారు.

కాలాంతరంలో సంగీతం ద్వారానో, నాట్యం ద్వారానో దేవతలను తమలో ఆవహింపచేసుకోవటం యూదుల్లో ఆచారమైంది. ఇలా ఆవహింపచేసుకొన్న వారంతా ఒక వర్గంగా ఏర్పడి, మతగురువు లయ్యారు. వీరిలో చాలామంది పర్షియన్ల సన్నిహిత సంబంధంచే ప్రతిమారాధనను, పుత్రబలులను, అవినీతిని, వ్యభిచారాన్ని తదితర ఆచారాలను వ్యతిరేకించారు. క్రమంగా నరబలికి బదులు 'సున్నతి' ఆచారంలోకి వచ్చింది. ప్రతిమారాధన, వ్యభిచారం క్రమంగా అంతరించిపోయాయి. కాలాంతరంలో ఈ మత గురువుల నుండే క్రైస్తవమతం పెంపొందింది.

అసలెప్పుడైనా 'ఏసుక్రీస్తు' అనే పేరుతో ఎవరైనా జన్మించి వున్నాడా అనేది పెద్ద వివాదం. కొత్త టెస్టమెంట్‌లోని నాలుగు భాగాల్లో సెయింట్ జాన్ రచించిన భాగం కేవలం కల్పితమని కొందరు నిరాకరించారు. తక్కిన మూడు ఒక ప్రాచీన గ్రంథంనుండి నకలు చెయ్యబడ్డవని నిర్ణయించబడింది. ఈ నకలు చెయ్యటంకూడా ఏసుక్రీస్తుకు నిర్ధారించిన తేదీకి చాలకాలం తరువాత జరిగింది.

పైగా యూదుల్లో ఏసుక్రీస్తు పుట్టాడని భావించబడే కాలంలో 'జోసెఫస్', 'ఫిలో' అనే యిద్దరు చరిత్రకారులు జన్మించారు. వారిద్దరు యూదుల్లోని చిన్నచిన్న శాఖలను కూడా పేర్కొన్నారు. కాని క్రీస్తును గురించిగాని, క్రైస్తవులను గురించిగాని, క్రీస్తుకు రోమన్ న్యాయాధికారి శిలువమీద కొరతశిక్ష విధించిన విషయంగాని వారు సూచించనైనాలేదు. జోసెఫస్ పుస్తకంలో ఈ కొరతను గురించి ఒకే పంక్తి వుంది. కాని అది ప్రక్షిప్తమని నిరూపించబడింది. యూదులను అప్పుడు రోమన్లు పరిపాలించేవారు. రోమన్లకు శాస్త్రాలు, విద్యలు నేర్పటానికి గ్రీకులు ఉపాధ్యాయత్వం వహించి వుండేవారు. వారందరూ యూదులను గురించి ఎన్నో విషయాలు వ్రాశారు. కాని క్రీస్తును గురించిగాని, క్రైస్తవులను గురించిగాని కొంచమైనా ప్రస్తావించలేదు.

ఇందులో మరో చిక్కుంది. కొత్త టెస్టమెంట్‌లోని అనేక సూక్తులు, నియమాలు, సిద్ధాంతాలు క్రీస్తు శకానికి ఎంతోముందే యూదుల్లో ప్రచారంలో వుండేవి. ఇవన్నీ అనేక ప్రాంతాలనుండి వచ్చిన 'హిల్లెల్' మొదలైన మతగురువులచే ప్రచారం గావించబడ్డాయని పరిశోధకులు చెబుతారు.కాని వారి ప్రతిష్ఠ దెబ్బతింటుందని భయంతో తమ మతాన్ని గురించి వారే నిర్ణయాలు చెయ్యరు. ఇతర మతాలను గురించి ఐతే బాహాటంగా విమర్శిస్తారు. అందుచేత వారు క్రీస్తు పరిశోధనలో ఎంతో మందకొడిగా సాగుతారు. దీనికే 'ఉన్నత విమర్శ' అని పేరు.

పాశ్చాత్య పండితులు అనేక దూరదేశాల మతాలు, ఆచారాలు, జాతులు యిత్యాది అనేక విషయాలను గురించి పరిశోధిస్తున్నారు. మన వంగదేశంలో యిలాంటి పరిశోధన ఏమీలేదు. ఎందుకని? ఒక వ్యక్తి పది సంవత్సరాలు ప్రయాసపడి ఇలాంటి గ్రంథాన్నొకదాన్ని అనువదించాలంటే ఈ పదిసంవత్సరాలు అతగాడికి తినటానికేం లభిస్తుంది? ఒకవేళ అనువదించినా దాన్ని అచ్చువెయ్యటానికి అతడికి డబ్బెక్కడనుండి వస్తుంది?

మనం రెండు ముఖ్య విషయాలను గమనించాలి; ఒకటి మన దేశం అతిపేద దేశం, రెండోది ఏవిధమైన విద్యా అధ్యయనం ఇక్కడ లేదు. మన దేశంలో అనేక విద్యలను, శాస్త్రాలను

గురించి మనం అధ్యయనం చేసే సుదినం ఎప్పటికైనా వస్తుందా? "తన కృపతో మూగను వాచాలుణ్ణీ, కుంటివాణ్ణి కొండలను అధిరోహింపచేసే" భగవతి కాళీమాతకే అది తెలియాలి.

ఓడ నేపిల్స్ రేవు చేరింది. మేం ఇటలీ చేరాం. ఇటలీకి ముఖ్య పట్టణం రోమ్ నగరం. ఈ రోమ్ అతిప్రాచీనమైన రోమన్ సామ్రాజ్యానికి ముఖ్యపట్టణం. రోమన్ సామ్రాజ్యం ఎంతో శక్తివంతమైంది. రోమన్ల రాజకీయాలు, సైనిక విజ్ఞానం, వలసల నేర్పాటు చేసుకొనే విద్య, యితర ప్రాంతాలను జయించే ప్రజ్ఞ – యీ గుణాలన్నీ నేటికీ సమస్త ప్రపంచానికి ప్రమాణాలుగా వున్నాయి.

నేపిల్స్‌ను వదిలాక మా ఓడ మార్సేల్స్‌లో ఆగింది. అక్కణ్ణుండి సరాసరి లండన్ చేరుకొంది.

నీవు ఇప్పటికే ఐరోపా గురించి చాలా విన్నావు. వారి ఆహారం, వేషం, పద్ధతులు, ఆచారాలు మొదలైనవి ఎన్నో విన్నావు. నేను మళ్లీ వాటి గురించి వ్రాయనక్కర్లేదు. కాని పాశ్చాత్య నాగరికత, దాని మూలం, మనకు దానితో వున్న సంబంధం, మనమెంతదాకా దాన్ని అవలంబించాలో – ఈ రకమైన విషయాలను గురించి ముందుముందు నేను చాలా చెప్పవలసి వుంది. ప్రియ సోదరా! జన్మతః మనిషికి గౌరవం రాదు. అందుచేత వీటిని గురించి మరొకప్పుడు చెబుతాను. చెప్పినా ఏం లాభం? కబుర్లాడటంలో, చర్చించటంలో మన వంగీయులతో ఎవరు సాటిరాగలరు? మీకు చేతనైతే నోరు మూసుకొని మీ సామర్థ్యమంతా పనిలో చూపించండి. ఒక సంగతి మాత్రం చెబుతాను. విజ్ఞానం, అధికారం పేదవాళ్ల కింది తరగతి ప్రజలకు సంక్రమించి నప్పటినుండి ఐరోపా అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఇతర దేశాల దరిద్ర ప్రజానీకం, చెత్తవలె తుడిచిపారెయ్యబడిన దీన ప్రజలంతా అమెరికాకు చేరి ఆశ్రయం పొందారు. ఈనాడు వారే అమెరికాకు వెన్నెముకగా నిలిచారు. ధనికులు, పండితులు నువ్వు చెప్పేది విని అర్థంచేసుకొని నిన్ను మెచ్చుకొంటారు; నిందిస్తారు. ఈ భూషణదూషణలతో కలిగే ఫలితం శూన్యం. ఈ పండితులు, భాగ్యవంతులు దేశానికి కేవలం అలంకారప్రాయులు, అంతే. కాని దేశానికి ప్రాణం

నిమ్నజాతులకు చెందిన కోట్లాది దరిద్రప్రజానీకమే. పెద్ద సంఖ్యలుగాని, ధనంగాని, పేదరికంగాని ముఖ్యమైనవి కావు. కొద్దిమంది వ్యక్తులు మనోవాక్కర్మల్లో ఒక్కటయితే ప్రపంచాన్నే ఉద్రూతలూగిస్తారు. ఈ సత్యాన్ని మరువకుండా గుర్తుపెట్టుకోండి. ప్రతిఘటన ఎంత వుంటే అంత మంచిది. ప్రతిఘటన లేకుండా నదికి వేగం వస్తుందా? ఒక విషయం ఎంత కొత్తదైతే, ఎంత మంచిదైతే, ప్రారంభంలో అది అంత ప్రతిఘటన ఎదుర్కోవలసి వస్తుంది. ఈ ప్రతిఘటనే విజయ సూచకం. విఘ్నం లేని చోట విజయంకూడా హుళక్కి. ఇక సెలవు.

# రెండవ భాగము

పాదాల్లో చక్రాలున్నవాడు దేశదిమ్మరి అవుతాడని మనలో ఒక సామెత వుంది. నా పాదాలంతటా చక్రాలున్నాయని నా భయం. నిజానికి సందేహానికి చోటులేదు. నేను నా పాదాలను జాగ్రత్తగా పరీక్షించి చూశాను గాని లాభంలేకపోయింది. ఈ అపరిమితమైన చలికి నా పాదాలన్నీ పగిలి పోవటంతో పాదాల్లో చక్రాలుగాని, మరేమీగాని కనిపించలేదు. ఐనా ఆ రకమైన నమ్మకం వుంది కాబట్టి నా పాదాలనిండా అలాంటి చక్రరేఖ లున్నాయనే నేను నిశ్చయించాను.

దానికి ఋజువిదిగో! నేను పారిస్ నగరంలో కొంతకాలం వుండి ఫ్రెంచ్ భాషను, ఫ్రెంచ్ నాగరికతను నేర్చుకోవాలని ఆశించాను. నేను నా పాతస్నేహితులను వదిలి ఒక కొత్త స్నేహితునితో వుంటున్నాను. అతడొక ఫ్రెంచ్‌వాడు. సామాన్యమైన ఆదాయం వున్నవాడు. అతడికి ఆంగ్లం రాదు; నాకొచ్చే ఫ్రెంచ్ అద్భుతమైందే. ఆంగ్లంరాని ఫ్రెంచ్‌వారి మధ్య నివసించేటప్పుడు గతిలేక ఫ్రెంచ్‌లోనే మాట్లాడాలి. లేకుంటే మూగవాడిలా మారకుండాలి. కాని నోరు మూసుకొని కూర్చోవటం ఎంతో కష్టం కదా. కాని నోరు మూసుకొని కూర్చోలేనితనం ఫ్రెంచ్‌లో నన్ను మాట్లాడింపచేస్తుందని, దానితో త్వరలోనే ధారాళంగా మాట్లాడ్డం వస్తుందని నేను భావించాను. కాని దీనికి వ్యతిరేకంగా నేనిప్పుడు వియన్నా, టర్కీ, గ్రీసు, జెరూసలెం మొదలైన దేశాల్లో తిరుగవలసి వచ్చింది. దైవగతి నెవరు తప్పించగలరు? నేనిప్పుడు నీకీ ఉత్తరాన్ని మహమ్మదీయుల ప్రాభవానికి ఆఖరి ముఖ్యపట్టణంగా నిలిచిన కాన్‌స్టాంటినోపుల్ నుండి వ్రాస్తున్నాను.

నాతోపాటు ముగ్గురు స్నేహితులు ప్రయాణం చేస్తున్నారు. వీరిలో ఇద్దరు ఫ్రెంచ్‌వారు. మూడవవ్యక్తి అమెరికా దేశస్థురాలు. ఈమె పేరు కుమారి 'మాక్లౌడ్'. ఈమె నీకు బాగా తెలుసు. ఫ్రెంచ్ వారిలో ఒకరు పురుషుడు. అతడి పేరు 'జూల్స్‌బోయిస్'. ఇతడు ఎంతో ప్రసిద్ధుడైన వేదాంతి, సాహిత్యవేత్త. రెండవ వ్యక్తి కుమారి 'కాల్వే'. ఈమె ప్రపంచ విఖ్యాత గాయకురాలు. 'మాన్షోర్' అంటే ఆంగ్లంలో 'మిస్టర్' అని, 'మేడమోసెల్' అంటే 'కుమారి' అని అర్థం. ఈ కుమారి కాల్వే ఈనాటి అగ్రస్థానంలోని నృత్యనాటకాల్లో గాయకురాలు. ఈమె సంగీత ప్రదర్శనలు ఎంతో ఖ్యాతి పొందాయి. ఈమెకు ఈ ప్రదర్శనలవల్ల సంవత్సరానికి మూడు, నాలుగు లక్షల రూపాయలు వట్టి గానం వల్లే లభిస్తుంది. దీన్నిబట్టి ఈమె ప్రశస్తి ఎలాంటిదో ఊహించవచ్చును. నా కీమెతో పూర్వపరిచయం వుంది. పాశ్చాత్యదేశాల్లో సంగీతంలో ఈమె, నటనలో మేడం 'సారాబెర్న్ హార్డ్' అనే ఆమె శ్రేష్ఠులు. వీరిద్దరూ ఫ్రెంచ్‌వారే. వారికి ఆంగ్లం ఒక అక్షరంకూడా రాదు. కాని వీరప్పుడప్పుడు ఇంగ్లాండు, అమెరికాలకు వెళ్లి, అక్కడ లక్షలకొద్ది డాలర్లు తమ ప్రదర్శనలతో సంపాదిస్తారు. ఫ్రెంచ్ ప్రపంచంలో నాగరిక భాష, పాశ్చాత్యదేశాల్లో ఫ్రెంచ్ మాట్లాడటం నాగరిక లక్షణం. పాశ్చాత్య దేశాల్లో ప్రతి వ్యక్తికీ ఫ్రెంచ్ వచ్చు. అందువల్ల యీ యిద్దరి స్త్రీలకు ఆంగ్లం నేర్చుకోవాలనే కోర్కెగాని, తీరికగాని లేదు. మేడం బెర్న్‌హార్డ్ వయసు మీరిన స్త్రీ. కాని వేషం వేసుకొని రంగస్థలంలో ఆమె అడుగుపెట్టగానే ఆమె ఏ వేషం ధరించినా ఆ వేషానికి సరైన వయస్సులో, సౌష్టవంతో సంపూర్ణంగా వున్నట్లు తోస్తుంది. అది పురుషవేషం కావచ్చు, స్త్రీ వేషం కావచ్చు. ఒక బాలికో, ఒక బాలుడో, ఏ వేషం వెయ్యమన్నా ఆ వేషాన్ని ఆమె చక్కగా వేసి రక్తికట్టిస్తుంది. ఇక ఆమె కంఠస్వరమాధుర్యం వర్ణనాతీతం. ఇక్కడి ప్రజలు ఆమె కంఠం వెండి తీగలున్న జంత్రంలా మోగుతుందని మెచ్చుకొంటారు. మేడం బెర్న్ హార్డ్‌కు భారతదేశమంటె ఎంతో అభిమానం. భారతదేశం అతి ప్రాచీనదేశమని, నాగరికతవున్న దేశమని ఆమె ఎప్పుడూ నాతో చెప్పేది. ఒక సంవత్సరం ఆమె ఒక నాటకంలో భారతదేశాన్ని చిత్రీకరించింది. ఆ నాటకంలో భారతదేశంలోని పురుషులు. స్త్రీలు, బాలురు, బైరాగులు, నాగాసాధువులు ఇత్యాది సమస్తంవున్న అచ్చమైన భారతీయ దృశ్యం రంగస్థలంమీద ప్రదర్శించబడింది. తాను పురాతన వస్తుప్రదర్శనశాలలను ఒకనెల రోజులు తిరిగి తిరిగి చూసి,

భారతదేశంలోని పురుషులు, స్త్రీలు, వారి వేషధారణ, స్నానఘట్టాలు మొదలైన సర్వం అవగాహన చేసుకొన్నానని ప్రదర్శన తరువాత ఆమె నాతో చెప్పింది. మేడం బెర్న్‌హార్డ్‌కు భారతదేశాన్ని చూడాలనే పెద్ద కోరిక వుంది. 'అది నా జీవితాశయం' అనేదామె. వేల్స్ రాకుమారుడు (ఇతడే తరువాత 7 వ ఎడ్వర్డ్ రాజు) ఆమె భారతదేశానికి వస్తే పెద్దపులి వేటను, ఏనుగు వేటను తా నేర్పాటు చేస్తానని వాగ్దానం చేశాడు. భారతదేశానికి వస్తే రెండు లక్షల రూపాయల వరకు తాను వ్యయం చెయ్యవలసి వస్తుందని చెప్పింది. ఆమెకు డబ్బుకు కొదవలేదు. ఎలా వుంటుంది? ఆవిడకు 'దేవత సారా' అని పేరుంది! ఆమెకు డబ్బేం తక్కువ? ప్రత్యేకమైన రైలు బండిలోగాని ఆమె ప్రయాణం చెయ్యదు. ఆ వైభవం, విలాసం ఐరోపాలోని పెద్దపెద్ద రాకుమారులుకూడా అనుభవించలేరు. ఆమె ప్రదర్శనకు ఒక నెలకు ముందే రెట్టింపు ధరను చెల్లించి టిక్కెట్లు కొనుక్కోవాలి. ఆమెకు డబ్బుకు కొరతలేదు. సరే, ఆమె ఏమైనా తక్కువ ఖర్చు పెడుతుందనుకొన్నారా? అందుచేత తాత్కాలికంగా ఆమె భారతదేశ ప్రయాణం వాయిదాపడింది.

కుమారి కాల్వే ఈ శీతాకాలమంతా గానం చెయ్యదు. విశ్రాంతి తీసుకొంటుంది. ఈజిప్టు మొదలైన ఉష్ణదేశాలకు ఆమె యిప్పుడు వెళుతోంది. నేనిప్పుడు ఆమెకు అతిథిగా పోతున్నాను. కాల్వే పాండిత్యం ఒక్క సంగీతంలోనేకాదు. ఇతర విద్యలుకూడా ఆమెకు చక్కగా వచ్చు. వేదాంతమంటే, మన మత గ్రంథాలంటే ఆమెకు ఎంతో యిష్టం. ఆమె అతి నిరుపేద కుటుంబంలో పుట్టింది. క్రమంగా ఎన్నో కష్టాలనుభవించి, ఎంతో శ్రమపడి స్వీయప్రతిభతో యిప్పుడు గొప్ప సంపద నార్జించింది. ప్రభువుల, సంపన్నుల ఆదరాభిమానాలకు పాత్రురాలైంది.

మేడం మెల్బా, మేడం ఎమ్మాఏమెస్ మొదలైన ప్రఖ్యాత గాయనీమణులు చాలమంది వున్నారు. జీన్‌డిరెస్కే, ఫ్లాంకన్ మొదలైన ప్రసిద్ధ గాయకులున్నారు. వీరందరూ సంవత్సరానికి 2, 3 లక్షల రూపాయలు సంపాదిస్తారు. కాని కాల్వే సంగీతం అతివిలక్షణ ప్రతిభాసమన్వితం. ఆమె అతిలోక సౌందర్యం, యౌవనం, ప్రతిభ, మధుర గంధర్వగాత్రం – ఇవన్నీ

గాయకులందరికన్నా ఆమె మిన్న అవటానికి దోహదాలైనాయి. ఈ అన్నింటికంటె శ్రమ, పేదరికం ముఖ్యకారణాలు. పరిశ్రమ, పేదరికాలకంటె గొప్ప బోధకులు లేరు. బాల్యంలో అతిపేదరికం, శ్రమ, కష్టాలు – ఈ అన్నిటితో పోరాడి కాల్వే జయించింది. ఈ గుణాలే అతిసహృదయత్వాన్ని, పరిపూర్ణమైన హుందాతనాన్ని ఆమెకు సంపాదించిపెట్టాయి. అంతేగాక పాశ్చాత్య దేశాల్లో స్వీయప్రజ్ఞను వ్యక్తీకరించటానికి చాల అవకాశాలున్నాయి. మన దేశంలో తీవ్ర కృషి, ఉత్సాహం ఉన్నా అవకాశాలు శూన్యం కదా! వంగదేశంలో స్త్రీలు చదువుకోవటానికి ఉత్సాహపడ్డా, అవకాశాలు లేవు. కాబట్టి ఫలితం శూన్యమే కదా! మరి వంగభాషలో నేర్చుకోవటానికి మాత్రం ఏం వుంది? ఎంత చెప్పినా ఏవో కొన్ని పనికిమాలిన నవలలు, నాటకాలే కదా అందులో వున్నది! పైగా పాండిత్యమంటే విదేశీయ భాషకో, సంస్కృతానికో పరిమితమైంది. అదీ కొంతమందికే సాధ్యమైంది. ఈ పాశ్చాత్య దేశాల్లో మాతృభాషలోనే అసంఖ్యాకమైన గ్రంథాలున్నాయి. వీటికి మించి ఏదైనా విదేశీయ భాషలో ఒక నూతన విషయం ప్రచురితమైతే, అది వెంటనే అనువదించబడి ప్రజలందరి అందుబాటులోకి వస్తుంది.

జూల్స్ బోయిస్ ప్రసిద్ధ గ్రంథకర్త. అతడు ముఖ్యంగా వివిధ మతాల్లోని, వాటి మూఢాచారాల్లోని చారిత్రక సత్యాలను కనుగొనటంలో ప్రవీణుడు. పిశాచారాధన, మంత్రశాస్త్రం, గారడి, మరణించిన వారిజీవులతో సంభాషించటం – మొదలైన మధ్యయుగపు పాశ్చాత్య దేశాల్లోని కర్మకాండలను గురించిన చారిత్రకాంశాల నతడు ఒక పెద్ద గ్రంథంగా రచించాడు. ఇది చాల ప్రసిద్ధమైన గ్రంథం. అతడు గొప్ప కవి. విక్టర్‌హ్యూగో, లామర్టైన్ మొదలైన ఫ్రెంచ్ కవులలో, గెథె, షిల్లర్ మొదలైన జర్మన్ కవులలో పాకిన భారతీయ వేదాంత సిద్ధాంతాలకు అతడు ప్రచారకుడు. పాశ్చాత్య కవిత్వంమీద, తత్త్వశాస్త్రాలమీద భారతీయ వేదాంత ప్రభావం ఎంతోవుంది. ప్రతి గొప్పకవీ వేదాంతే. తత్త్వశాస్త్రంమీద ఏ గ్రంథం రచించబడినా ఏదోరకంగా దాన్లో మన వేదాంత సిద్ధాంతాలు చొరబడవలసిందే. వారిలో కొందరు భారతీయ వేదాంతానికి తాము ఋణపడివున్నట్లు చెప్పుకోరు. పైగా కేవలం స్వీయప్రతిభతోనే అయా సిద్ధాంతాలను ప్రతిపాదించామని చెప్పుకొంటారు. 'హెర్బర్ట్ స్పెన్సర్'

మొదలైనవారు ఈ కోవకు చెందుతారు. కాని అధిక సంఖ్యాకులు బహిరంగంగా తాము ఋణపడినట్లు ఒప్పుకొంటారు. ఇవి — టెలిగ్రాఫ్, రైలుబళ్లు, వార్తాపత్రికలు వచ్చిన రోజులయ్యాయి! ఒప్పుకోక ఏంచేస్తారు? జూల్స్ బోయిస్ చాలా పెద్ద మనిషి. అణకువగలవాడు. బాగా డబ్బున్నవాడు. పారిస్‌లో పాపం నాకు ఎంతో స్నేహంతో ఆతిథ్యమిచ్చాడు. ఇప్పుడు మాతో ప్రయాణం చేస్తున్నాడు.

కాన్‌స్టాంటినోపుల్ దాకా మాతో మరిద్దరు స్నేహితులు వచ్చారు. 'పేరీ హైసింథీ' మరియు ఆయన భార్య. 'పేరీ' అంటే ఫాద' రని అర్థం. అంటే సన్న్యాసి. అతడు రోమన్ కాథలిక్ చర్చికి చెందినవాడు. అతడి పాండిత్యం, అతని అసాధారణ వాగ్ధాటి, అతని తపోదీక్ష అతనికి ఫ్రాన్స్‌లోను, కాథలిక్ మత సంప్రదాయంలోను గొప్ప మర్యాద కలగటానికి కారణాలైనవి. 'విక్టర్ హ్యూగో' ఫ్రాన్స్‌లో ఎంతో గొప్ప కవి. అతడు ఇద్దరి ఫ్రెంచ్ భాషా శైలిని మెచ్చుకొన్నాడు. ఆ ఇద్దరిలో ఒకడు హైసింథీ. పేరీ హైసింథీ నలభై ఏళ్ల వయస్సులో ఒక అమెరికన్ స్త్రీని ప్రేమించి వివాహం చేసుకొన్నాడు. దీనివల్ల గొప్ప సంచలనం పుట్టింది. ఫలితంగా కాథలిక్ మతంనుండి అతడు బహిష్కృతుడయ్యాడు. పేరీ హైసింథీ వెంటనే సన్న్యాసి వేషాన్ని విసర్జించి 'బురఖా' కు బదులు 'కోటు, హేటు, బూటు' ధరించాడు. గృహస్థుడై 'మిస్టర్ లాయిసన్' అని పేరు పెట్టుకొన్నాడు. నేనుమాత్రం అతణ్ణి పూర్వంపేరుతోనే పిలుస్తాను. ఇది చాలకాలంనాటి కథ. యావత్తు ఐరోపా ఖండంలో ప్రతివారి నోటా ఇదే కథ. ఈ ఉదంతంతో ఐరోపాఖండం ప్రతిధ్వనించింది. ప్రొటెస్టంట్ మతస్థులు అతణ్ణి ఎంతో గౌరవంతో స్వీకరించారు. కాథలిక్కులు అతణ్ణి ద్వేషించసాగారు. అతడి ప్రతిభా పాండిత్యాలు చూసి 'పోప్' అతణ్ణి వదులుకోవటం యిష్టంలేక అతణ్ణి గ్రీకు కాథలిక్ మతగురువు (ప్రీస్ట్)గా వుండమని, రోమన్ చర్చ్‌ను వదలవద్దని కోరాడు. గ్రీకు కాథలిక్ మతగురువులు ఒక్కమారు వివాహం చేసుకోవచ్చును. కాని వారికి పెద్దపదవి ఇవ్వటానికి వీలులేదు. లాయిసన్ భార్య మాత్రం దీనికి ఒప్పుకోలేదు. పోప్ అధికారంనుండి భర్తను ఇవతలకు లాగేసింది. కాలాంతరంలో వారికి పుత్రపౌత్రాభివృద్ధి కలిగింది. ఇప్పుడు లాయిసన్ ముసలివాడయ్యాడు. జెరూసెలెంకు వెళ్లి అక్కడ క్రైస్తవులకు,

మహమ్మదీయులకు సత్సంబంధాలను నెలకొల్పాలని అతడి ప్రయత్నం. లాయిసన్ రెండవ మార్టిన్ లూథర్‌లా మారి పోప్ సింహాసనాన్ని మధ్యధరా సముద్రంలో పారవెయ్యగలడని లాయిసన్ భార్య ఎప్పుడూ కలలు కంటూంటుంది. కాని అలాంటి దేదీ జరగలేదు. జరిగినదేమంటే – అతడు త్రిశంకు స్వర్గంలో వ్రేలాడటమే! కాని లాయిసన్ భార్య యింకా పగటికలలు కంటూనేవుంది. ఈ ముసలి లాయిసన్ కలుపుగోలు మనిషి, నమ్రత గలవాడు. భక్తిసంభరిత హృదయుడు. అతడు నన్ను కలుసుకొన్నప్పుడల్లా వివిధ మతాలను గురించి, వాటిలోని శాఖాభేదాలను గురించి నాతో సుదీర్ఘంగా చర్చించేవాడు. కాని స్వభావంచే భక్తుడవటంతో అద్వైతమంటె కాస్త జంకుతాడు. అతడి భార్యకు నాపట్ల విముఖత అని భావిస్తాను. ఆ వృద్ధుడితో నేను పరిత్యాగం గురించి, సన్న్యాసాన్ని గురించి చర్చిస్తున్నప్పుడల్లా అతడి మనసులో పూర్వపు భావాలు మేల్కొనేవి. అతడి భార్యమాత్రం కోపగించుకొనేది. ఇదేకాక, ఫ్రెంచ్‌వారంతా, స్త్రీ పురుషులతో సహా తప్పంతా ఈమె తలమీదే పెడతారు. “అదుగో! ఆమె మన సన్న్యాసి శిరోమణి పతనానికి కారణమని వేలెత్తి చూపిస్తారు. ఈ దంపతులు పారిస్‌లో వుంటారు. అది కాథలిక్ దేశం. కాబట్టి పాపం లాయిసన్ భార్య స్థితి ఎంతో శోచనీయం. ఫ్రెంచ్ వారు వివాహితుడైన మత గురువు కనిపిస్తే మండిపోతారు. గృహస్థుడెవరైనా మతోపన్యాసాలు చేస్తే కాథలిక్కులు సహించరు. లాయిసన్ భార్యకు కాస్త ఇతరుల్లో తప్పులు పట్టే బుద్ధి కూడా వుంది. ఒకసారి ఒక నర్తకిని ఈమె ఇలా చీవాట్లు పెట్టింది: “నువ్వు ఫలానా వ్యక్తిని పెళ్లిచేసుకోకుండా, అతగాడితో వుండటం ఎంతో తప్పు సుమా!” దానికా నర్తకి ఇలా తిప్పికొట్టింది: “నీకన్నా నేను వెయ్యిరెట్లు మెరుగు. నేనున్నది ఒక సామాన్య వ్యక్తితో. నేను అతణ్ణి వివాహం చేసుకోనిమాట నిజమే. మరి నువ్వో? నీ అంత పాపాత్మురాలు మరొకతె లేదు. ఒక గొప్ప సన్న్యాసిని పతితుణ్ణి చేశావు. నీ కతడిమీద అంత ప్రేమ వుంటే అతడివద్ద ఒక పరిచారికగా వుండాల్సింది. అలా చెయ్యక, నువ్వు అతణ్ణి వివాహం చేసుకొని గృహస్థుడిగా మార్చేసి, నాశనం చేశావు.”

అయినా వీటన్నిటిని విన్నా నేను మెదలక మారుకొన్నాను. ముసలివాడైన పేరీ హైసింథీ

నిజంగా మృదు స్వభావి, ప్రశాంత మనస్కుడు. అతడు తన భార్య, కుటుంబంతో సుఖంగా వున్నాడు. దీనికి వ్యతిరేకంగా ఫ్రెంచ్ ప్రజలంతా ఏం చేస్తారు? ఆయన భార్య కాస్త దిగివచ్చివుంటే అంతా సర్దుకొనిపోయేది. కాని ఒక్క విషయం. ఏ దేశంలోనైనా ఒక విషయాన్ని అర్థంచేసుకోవటంలోగాని, తీర్మానించటంలోగాని స్త్రీల పద్ధతి వేరు, పురుషుల పద్ధతి వేరు. స్త్రీల దృష్టివేరు, పురుషుల దృష్టివేరు. స్త్రీ లొక దృక్పథంనుండి వాదిస్తారు. పురుషులు మరో దృక్పథంనుండి వాదిస్తారు. పురుషులు నెపమంతా మగవారిమీద మోపి, స్త్రీలపట్ల సానుభూతి చూపిస్తారు. స్త్రీలు తప్పంతా స్త్రీలమీద మోపి మగవారిని నిర్దోషులుగా ప్రకటిస్తారు.

నాతో పయనిస్తున్న ఈ స్త్రీ పురుషుల సహచర్యంతో నాకొక గొప్ప లాభం కలిగింది. వీరిలో ఒక్క అమెరికన్ స్త్రీకి తప్ప యితరులకు ఆంగ్లం రాదు. అందుచేత ఆంగ్లం మాట్లాడ్డం కట్టిపెట్టాల్సి వచ్చింది.[*] ఏదో ఒక విధంగా నేను ఫ్రెంచ్ మాట్లాడటం, వినటం తప్పలేదు.

నేను అన్ని దేశాలను బాగా చూడటాకి వీలుగా పారిస్‌లోని మన స్నేహితుడు 'మాక్సిం' నాకు అక్కడివారికి చక్కని పరిచయ పత్రాలు రాసి ఇచ్చాడు. 'మాక్సిం' ఎవరో నీకు తెలియదా? ప్రసిద్ధమైన మాక్సిం తుపాకిని కనిపెట్టినవాడు. ఈ తుపాకి తనంతట తానే గుళ్లను నింపుకోగలదు, వదలనూ గలదు. నిరంతరాయంగా పేల్చటానికి అనువైనదిది. మాక్సిం జన్మతః అమెరికన్. ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో స్థిరపడ్డాడు. అక్కడ తుపాకి నిర్మాణశాలలు కట్టించాడు. ఎవరైనా అదేపనిగా అతడిముందు అతని తుపాకిని గురించి ప్రశంసిస్తే అతడే విసుక్కొంటాడు. "బాబూ! వినాశకరమైన ఈ యంత్రాన్ని కనిపెట్టడం తప్ప నా ప్రయోజకత్వం మరేమీ లేదా?" అని అడుగుతాడు. మాక్సింకు చైనా, భారతదేశాలంటె ఎంతో ఇష్టం. అతడు మతంమీద, తత్త్వశాస్త్రం మీద ఎన్నో రచనలు చేశాడు. నా పుస్తకాలు చాలకాలంనుండి చదువుతున్నాడు. కాబట్టి నేనంటే అతడికి విపరీతమైన ఆరాధన. అతడు చాలమంది రాజులకు, ప్రభువులకు తుపాకులు సరఫరా చేస్తాడు. ప్రతి దేశంలోను అతనికి పేరుంది. అతనికి 'లీ – హూంగ్ – చాంగ్' అతిముఖ్య స్నేహితుడు. చైనా అంటె అతడికి అధిక గౌరవం, కన్ఫూషియస్ మతమంటె

భక్తి ఎక్కువ. అప్పుడప్పుడు చైనీయుల మారుపేర్లతో అతడు క్రైస్తవులకు వ్యతిరేకంగా వారు చైనాకు పోవటంలోని ఉద్దేశాలు మొదలైనవాటిని గురించి వార్తాపత్రికల్లో విమర్శించేవాడు. క్రైస్తవ మతప్రచారకులు చైనాలో తమ మత ప్రచారం చెయ్యటం అతడికి బొత్తిగా ఇష్టంలేదు. అతడి భార్యకూడా అతడిలాగానే చైనా అంటె ఇష్టపడుతుంది, క్రైస్తవమతాన్ని ద్వేషిస్తుంది. వారికి పిల్లలు లేరు. అతడు ముసలివాడు, ఎంతో ధనవంతుడు.

నా ప్రయాణ ప్రణాళికలో యివి చేరాయి: పారిస్ నుండి వియన్నా – అక్కణ్ణుండి రైలుమీద కాన్‌స్టాంటినోపుల్ – అక్కడనుండి స్టీమరుమీద ఏథెన్స్, గ్రీసు – అక్కడనుండి మధ్యధరాసముద్రం మీదుగా ఈజిప్టు – అక్కణ్ణుండి ఆసియామైనర్, జెరూసలెం మొదలైన ప్రాంతాలు. 'ఓరి యంటల్' ఎక్స్‌ప్రెస్ ప్రతిరోజూ పారిస్‌నుండి బైలుదేరి కాన్‌స్టాంటి నోపుల్‌కు పోతుంది. ఆ రైలులో నిద్రించటానికి, కూర్చోవటానికి, భోజనం చెయ్యటానికి అమెరికన్ పద్ధతిలో సదుపాయాలు చెయ్యబడ్డాయి. అమెరికన్ రైళ్లమాదిరి అవి పూర్తిగా సమగ్రంగా లేకపోయినా వాటిలో సదుపాయాలు బాగానే వున్నాయని చెప్పవచ్చును. అక్టోబర్ 24 వ తేదీన (1900 సం.) నేను పారిస్‌నుండి బయలుదేరాలి.

నేడు అక్టోబర్ 23 వ తేది, రేపు సాయంత్రం నేను పారిస్ నుండి బయలుదేరాలి. ఈ సంవత్సరం పారిస్ 'ఎగ్జిబిషన్' జరుగుతుంది. కాబట్టి ప్రపంచంలోని నాగరిక దేశాలనుండి అనేకులు యిక్కడ సమావేశమైనారు. సుప్రసిద్ధులైన స్త్రీ పురుషులు ప్రపంచం నలుమూలలనుండి యిక్కడకు వస్తారు. తమ ప్రతిభా విశేషంవల్ల తమ దేశాల కీర్తి వైభవాలను చూడటానికి మహామేధావులైన ప్రజలు అనేక దేశాలనుండి ఈనాడు పారిస్‌లో సమావేశమయ్యారు. ఈనాడు ఎవరి పేరు యిక్కడ మోగుతుందో అతడి దేశ కీర్తివైభవాలుకూడా ప్రపంచంలో పరిమళిస్తాయి. ఓ నా మాతృదేశమా! వంగదేశమా! ఈ జర్మన్, ఫ్రెంచ్, ఇటలీ మొదలైన దేశాలనుండి వచ్చిన పండితులతో నిండిన యీ పెద్ద పారిస్ నగరంలో నీకు స్థానం వుందా? నీ పేరు చెప్పటానికి ఎవడైనా వున్నాడా? నీలాంటి దేశం ఒకటుందని యిక్కడెవరు ప్రకటిస్తారు? ఆ మహా

ప్రతిభావంతులైన తెల్లవాళ్లు కూర్చున్న వరుసలనుండి ఒక యువకుడు తన మాతృదేశాన్ని గురించి చెప్పటానికి ముందుకు వచ్చాడు. అతడి మాతృదేశం వంగదేశం. అతడు ప్రపంచ ప్రసిద్ధుడైన విజ్ఞానవేత్త. అతడు డాక్టర్ జగదీశ్ చంద్ర బోస్. (తరువాత 'సర్' బిరుదాంకితుడు) ఈ యువ వంగ విజ్ఞాని ఒక్కడే తన అద్భుత ప్రతిభతో పాశ్చాత్య సభికులను అత్యాశ్చర్యచకితులను గావించాడు. సగం చచ్చిన తన మాతృభూమికి నూతనజీవంపోశాడు. భౌతిక విజ్ఞాన శాస్త్రవేత్తల్లో జగదీశ్ చంద్రబోసు యీనాడు అగ్రస్థానంలో వున్నాడు. జగదీశ్ చంద్రబోసు భారతీయుడు, వంగీయుడు మహావీరుడు. ఇతడు, విద్యావతి గుణవతి ఐన యితని భార్య – వీరిద్దరూ ఏ దేశాలకు వెళ్లినా అక్కడ భారతదేశ ఔన్నత్యాన్ని దీపింపచేస్తారు. వంగమాత కిరీటంలో నూతన రత్నాలు పొదుగుతారు. వీరిద్దరు అదృష్టవంతులైన దంపతులు!

లెగెట్టు పారిస్‌లోని తన భవనంలో ప్రతిరోజూ ఎంతో ధనం వెచ్చించి వారికి విందు లిచ్చేవాడు. అదికూడా నేటితో పూర్తవుతుంది.

కవులు, వైజ్ఞానికులు, నీతిశాస్త్రవేత్తలు, తత్త్వవేత్తలు, రాజకీయవేత్తలు, గాయకులు, పండితులు, చిత్రకారులు, శిల్పులు – యీ కోవకు చెందిన సుప్రసిద్ధ స్త్రీ పురుషులు లెగెట్టు యింట్లో సమావేశమయ్యేవారు. అతడి ఆతిథేయత, సానుభూతి అలాంటిది. ఆ ఎడతెగని సంభాషణలు కొండమీది నుండి వురుకుతున్న సెలయేళ్లలా సాగుతాయి. నలుదిక్కుల నుండి రకరకాలైనా భావాలు అగ్నికణాలవలె వ్యాపిస్తుంటాయి. ఆ సంగీతం మంత్రముగ్ధులను చేసేది. మహా ప్రతిభావంతులైనవారు తమతమ భావాలను చర్చించుకొంటూంటే శ్రోతలంతా ముగ్ధులై దేశకాలాలను మరిచిపోయి నోరు తెరుచుకొని వింటుండేవారు. ఇవన్నీ నేటితో సమాప్తమయ్యాయి.

భూమ్మీద ప్రతిదానికి అంతం వుంది. ఈ పారిస్ 'ఎగ్జిబిషన్' లోకి మళ్లీ నేనీ రోజు తిరిగి వచ్చాను. మెరుపుతీగల వంటి భావాలు యిక్కడ కుప్పవడ్డాయి. ఇదొక విశిష్టమైన సభ, భూమ్మీదికి దిగివచ్చిన దివ్యదృశ్యం.

రెండు మూడు రోజులుగా పారిస్‌లో వాన కురుస్తోంది. సాధారణంగా పారిస్ అంటె సూర్యుడికి ఎంతో దయ. కానీ ఈ మూడు రోజులు పారిస్‌కు పరిచితమైన తన రశ్మినతడు ఉపసంహరించుకొన్నాడు. బహుశ ఈ కళలు – కళావేత్తల సభకు వెనుక రహస్యంగా ప్రవహిస్తున్న ఇంద్రియలోలతను చూడలేక తన ముఖాన్ని మబ్బులతో కప్పుకొన్నాడేమో! లేక నానావర్ణ సమ్మిశ్రితమైన ఈ మాయాస్వర్గ భవిష్యన్వినాశం చూడలేక దుఃఖంతో ముఖాన్ని మబ్బుదొంతర్ల మాటున దాచుకొన్నాడేమో!

ఈ దృశ్యాన్ని చూడకుండా తప్పించుకోవటం మాకుకూడా ఎంతో సంతోషం. ఈ 'ఎగ్జిబిషన్' ను మూసివెయ్యటం ఒక పెద్ద వ్యవహారం. త్వరలో యీ భూతలస్వర్గం – దుమ్ముతోను, పెంటతోను నిండిపోతుంది. ఈ ప్రదర్శనశాలలో ఒకటి రెండు ముఖ్య భవనాలు తప్ప మిగతావన్నీ కొయ్యముక్కలు, పీలికలు, సున్నపుపూతలతో రూపొందించబడ్డవి. వీటిని పడగొట్టినప్పు డీ సున్నపుదుమ్ము వ్యాపించి, ముక్కుల్లో, నోళ్లల్లో ప్రవేశించి, అందర్నీ ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. పీలికలు, ఇసుకమన్ను, యివన్నీ వీథుల్లో నిండిపోయి వాటిని పంకిలమయ మొనరిస్తుంది. దీనికితోడు వానకూడా కురిస్తే వేరే చెప్పనక్కర్లేదు.

అక్టోబర్ 24 తారీఖు సాయంకాలం రైల్లో పారిస్‌నుండి బైలుదేరాం. ఆ రాత్రి చాలచీకటిగా వుంది. బోయిస్, నేను ఒక పెట్టెలో ఎక్కాం. త్వరగానిద్రపోయాం. తెల్లారేసరికి మేం ఫ్రాన్స్ ఎల్లలు దాటి జర్మనీలో ప్రవేశించాం. జర్మనీని నే నిదివరకు చక్కగా చూశాను. ఫ్రాన్స్‌ను చూశాక జర్మనీని చూసినప్పుడు రెంటికీ వున్న వ్యత్యాసం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. ఒకవైపు సమస్త ప్రపంచంలోను ప్రసిద్ధిగాంచి, తన స్వయంకృత దోషఫలంగా మెల్లగా అస్తమిస్తున్న ఫ్రాన్స్ దేశ చంద్రబింబం,* యింకోవైపు కేంద్రీకృత, యువ, బలవత్తరమైన జర్మనీ త్వరత్వరగా అభివృద్ధిగాంచుతోంది. ఒకపక్క నల్లని వెంట్రుకలు, కాస్త పొట్టివారైన విలాసవంతులు, ఎంతో నాగరికులు ఐన ఫ్రెంచ్ ప్రజలు వారి కళాకౌశలంతో ఒప్పుతారు. వారి జీవితలక్ష్యం కళ. వారి జీవితంలో కళ మేళవించింది. ఒకపక్క బూడిదరంగు జుట్టు కలిగి

మంచి ఒడ్డూ పొడుగూ కలిగిన జర్మన్ ప్రజల మొరటైన, నేర్పులేని కళావిహీనమైన పనులు కానవస్తాయి. పారిస్ తర్వాత అంత గొప్పపట్టణం పాశ్చాత్యదేశాల్లో లేదు. తక్కిన ప్రతి పట్టణంలోనూ పారిస్‌కు నకలు లేదా కనీసం పారిస్ ననుకరించే ప్రయత్నం కనిపిస్తుంది. కాని ఫ్రాన్స్ కళల్లో ఒక దివ్యసౌందర్యం, వైభవం వున్నాయి. జర్మనీ, ఇంగ్లాండ్, అమెరికాలలో ఫ్రాన్స్ కళానుకరణం మొద్దుగాను, మొరటుగాను వుంటుంది, ఫ్రెంచ్ నాగరికత ఉత్సాహపూరితమైంది. పచ్చకప్పురం లేక కస్తూరి తావిలా అది గదినంతా క్షణంలో పరిమళంతో నింపేస్తుంది. జర్మన్ నాగరికత వట్టి బండలా, సీసంలా, పాదరసంలా బరువుగా వుండి పడ్డచోటనుండి అది కదలలేదు. జర్మన్ల కండబలం ఎలాంటిదంటే వారు అవిశ్రాంతంగా పనిచేస్తారు. ఫ్రెంచ్‌వారి శరీరాలు మృదులమైనవి. కాని వారు నిష్ఠతో పనిచెయ్యటం మొదలుపెడితే అది ఇనుపసుత్తితో కొట్టినట్లు అనిర్వార్యం.

జర్మన్లు ఫ్రెంచ్ పద్ధతిలో పెద్ద పెద్ద భవనాలు, హర్మ్యాలు నిర్మిస్తున్నారు. పెద్ద శిలావిగ్రహాలు, అశ్విక సంబంధిత విగ్రహాలు ఆ భవనాలమీద నెలకొల్పుతున్నారు. కాని ఒక రెండంతస్తుల జర్మను భవనాన్ని చూస్తే యివి మనుషులు నివసించటానికా లేక ఏనుగులు, ఒంటెలు మొదలైనవి కట్టివెయ్యటానికా అనిపిస్తుంది. కాని ఫ్రాన్స్‌లో ఏనుగులు, గుర్రాలు వుండే ఐదంతస్తుల మేడలను చూసినప్పుడు అవి దేవకన్యా నివాస సౌధాలనిపిస్తాయి. అమెరికాలో ఎక్కువగా జర్మను పద్ధతుల్ని ఇష్టపడతారు. ప్రతి నగరంలోను లక్షలకొద్దీ జర్మన్‌లున్నారు. భాష మాత్రం ఆంగ్లమే. కాని అమెరికా నెమ్మదిగా జర్మన్ పద్ధతులను పెంచుకొంది. జర్మనీలో జనాభా పెరిగిపోతోంది, అదెంతో బలపడుతోంది. ఈనాడు జర్మనీ ఐరోపాకంతకూ నియంతృత్వం వహించింది. ఐరోపాలో జర్మనీస్థాయి అందరి కంటె మించి వుంది. మిగిలిన దేశాలకంటె చాలకాలం క్రితమే జర్మనీలో స్త్రీ పురుషులకు నిర్బంధవిద్య అమలుపరచబడింది. నిరక్షరాస్యత శిక్షార్హమని శాసనం చేశారు. ఫలితంగా ఈనాడు జర్మనీలో అందరూ విద్యావంతులే. జర్మన్ సైన్యం ప్రపంచంలో అత్యుత్తమమైందని ప్రతీతి. నౌకాదళంలోను జర్మనీ సర్వాతిశాయి. వస్తు నిర్మాణంలో జర్మనీ ఇంగ్లాండు నధిగమించింది. జర్మన్ వాణిజ్యం ఆంగ్లేయుల

వలసరాజ్యాల్లోకూడా పెరుగుతోంది. జర్మన్లు నెమ్మది నెమ్మదిగా నౌకాధిపత్యం వహిస్తున్నారు. జర్మన్ చక్రవర్తి ఆజ్ఞకు లోబడి చైనా యుద్ధరంగంలో తక్కిన దేశాలన్నీ జర్మన్ సేనాపతి నాయకత్వాన్ని అంగీకరించాయి!

రోజంతా మా రైలు జర్మనీగుండా పయనించి, పొద్దు వాలేసరికి ఆస్ట్రియా సరిహద్దుల్లో ప్రవేశించింది. ఆస్ట్రియా పూర్వం జర్మన్ల ఆధిపత్యం కింద వుండేది. ఇప్పుడది పరాయి ప్రాంతం. ఐరోపాలో ప్రయాణం చెయ్యటంలో కొన్ని చిక్కులున్నాయి. ప్రతి దేశంలోను కొన్ని కొన్ని వస్తువులమీద అక్కడి అధికారులు అధిక సుంకాన్ని వసూలుచేస్తారు. పొగాకువంటి కొన్ని సరుకులు పూర్తిగా ప్రభుత్వ వ్యాపారాధీనమై వుంటాయి. రష్యా, టర్కీలలో ప్రభుత్వ రహదారి చీటీ (పాస్‌పోర్ట్) లేకుండా మనం ప్రవేశించటానికి వీలులేదు. ఈ చీటీని మనవద్ద వుంచుకోవాలి. పైగా రష్యా, టర్కీలలో మన పుస్తకాలు, కాగితాలు అధికారులు వశపరచుకొంటారు. వారు వాటిని పరీక్షించి ఆ పుస్తకాలలో, పత్రాలలో వారి ప్రభుత్వాలకు, వారి మతాలకు వ్యతిరేకమైనదేదీ లేదని సంతృప్తిచెందాక మాత్రమే మనకు తిరిగి యిస్తారు. వారికేమైనా అనుమానం కలిగితే వాటిని నాశనం చేస్తారు. ఇతర దేశాల్లో మన పొగాకు పెద్ద చిక్కులు తెచ్చిపెడుతుంది. మన పెట్టెలు, బుట్టలు, బంగీలు, పరుపు చుట్టలు – అవన్నీ మనం విప్పి చూపవలసిందే. వీటిలో పొగాకు దాచామేమో అని వీరి భయం. కాన్‌స్టాంటినోపుల్‌కు రావాలంటే జర్మనీ, ఆస్ట్రియా, మరికొన్ని చిన్నచిన్న దేశాలగుండా పోవాలి. ఈ చిన్నచిన్న దేశాలు పూర్వం టర్కీలోని కొన్ని మండలాలు. తరువాత స్వతంత్రులైన క్రైస్తవరాజులందరూ కలిసి టర్కీ మహమ్మదీయులనుండి వీలైనన్ని మండలాలను గుంజుకొన్నారు. ఈ పెద్ద దేశాలకంటె ఈ చిన్న దేశాల్లోనే చిక్కులు ఎక్కువ. అవి పెద్ద చీమలవంటివి. ఇవి చిన్న చీమల వంటివి. చిన్నచీమల చుర్రు గాఢమైంది!

అక్టోబర్ 25 వ తారీఖున ఆస్ట్రియా ముఖ్యపట్టణమైన 'వియన్నా' చేరాం. ఆస్ట్రియాలోని, రష్యాలోని రాజకుటుంబీకులకు 'ఆర్క్‌డ్యూక్స్' – 'ఆర్క్‌డచ్చెస్' అని బిరుదులున్నాయి. మా రైలు

నుండి వియన్నాలో ఇద్దరు ఆర్క్‌డ్యూక్స్ దిగాల్సి వుంది. వారు దిగేంతవరకూ తక్కిన ప్రయాణీకులెవరూ దిగకూడదు. అందువల్ల మేం వారెప్పుడు దిగుతారా అని కాచుకోవలసి వచ్చింది. యూనిఫారాలు ధరించిన ఉద్యోగులు, ఈకల టోపీలు ధరించిన కొందరు సైనికులు ఈ ఆర్క్‌డ్యూక్స్ కోసం వేచివున్నారు. ఆర్క్‌డ్యూక్స్ దిగగానే వారంతా వారిని చుట్టుకొన్నారు. మాకూ ప్రాణం తేలికయ్యింది. త్వరగా మేం మా సామానుతో కిందికి దిగాం. మా సామాన్లను అధికారులకు చూపించి అనుమతి పొందటానికి ఎంతోసేపు పట్టలేదు. ఇంతకు పూర్వమే మేమొక హోటల్లో బసచెయ్యటానికి ఏర్పాటు జరిగింది. ఆ హోటల్‌వాడు బండిలో వచ్చాడు. మే మా బండిలో హోటల్‌కు చేరుకొన్నాం. అది రాత్రి కాబట్టి నగరాన్ని చూడటానికి పోయే ప్రసక్తేలేదు. మరునాటి ఉదయం నగరాన్ని చూడటానికి బైలుదేరాం. ఇంగ్లాండ్, జర్మనీలు తప్ప ఐరోపాలోని అన్ని దేశాల్లోని హోటళ్లలో ఫ్రెంచ్ పద్ధతి కనిపిస్తుంది. వారు హిందువుల మాదిరి రెండుసార్లు – పగలు 12 గంటలకు, రాత్రి 8 గంటలకు భోజనం చేస్తారు. ఉదయం 8 గంటలకు కాస్త కాఫీ తాగుతారు. ఇంగ్లాండు, రష్యాలలో తప్ప తక్కిన దేశాల్లో టీ తాగటం చాలతక్కువ. ఉదయపు భోజనాన్ని ఫ్రెంచ్‌లో 'డీజెనర్' అంటే ఆంగ్లంలో బ్రేక్‌ఫాస్ట్ అంటారు. రాత్రి భోజనాన్ని 'డీనెర్', ఆంగ్లంలో డిన్నర్ అంటారు. రష్యాలో టీ ఎక్కువగా సేవిస్తారు. రష్యా అమిత చలిదేశం. చైనాకూడా చాలవరకు చలిదేశమే. చైనా టీ చాలాబాగుంటుంది. అందులో అధికభాగం రష్యాకు ఎగుమతి అవుతుంది. చైనీయుల మాదిరే రష్యన్లు కూడా టీలో పాలు కలుపుకోకుండా తాగుతారు. టీ, కాఫీలలో పాలు కలిపితే విషమవుతుందట. అచ్చంగా టీ తాగే జాతులైన చైనా, జపాన్, రష్యావారు, మధ్య ఆసియా ప్రజలు పాలు కలపని వట్టి కషాయమే తాగుతారు. అలాగే అచ్చంగా కాఫీ తాగే జాతులైన టర్కీ ప్రజలు మొదలైనవారు కాఫీ కషాయంలో పాలు కలుపుకోరు. రష్యాలో మాత్రం టీలో ఒక నిమ్మకాయ ముక్క, ఓ పంచదార గడ్డ కలుపుతారు. ఇక పేదవారు పంచదారగడ్డ నోట్లో వేసుకొని తర్వాత టీ తాగుతారు. తాగిన తరువాత ఆ గడ్డ తీసి మరొకరికిస్తారు. వాడింకొకడికిస్తాడు. అది ఆ విధంగా సాగుతుంది. వియన్నా పారిస్ పద్ధతిలో నిర్మించబడిన చిన్ననగరం. కాని ఆస్ట్రియావారు జాతిచే జర్మన్లు. ఆస్ట్రియా చక్రవర్తే నిన్నమొన్నటిదాక జర్మనీ కంతకూ చక్రవర్తి. ఇప్పుడుమాత్రం 'ప్రష్యా' రాజైన

‘విల్‌హెల్మ్’ రాజు దూరదృష్టితో, అతడి మంత్రి ‘బిస్మార్క్’ రాజకీయచాతుర్యంతో, అతడి సేనాపతి ‘వాన్ మోల్ట్‌కి’ యుద్ధతంత్రంతో ప్రష్యారాజే ఆస్ట్రియా తప్ప తక్కిన జర్మనీ కంతటికీ చక్రవర్తి ఐనాడు. ప్రస్తుతం ఆస్ట్రియా వైభవం, అధికారం బాగా తగ్గిపోయి, ఏదోవిధంగా తన పరువు ప్రతిష్ఠలను కాపాడుకొంటోంది. ఆస్ట్రియా రాజపరంపర – హేప్స్‌బర్గ్ రాజవంశం ఐరోపాలోకల్లా అతిపురాతన, రాజసంవున్న రాజవంశం. ఈ రాజవంశమే నిన్న మొన్నటిదాకా జర్మనీ కంతకూ చక్రవర్తిత్వం వహించింది. జర్మనీ రాజకుమారులే ఐరోపాలో అన్ని దేశాల సింహాసనాలను అధిష్ఠించి వున్నారు. జర్మనీలోని చిన్నచిన్న జమీందారులుకూడా ఇంగ్లాండు, రష్యాలవంటి సామ్రాజ్యాల నాక్రమించారు. ఆస్ట్రియా ఆ గౌరవానికి, ప్రతిష్ఠకు ఇంకా అర్రులు చాస్తూనే వుంది, కానీ దానికి శక్తిలేదు. టర్కీకి ‘ఐరోపా జబ్బు మనిషి’ అని పేరు. మరి ఆస్ట్రియాకు ఆ దృష్టిలో ‘జబ్బుమగువ’ అని పేరుండాలి. ఆస్ట్రియా కాథలిక్ మత దేశం. నిన్నమొన్నటి వరకు ఆస్ట్రియా సామ్రాజ్యానికి ‘పవిత్ర రోమన్ సామ్రాజ్య’ మని పేరుండేది. అధునాతన జర్మనీలో ప్రొటస్టెంట్లు ఎక్కువ. ఆస్ట్రియా చక్రవర్తి పోప్‌కు కుడి భుజం, విశ్వాసపాత్రుడైన అనుచరుడు; రోమన్ కాథలిక్ శాఖకు నాయకుడు, ప్రస్తుతం ఐరోపా యావత్తులో ఆస్ట్రియా చక్రవర్తి ఒక్కడే కాథలిక్ పరిపాలకుడు. కాథలిక్ చర్చ్‌కు పెద్దకుమార్తె వంటిది ఫ్రాన్స్; ఇప్పుడు సర్వస్వతంత్ర రాజ్యం. స్పెయిన్, పోర్చుగల్ పతనావస్థలో వున్నాయి. ఇటలీ పోప్‌కు తన సింహాసనాన్ని స్థాపించుకోవటానికి తగినంత అధికారాన్ని మాత్రమే ఒసగింది. పోప్ సమస్త వైభవాన్ని, అధికారాన్ని అపహరించింది. ఇటలీ రాజుకు, పోప్‌కు మధ్య పచ్చగడ్డివేస్తే బగ్గుమంటుంది. పూర్వం పోప్‌కు ముఖ్యపట్టణమైన రోమ్ ఇప్పుడు ఇటలీకి ముఖ్యపట్టణం. పోప్ ప్రాచీన హర్మ్యాలను ఇటలీ రాజు ఆక్రమించి తన నివాసం చేసుకొన్నాడు. పోప్ ప్రాచీన ఇటలీ రాజ్యమంతా ప్రస్తుతం వాటికన్ వరకే పరిమితమైంది. కాని మత వ్యవహారాల్లో పోప్‌కు పలుకుబడి ఇంకా ఎక్కుగానే వుంది. ఈ పోప్ అధికారానికి ఇంకా ఆస్ట్రియా అండగానే వుంది. పోప్‌కు అండగా వున్న ఆస్ట్రియాకు వ్యతిరేకంగా అధునాతనమైన ఇటలీ పోరాడి బైటపడింది. అందుచేత ఆస్ట్రియా ఇప్పుడు ఇటలీకి విరోధి. ఎందుచేత? ఇటలీ తన అధికారంనుండి బైటపడింది కాబట్టి. దురదృష్టవశాత్తు యీ శైశవదశలోని ఇటలీ ఇంగ్లాండు

దుర్బోధతో ఒక పెద్ద శక్తిమంతమైన సైన్యాన్ని, నౌకాదళాన్ని నిర్మించటానికి పూనుకొంది. కాని ధనం ఎక్కణ్ణుండి వస్తుంది? అందువల్ల ఇటలీ ఋణాలలో చిక్కుకొని వినాశమార్గంలో పడింది. దీనికితోడు ఆఫ్రికాలో తన సామ్రాజ్యాన్ని నెలకొల్పటానికి పూనుకొని, ఒక కొత్తచిక్కు తెచ్చిపెట్టుకొంది. అబిసీనియా చక్రవర్తిచేత పరాజితమై తన కీర్తి ప్రతిష్ఠలను కోల్పోయి కింద చతికిలబడింది. ఈలోపుగా ప్రష్యా ఒక పెద్ద యుద్ధంలో ఆస్ట్రియాను జయించి అధిక ప్రాంతాన్ని ఆక్రమించుకొంది. ఆస్ట్రియా నెమ్మదిగా కుంగిపోతూంటే ఇటలీ కూడా తన కొంగ్రొత్త జీవితాన్ని దుర్వినియోగం చేసుకోవటంతో తానూ అలాగే దెబ్బతినిపోయింది.

ఆస్ట్రియా రాజవంశం ఐరోపా రాజవంశాల్లోనే ఎంతో ఆభిజాత్యం గలది. అది ఎంతో ప్రాచీనమైనదని, రాజరికం గలదని ఆ వంశస్థుల అభిప్రాయం. వివాహాది సంబంధాలలో వీరెంతో జాగరూకులై వుంటారు. రోమన్ కాథలిక్ కుటుంబాలతో తప్ప వీరు అన్యసంబంధాలు చేసుకోరు. ఈ వంశంతో సంబంధ మేర్పరచుకోవాలనే వ్యామోహం ఘనుడైన నెపోలియన్ పతనానికి దారితీసింది. అతడికి ఒక రాజవంశంలోని కన్యను వివాహమాడి పుత్రపౌత్రాది సంతతి పొంది ఒక రాజవంశానికి మూల పురుషుడు కావాలనే విచిత్రమైన మాహ పుట్టింది. అతడి వంశ మర్యాదలను గురించి ప్రశ్నించబడ్డప్పుడు, "నేను నా బిరుదులను మరో వ్యక్తి నుండి పొందలేదు. నేను ఒక గొప్ప రాజవంశానికి మూలపురుషుణ్ణి కాబోతున్నా" నని అతడన్నాడు. అతడి అభిప్రాయం ఇది: "నా వంశస్థుల పేరు మీదుగా బతకటానికి పుట్టినవాణ్ణిగాను. నేను ఒక మహారాజవంశానికి మూలపురుషుణ్ణి కాగలను." అంతటి మహావీరుడు ఈ వంశగౌరవమనే గోతిలో పడిపోయాడు.

జోసెఫైన్ మహారాజ్ఞికి విడాకులివ్వటం, ఆస్ట్రియన్ చక్రవర్తి యుద్ధంలో ఓడిపోగా అతని కుమార్తెను చేకొనటం, ఆస్ట్రియన్ రాకుమార్తె మేరీ లూయిస్‌ను మహావైభవంగా నెపోలియన్ వివాహమాడటం, ఒక కుమారుడు జన్మించటం, కొత్తగా జన్మించిన శిశువును రోమ్ రాజుగా పట్టాభిషిక్తుణ్ణి చెయ్యటం, నెపోలియన్ పతనమవటం, మామతో అతడికి విరోధం కలగటం,

లీప్సెక్, వాటర్లూ, సెయింట్ హెలీనాలలో ప్రతి కూలఘట్టాలు తలచూపటం, మేరీ లూయిస్ మహారాణి తన బిడ్డతో తండ్రి ఇంట నివసించటం, నెపోలియన్ రాజ సహచరిని ఒక సామాన్య సైనికుడికిచ్చి వివాహం చెయ్యటం, నెపోలియన్ ఏకైక పుత్రుడు, రోమ్ రాజు అతని మాతామహుని ఇంట మరణించటం – ఇవన్నీ సుప్రసిద్ధ చారిత్రక సంఘటనలే.

ఫ్రాన్స్ ప్రస్తుతం అంతకంటె బలహీనమైన స్థితిలో వుండి తన గత వైభవాన్ని తలపోసుకొంటోంది. ఇప్పుడు నెపోలియన్ మీద ఎన్నో పుస్తకాలు వెలువడ్డాయి. మరణించి కనుమరుగైపోయిన నెపోలియన్ మీద 'సార్డోవ్' మొదలైన నాటక రచయితలు అనేక నాటకాలు వ్రాస్తున్నారు. మేడం బెర్న్హార్డ్, రీజెనే మొదలైన నటీమణులు ఈ నాటకాలను కిక్కిరిసిన ప్రేక్షకులముందు ప్రదర్శిస్తున్నారు. ఇటీవల మేడం బెర్న్హార్డ్ పారిస్లో 'లాయిగ్లాన్' – అంటే 'యువ గరుత్మంతుడు' అనే నాటకాన్ని ప్రదర్శించి ఎంతో ప్రజాదరణ పొందింది.

ఈ 'యువ గరుత్మంతుడు' నెపోలియన్ ఏకైక పుత్రుడు. ఇతడు, తన మాతామహుని యింట్లో, వియన్నాలో నిర్బంధితుడయ్యాడు. ఆస్ట్రియా చక్రవర్తి మంత్రి 'మేచవిల్లియన్ మెటర్నిక్', నెపోలియన్ వీరగాథలు పిల్లవాడికి తెలియరాకుండా ఎంతో జాగ్రత్త తీసుకొన్నాడు. కాని కొద్దిమంది నెపోలియన్ పక్షపాతులు మారువేషాల్లో ఆ పిల్లవాడికి సేవకులుగా 'స్కాన్బ్రన్' రాజభవనంలో ప్రవేశించారు. ఈ పిల్లవాడిని ఎలాగైనా ఫ్రాన్స్కు తీసుకెళ్లి, ఐరోపాలోని ప్రభువులందరూ చేరి తిరిగి ఫ్రాన్స్ సింహాసనాన్ని ఎక్కించిన బోర్బన్ వంశస్థుణ్ణి సింహాసనభ్రష్టుణ్ణిచేసి, ఈ పిల్లవాణ్ణి ఆ సింహాసనం ఎక్కించి నెపోలియన్ రాజవంశాన్ని అధికారంలోకి తీసుకురావాలని వారి ఉద్దేశం. ఈ పిల్లవాడు వీర పుత్రుడు. కాబట్టి అతడిలో నిగూఢమైవున్న వీరభావాలు, తండ్రి వీరగాథలను విన్నప్పుడు మేల్కొన్నాయి. ఒకరోజు ఈ కుర్రవాడు 'స్కాన్బ్రన్' రాజభవనంనుండి తక్కిన కుట్రదారులతో కలిసి పారిపోయాడు. కాని మెటర్నిక్ బుద్ధికౌశల్యంతో ఈ సంగతిని కనిపెట్టి, పిల్లవాడు చెయ్యిదాటిపోకుండా చూసుకొన్నాడు. ఈ పిల్లవాడు తిరిగి 'స్కాన్బ్రన్' రాజభవనానికి కొనిరాబడి ఖైదు చెయ్యబడ్డాడు.

ఈ యువ గరుత్మంతుడు రెక్కలు తెగిన పక్షై భగ్నాశుడై మరణించాడు. ఇది ఆ నాటకంలోని కథ.

ఈ 'స్కాన్‌బ్రన్' రాజభవనం సామాన్యమైనదే. కాని యిందులోని గదులు వైభవంగా అలంకరించబడ్డాయి. ఈ గదుల్లో ఒకదాంట్లో చైనీయుల పనితనం కనిపిస్తుంది.మరోదాన్లో హైందవకళ, యింకొకదాన్లో మరో దేశపు కళ ఒప్పారుతుంటాయి. ఈ రాజప్రాసాద ఆవరణలోని ఉద్యానవనం ఎంతో రమ్యంగా వుంటుంది. ప్రస్తుతం యీ రాజభవనాన్ని చూడవచ్చే జనం నెపోలియన్ కుమారుడే గదిలో వుండేవాడో, ఏగదిలో చదువుకొనేవాడో, ఎక్కడ మరణించాడో మొదలైన వివరాలు తెలుసుకోవాలని ఆతురపడతారు. అనేకమంది ఫ్రెంచ్ వారు "ఏ గదిలో యువ గరుత్మంతుడుండేవాడు? ఏ మంచంమీద పడుకొనేవాడు?" మొదలైన ప్రశ్నా పరంపరలను అనాలోచితంగా భవన రక్షకుణ్ణి అడుగుతుంటారు. ఇవి ఎలాంటి పిచ్చి ప్రశ్నలో చూడండి. ఆస్ట్రియన్లకు ఆ పిల్లవాడు నెపోలియన్ కుమారుడని మాత్రమే తెలుసు. ఆ సంబంధం ఆ రాజవంశపు ఆడపిల్లను బలవంతంగా వివాహం చేసుకోవటంతో కలిగిందాయె. వారి హృదయాల్లో ద్వేషభావం యింకా పోలేదు. ఆ పిల్లవాడు చక్రవర్తికి మనుమడు, ఏ నివాసం లేనివాడు, అందుచేత అతనికి నిలువనీడ ఇవ్వక తప్పదు. కాని వారతణ్ణి 'రోమ్ రాజ" ని పిలువలేరు. అతడు ఆస్ట్రియా చక్రవర్తి మనుమడు కాబట్టి 'ఆర్కిడ్యూక్' మాత్రం కావచ్చును.

ఫ్రెంచ్‌వారు అతడిమీద పుస్తకాన్ని వ్రాసి, అతడి నిప్పుడు గరుత్మంతుణ్ణి చెయ్యనివ్వుగాక! దానికితోడు కల్పనాత్మకమైన పరిస్థితులు, మేడం బెర్న్‌హార్డ్ నటనాచాతుర్యం ఈ కథను ఎంతో ఆకర్షణీయంగా చెయ్యవచ్చును గాక. కాని ఒక ఆస్ట్రియా దేశస్తుడైన రక్షకభటుడికీ గరుత్మంతుడనే పేరు ఎలా తెలుస్తుంది? పైగా ఆస్ట్రియా చక్రవర్తి, అతని మంత్రి మెటర్నిక్ సలహాతో నెపోలియన్ కుమారుణ్ణి ఒకరకంగా చంపించాడని ఆ పుస్తకంలో వ్రాయబడింది.

ఈ గరుత్మంతుడనే పేరు విని ఈ భవన రక్షకుడు మొహం చిట్లించుకొని, మనస్సులో విసుక్కొంటూనే. ఒక గది తర్వాత మరో గదిని, వస్తువులను చూపించసాగాడు. అంతకంటె

అతడేం చెయ్యగలడు? తనకు వచ్చే నాలుగు డబ్బులు పాపం అతడు వదలుకోలేడు గదా. పైగా ఆస్ట్రియాలాంటి దేశాల్లో సైనికులకు జీతాలు అతిస్వల్పం. పాపం వారి కా జీతం పొట్టకు సరిపోయేటంత కాకపోయినా, కొన్ని సంవత్సరాలు కొలువుచేశాక వారు తమ ఇళ్లకు పోవచ్చును. అతని దేశభక్తివల్ల యీ ఫ్రెంచ్‌వారి ప్రశ్నల కతని ముఖం ముడుచుకొనిపోయింది. కాని అతగాడు తెలియకుండానే డబ్బుకోసం చెయ్యి చాచాడు. ఈ ఫ్రెంచ్ యాత్రీకులు కొన్ని వెండి నాణాలు అతడి చేతిలో పెట్టి 'గరుత్మంతుణ్ణి' గురించి మాట్లాడుకొంటూ, మెటర్నిక్‌ను తిట్టుకొంటూ వెళ్లిపోయారు. భవన రక్షకుడు వారికొక 'పేద్ద' సలాంకొట్టి తలుపులు మూసేశాడు. అతడు మనస్సులో ఆ ఫ్రెంచ్‌వారి పూర్వీకులను తప్పక బాగా తిట్టుకొని వుంటాడు.

వియన్నాలో ముఖ్యంగా చూడదగింది పురాతన వస్తుప్రదర్శనశాల. అందులో ప్రత్యేకంగా భౌతిక శాస్త్రీయ వస్తుప్రదర్శనశాల ఉంది. ఇది విద్యార్థులకు ఎంతో విజ్ఞానదాయకమైన సంస్థ. ప్రస్తుతం కానరాని ప్రాచీనమైన నానావిధ జాతులకు చెందిన జంతువుల కంకాళాలను ఇక్కడ పోగుచేసి, భద్రపరిచారు. చిత్ర విభాగంలో డచ్ చిత్రకారుల తైలవర్ణ చిత్రాలు అధికంగా వున్నాయి. డచ్ చిత్రకళలో వ్యంగ్యలక్షణం లేదు. దాన్లో స్వాభావికమైన వస్తువుల రూపాలు, జంతువుల ప్రతిరూపాలు చిత్రితాలై వుంటాయి. ఒక చిత్రకారుడు చేపలతో నిండిన ఒక బుట్టను, ఒక మాంసంముద్దను, ఒక నీటి కూజాను చిత్రించటానికి కొన్ని సంవత్సరాలు శ్రమించాడు. ఆ చేపలు, మాంసం, కూజాలోని నీళ్లు – ఎంతో అద్భుతంగా ఉన్నాయి. కానీ ఈ డచ్ చిత్రకళలో స్త్రీ చిత్రాలు చూడటానికి వస్తాదుల్లా కనిపిస్తాయి.

వియన్నాలో జర్మన్ పాండిత్యం, ప్రతిభ వున్నాయనుకోండి. కాని టర్కీ క్రమంగా శిథిలమవటానికి దారితీసిన కారణ సామగ్రికూడా యిక్కడ కానవస్తోంది. అనేక జాతులు, భాషలు అక్కడున్నాయి. ఆస్ట్రియాలో జనం జర్మన్ మాట్లాడతారు. హంగేరీ ప్రజలు 'తార్తారు' జాతి వారు. వారి భాష వేరు. గ్రీకు భాష మాట్లాడేవారు, గ్రీక్ చర్చ్‌కి సంబంధించిన క్రైస్తవులు వున్నారు. ఇన్ని విభిన్న జాతులను ఏకం చెయ్యటానికి తగిన శక్తి ఆస్ట్రియాకు లేదు. అందువల్ల

ఆస్ట్రియా పతనమైంది.

ప్రస్తుతకాలంలో జాతీయతాభావం ఐరోపాలో వెల్లువలా ప్రవహిస్తోంది. ఒకే భాష మాట్లాడేవారు, ఒకే మతానికి చెందినవారు, ఒకే జాతికి చెందినవారు ఐక్యమవటానికి ఉత్సాహపడుతున్నారు. ఇలాంటి ఐకమత్యం సంఘటితమైన ప్రాంతాల్లో గొప్పశక్తి ప్రకటితమవుతుంది. ఐకమత్యం లేనిచోట పతనం తప్పదు. ప్రస్తుత ఆస్ట్రియా చక్రవర్తి* మరణానంతరం ఆస్ట్రియా సామ్రాజ్యంలోని జర్మన్ భాషా ప్రాంతాన్ని జర్మనీ తప్పకుండా తనలో విలీనం చేసుకొంటుంది. రష్యా, తక్కిన దేశాలు జర్మనీని వ్యతిరేకిస్తాయి. అదొక భయంకరమైన యుద్ధానికి దారితియ్యవచ్చును. ఈ ఆస్ట్రియా చక్రవర్తి ఎంతోవృద్ధుడు. అందుచేత యీ యుద్ధ ప్రమాదం త్వరలో దాపురించబోతోంది. జర్మనీ రాజు ప్రస్తుతం టర్కీ సుల్తానుకు మిత్రుడు. టర్కీ, రష్యాలకు విరోధం వుంది. జర్మనీ ఆస్ట్రియా ప్రాంతాన్ని ఆక్రమించ ప్రయత్నించినప్పుడు రష్యా వ్యతిరేకిస్తే, టర్కీ రష్యాను కొంత నిరోధించగలదు. అందుచేత జర్మన్ చక్రవర్తి టర్కీతో జతకట్టాడు.

వియన్నాలో మూడురోజులకే విసుగుపుట్టింది. పారిస్‌ను చూశాక తక్కిన ఐరోపాను చూడటం విందుభోజనం చేశాక పచ్చడి మెతుకులు తినటంలాంటిది. అవే దుస్తులు, అదే భోజన పద్ధతి, ప్రతి పద్ధతీ అదే. ఐరోపా అంతా ఫ్రాన్స్‌లోని పద్ధతుల అనుకరణం కనిపిస్తుంది. ఆ నల్లని సూటు, అదే రకమైన హేటు. అబ్బ! అసహ్యం! పైగా పైన మబ్బుపట్టి వుంటుంది. ఈ జనాల గుంపు నల్లని హేట్లతో, నల్లని కోట్లతో చూడ్డానికి పరమరోతగా వుంటుంది. యావత్తు ఐరోపాలో ఫ్రాన్స్ పద్ధతి దుస్తులు, జీవన పద్ధతులు వ్యాపిస్తున్నాయి. ఇలాంటి అనుకరణ మరణసూచకం. వందల సంవత్సరాలు అలవాటుచేసి ఉదయమే పళ్లు తోముకోవటం, ముఖం కడుక్కోవటం, భోజనం చెయ్యటం — ప్రతి పనీ ఒకే పద్ధతిలో చెయ్యటం మన పూర్వులు మనకు నేర్పారు. అందువల్ల మనం యంత్రాల మాదిరి తిరుగుతున్నాం. ఈ యంత్రాలు ఔనని, కాదని చెప్పవు. ఏ విషయాన్ని గురించీ తల పగులగొట్టుకోవు.తమ పూర్వులు నడచిన మార్గాన్ననుసరించే క్రమంగా

కృశించి వీరు వినష్టమౌతారు. ఐరోపీయుల కర్మా యింతే. కాలగతి మారుతోంది. ప్రజలంతా ఒకే పద్ధతి దుస్తులు, ఆహారం, సంభాషణావిధానం అవలంబించి ప్రతి విషయంలోను అలాగే వుండి క్రమంగా యంత్రాలమాదిరి మారిపోయి తమ పూర్వీకులు నడచిన మార్గంలోనే నడిచిపోయారు. దానివల్ల కలిగే ఫలితం వారు కృశించి వినష్టమవటమే గదా!

అక్టోబర్ 28 వ తేదీ రాత్రి 9 గంటలకు మళ్లీ మేం ఓరియంటల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాం. 30 వ తేదీ కాన్‌స్టాంటినోపుల్‌లో దిగాం. రెండు రాత్రులు ఒక పగలు హంగేరి, సెర్బియా, బల్గేరియాలగుండా రైలు పయనించింది. హంగేరీ ప్రజలు ఆస్ట్రియా చక్రవర్తిచే పరిపాలింపబడుతున్నారు. ఆస్ట్రియా చక్రవర్తికి హంగేరీ రాజని పేరుంది. హంగేరీ ప్రజలు, టర్కీ ప్రజలు ఒకే జాతివారు. టిబెట్ ప్రజలకు, వీరికి ఎంతో దగ్గరి పోలికలున్నాయి. హంగేరీ ప్రజలు కాస్పియన్ సముద్రానికి ఉత్తరం వైపుగా ఐరోపాలో వ్యాపించారు. టర్కీ ప్రజలు ఆసియామైనర్, పర్షియా సరిహద్దులగుండా ఐరోపాలో ప్రవేశించారు. హంగేరీ ప్రజలు క్రైస్తవులు, టర్కీవారు మహమ్మదీయులు. కాని తార్తారు రక్తానికి ప్రధాన లక్షణమైన వీరత్వం ఇరువర్గాలలోనూ సమానంగానే కనిపిస్తుంది. హంగేరీ ప్రజలు ఆస్ట్రియానుండి విడిపోవటానికి ఎన్నో పోరాటాలు చేశారు. ఇప్పుడు వాళ్లు నామమాత్రంగానే ఆస్ట్రియా కింద వున్నారు. ఆస్ట్రియా చక్రవర్తి హంగేరీకి నామ మాత్రపు రాజు. వారి ముఖ్యపట్టణం 'బుడాపెష్టు' ఎంతో పరిశుభ్రమైన, అందమైన నగరం. హంగేరీ ప్రజలు విలాసవంతులు, సంగీతమంటే చెవికోసుకొంటారు. పారిస్ అంతటా హంగేరీ వాద్యబృందాలున్నాయి.

సెర్బియా, బల్గేరియా మొదలైన ప్రాంతాలన్నీ టర్కీలోని మండలాలు. రష్యా, టర్కీలకు మధ్య జరిగిన యుద్ధాల్లో ఈ మండలాలు స్వతంత్రాలైనాయి, కాని టర్కీ సుల్తానే వారి ప్రభువు. సెర్బియా, బల్గేరియాలు విదేశీ విధానాల్లో స్వతంత్రాలు కావు. ఐరోపాలో మూడు నాగరిక జాతులున్నాయి. ఇవి ఫ్రెంచ్, జర్మన్, ఇంగ్లీషు జాతులు. తక్కినవి మన లాగే అధోగతిలో వున్నాయి. వాటిలో అనేక జాతులు ఆసియాలో కూడా మనకు కనిపించనంత అనాగరిక

జాతులు. సెర్బియా, బల్గేరియాలంతటా మట్టి ఇళ్లు, చిరిగిన పేలికలను కట్టుకొన్న మనుషులు, పెంటకుప్పలు మనకు అగుపడతాయి. "ఇదేంరా? తిరిగి భారతదేశానికి వచ్చామా ఏం?" అనుకొన్నాం. ఐతే వారంతా క్రైస్తవులు. కాబట్టి వారికి అసంఖ్యాకమైన పందులు వుండి తీరాలి.

ఒక పంది రెండు వందలమంది అడవిజాతి మనుషులు చేసేటంత ఛండాలం చేస్తుంది. ఈ సెర్బులు, బల్గేరియన్లు మట్టికప్పులున్న ఇళ్ళలో నివసిస్తారు. పేలికలైన వస్త్రాలు ధరిస్తారు. వీరిచుట్టూ దిక్కుమాలిన పందులుంటాయి. అనేక యుద్ధాలు చేసి ఎంతో రక్తపాతమైన తరువాత టర్కీ దాస్యంనుండి వారు బైటపడ్డారు. కాని వెంటనే వారికొక పెద్ద చిక్కు ఎదురైంది. వారు యూరోపియను పద్ధతిలో పెద్ద సైన్యాన్ని తయారుచేసుకోవలసి వచ్చింది. కాని వారిలో ఒక్కరైనా సురక్షితంగా జీవించటానికి వీలులేని పరిస్థితి నెలకొంది. సరే నేడో, రేపో వారు రష్యాలో చేరిపోతారు. కాని యీ రెండు రోజులైనా సైన్యం లేకుండా వారు బతకటమే దుర్లభం. అందువల్ల వారు తప్పనిసరిగా సైన్యాన్ని తయారు చేసుకోవాలి.

ఒక విషమఘడియలో ఫ్రాన్స్, జర్మనీ చేతిలో ఓడిపోయింది. క్రోధం, భయం కారణాలచే ఫ్రాన్స్ ప్రతి పౌరుణ్ణీ సైనికునిగా చేసింది.

ప్రతి వ్యక్తి కొంతకాలం సైన్యంలో పనిచెయ్యాలి. సైనికశాస్త్రం అధ్యయనం చెయ్యాలి. ఎవరికైనా యిది తప్పదు, అతడు మూడు సంవత్సరాలు శిక్షణశాలలో గడిపి యుద్ధనైపుణ్యం సంపాదించాలి. వాడు కోటీశ్వరుడైనా సరే భుజంమీద తుపాకీ మొయ్యాలి. శిబిరాలలో వుంటూ యుద్ధ పద్ధతులు నేర్చుకోవాలి. ప్రభుత్వం అతడికి భోజనం, దుస్తులు ఇస్తుంది. జీతం రోజుకొక పైస. ఈ శిక్షణానంతరం రెండు సంవత్సరాలదాకా ఎప్పుడు పిలిచినా అప్పుడు వచ్చి సైన్యంలో చేరటానికి సంసిద్ధుడై యింటివద్ద కాచుకొని వుండాలి. తరువాత 15 ఏళ్లదాకా పిలవగానే వచ్చి సైన్యంలో చేరటానికి సిద్ధంగా వుండాలి. జర్మనీ, ఫ్రాన్స్ సింహాన్ని రెచ్చగొట్టింది. కాబట్టి జర్మనీకూడా సిద్ధంగా వుండాల్సి వచ్చింది. తక్కిన దేశాల్లోకూడా ఒకరిని చూస్తే మరొకరికి పరస్పర భయం వుండటంతో అక్కడా సైన్య నిర్మాణం ఆవశ్యకమైంది. అందుచేత ఇంగ్లాండు

తప్ప తక్కిన ఐరోపాలో ప్రతి దేశం ఇలాంటి సైనిక సన్నాహం చేసుకోవలసి వచ్చింది. ఇంగ్లాండు ద్వీపం కాబట్టి నిరంతరం తన నావికాదళాన్ని బలపరుచుకొంటోంది. కాని బోయర్ యుద్ధంలో నేర్చుకొన్న పాఠాలవల్ల ఇంగ్లాండుకూడా సైనిక సన్నాహానికి దిగదని ఎవరు చెప్పగలరు? అన్ని దేశాలకంటె రష్యాలో జనాభా ఎక్కువ. అందుచేత ఐరోపా అంతట్లో రష్యా పెద్ద సైన్యాన్ని సమీకరించుకోగలదు. సెర్బియా, బల్గేరియాల వంటి చిన్నచిన్న రాజ్యాలు పుట్టినప్పటినుండి ఎంతో అధునాతనమైన ఆయుధ సామగ్రితో కూడిన అధునాతన శిక్షణలో సుశిక్షితులైన సైన్యాన్ని నిర్మాణం చేసుకోవలసి వచ్చింది. కాని దానికి కావలసిన ధనం ఎక్కణ్ణుండి వస్తుంది? ఫలితంగా రైతు లందరూ పేలికలను ధరించాల్సి వచ్చింది. పట్టణాల్లో సైనికులు ఆడంబరమైన యూనిఫారాలను ధరిస్తారు. ఐరోపా యావత్తు సైనిక వ్యామోహం ప్రబలింది. ఎక్కడ చూసినా సైనికులే.

ఏమైనా స్వాతంత్ర్యం స్వాతంత్ర్యమే. దాస్యం దాస్యమే. అదెంతటి గొప్పదైనా మరొకడి కింద పనిచేయవలసినప్పుడు దాని రసాస్వాదన చస్తుంది. వ్యక్తి గతమైన బాధ్యత లేకపోతే గొప్ప పనుల నెవడూ చెయ్యజాలడు. ఒకపూట తిని చింపిరిగుడ్డలు ధరించి స్వతంత్రంగా బతకటం, బంగారపు సంకెళ్లతో మేడల్లో నివసిస్తూ దాస్యం చేయటంకంటె పదివేల రెట్లు నయం. దాసుడు ఇహపరాలు రెండిటిలోను దుఃఖం అనుభవిస్తాడు. యూరోపియన్లు సెర్బ్‌లను, బల్గేరియన్లను పరిహసిస్తుంటారు. వారిలోని లోపాలను, తప్పులను ఎత్తిచూపి ఏడిపిస్తారు. కాని పాపం యిన్ని సంవత్సరాలు దాస్యంలో మగ్గి ఇప్పుడేకదా వారు బైటపడ్డారు. ఒక్కరోజులో వారు ప్రావీణ్యం సంపాదించగలరా? వారు తప్పులు చెయ్యక తప్పదు. అవి వందలకొద్దీ కావచ్చును. కానీ తప్పుల ద్వారానే వారు ఒప్పులేవో నేర్చుకొంటారు. క్రమంగా ప్రావీణ్యాన్ని సంపాదిస్తారు. వారిమీద బాధ్యత వుంచండి. ఎంత కూర్చుని లేవలేనివారైనా శక్తిసమన్వితులవుతారు. ఎలాంటి మూఢులైనా వివేకవంతులవుతారు.

మా రైలు హంగేరీ, రుమేనియాలగుండా పోతోంది. వినాశోన్ముఖమైన ఆస్ట్రియా

సామ్రాజ్యంలో వసించే విభిన్న జాతుల ప్రజలు బలహీనులు. కాని హంగేరీ ప్రజలు మాత్రం ఎంతో శక్తిమంతులు. ఐరోపాలోని జాతుల్లో ఒకటి రెండు చిన్న జాతులను తప్పిస్తే, తక్కినవన్నీ ఐరోపీయ విద్వాంసులు చెప్పే – 'ఇండో యూరోపియన్' లేక ఆర్యజాతికి చెందిన వారే. ఈ హంగేరీ ప్రజలు సంస్కృత సంబంధమైన భాషలు మాట్లాడని కొద్ది జాతుల్లో ఒకరు. పూర్వం చెప్పినట్లు హంగేరీ ప్రజలు, టర్కీవారు ఒకే జాతికి చెందినవారు. ఈ జాతి ప్రజలు ఎంతోకాలం క్రితమే ఆసియాలోను, ఐరోపాలోను తమ ప్రభుత్వాన్ని నెలకొల్పారు. హిమాలయాల పశ్చిమ శాఖకు హిందూకుష్ పర్వతశాఖకు ఉత్తరంగావున్న దేశానికిప్పుడు తురుష్కస్థానమని పేరుంది. ఇదే వీరి ప్రథమ నివాసస్థలం. ఆ దేశాన్ని వీరి భాషలో 'చాగ్వోయి' అని అంటారు. ఢిల్లీని పరిపాలించిన మొగలు రాజవంశం, ప్రస్తుతం పర్షియాను పాలించే రాజవంశం, కాన్‌స్టాంటినోపుల్‌ను పాలించే టర్కీ రాజవంశం, ఈ హంగేరీ ప్రజలు – వీరంతా ఆ తురుష్కస్థానంనుండే తమ రాజ్యాలను సువిశాలం చేసుకొంటూ వచ్చారు.

భారతదేశంతో ప్రారంభించి ఐరోపావరకు వీరాక్రమించారు. ఈనాడు ఈ రాజవంశాలు 'చాగ్వోయీల' మని చెప్పుకొంటారు. వీరంతా మాట్లాడే భాష ఒక్కటే. ఎన్నో శతాబ్దాల పూర్వంనుండి యీ టర్కీ ప్రజలు ఎంతో నాగరికులు. గొర్రెల మందలతో, పశువుల మందలతో – గుర్రపు మందలతో, భార్యా బిడ్డలతో, వారికున్న వస్తుసామగ్రితో పచ్చికబయళ్లలో విడిదిచేసి మందలను మేపుకొంటూ సంచరించేవారు. పచ్చిక, నీరు లభించనప్పుడు ఒకచోటనుండి మరో చోటుకు పోయేవారు. ఇప్పుడూ మధ్య ఆసియాలో ఈ జాతివారి కుటుంబాలు ఇలాగే దేశదిమ్మరులుగా జీవిస్తున్నారు. ఈ టర్కీ ప్రజలు మధ్య ఆసియాలోని జాతులతో భాషావిషయకమైన పోలికలు కలిగివున్నారు. కాని శారీరకమైన కొన్ని భేదాలున్నాయి. శిరో నిర్మాణంలోను, దౌడ ఎముకల ప్రాధాన్యంలోను టర్కీ ప్రజల ముఖాలు మంగోలియన్ల ముఖాలను పోలివుంటాయి. కాని వీరి ముక్కులు చప్పిడివి కాక పొడవుగా వుంటాయి. కళ్లు తీర్చిదిద్దినట్లుండి పెద్దవిగా వుంటాయి. కానీ కళ్ల మధ్యనున్న ప్రదేశం కొంచెం విశాలంగా మంగోలియన్లకు మాదిరి వుంటుంది. చాలకాలంనుండి ఆర్యసెమెటిక్ రక్తం ఈ టర్కీ జాతి

రక్తంలో మిశ్రితమైనట్లు కనిపిస్తుంది. అతి ప్రాచీనకాలం నుండి టర్కీ వారు యుద్ధకౌతుకం గలవారు. వీరితో సంస్కృతం మాట్లాడే ప్రజలు, కాందహారు, పర్షియా ప్రజలు మిశ్రమం కావటంతో ఆఫ్ఘన్‌లు, ఖిల్జీలు, హజారాలు, బారఘ్‌జాయీలు, అసఫ్‌జాయీలు మొదలైన యుద్ధ ప్రియులైన జాతులు పుట్టటానికి కారణమైంది ఈ జాతులకు యుద్ధమంటె ఎంతో ప్రీతి. వీరే భారతదేశాన్ని అనేకమార్లు అణగదొక్కారు.

అతి ప్రాచీనకాలంలో యీ టర్కీవారు భారతదేశంలోని పశ్చిమ ప్రాంతాలను అనేకమార్లు జయించి విశాల రాజ్యాలను స్థాపించారు. వారు భారతదేశాన్ని జయించాక బౌద్ధమతాన్ని స్వీకరించారు. కాశ్మీర్ ప్రాచీన చరిత్రలో ఈ ప్రసిద్ధులైన తురుష్క చక్రవర్తుల నామధేయాలు ప్రస్తావించబడ్డాయి. వారు హుస్కుడు, యుష్కుడు, కనిష్కుడు మొదలైన వారు. ఈ కనిష్కుడే మహాయాన బౌద్ధమతానికి స్థాపకుడు. తరువాత చాలాకాలానికీ తురుష్కుల్లో అధికసంఖ్యాకులు మహమ్మదీయ మతాన్ని అవలంబించి మధ్యఆసియాలో కాబూలు, కాందహార్ మొదలైన ముఖ్య బౌద్ధరాజ్యాలను తుడిచిపెట్టారు. మహమ్మదీయ మతంలో చేరటానికి పూర్వమే తాము జయించిన రాజ్యాల్లోని సంస్కృతి, విజ్ఞానాలను గ్రహించి వీరు తమ దేశాల్లో నాగరికతను వ్యాపించుకోవటానికి ప్రయత్నించారు. కాని మహమ్మదీయులైనాక వీరిలో మిగిలింది యుద్ధస్వభావమే. వీరికి సంస్కృతి, విజ్ఞానం మచ్చుకైనా లేదు. అంతేకాక ఆక్రమిత రాజ్యాల్లో నెలకొన్న నాగరికత వీరివల్ల నాశనమైంది. అధునాతన ఆఫ్ఘనిస్థాన్, కాందహారు మొదలైన దేశాల్లో ఆశ్చర్యకరమైన స్థూపాలు, సంఘారామాలు, పెద్ద పెద్ద శిలా విగ్రహాలు ప్రాచీన బౌద్ధులు కట్టించినవి యిప్పటికీ నిలిచివున్నాయి. ఈ తురుష్కులు మహమ్మదీయ మతంలో కలవటంతో ఆ దేవాలయాలు, స్థూపాలు చాలవరకు శిథిలావస్థలో వున్నాయి. ప్రస్తుతం ఆఫ్ఘన్‌లు వారికి సంబంధించిన జాతి ప్రజలు ఎంతో అనాగరికులు, నిరక్షరాస్యులుగా మారిపోవటంతో ఆ ప్రాచీన శిల్పఖండాల ననుకరించటానికి బదులు 'జిన్' మొదలైన మానవాతీతశక్తులు యీ శిల్పఖండ నిర్మాణాలను గావించి వుంటారని, అంత గొప్ప కట్టడాలు మానవ శక్తికి అసాధ్యాలని భావిస్తారు. పర్షియా పరిపాలింపబడుతున్న ప్రజలు నాగరికులైన

ఆర్యజాతివారైన పర్షియన్ల సంతానం. కాని వారిని పరిపాలించే రాజవంశం అనాగరికమైన, పరాక్రమవంతమైన తురుష్కజాతికి చెందింది. ఈ విధంగా నాగరికులనదగ్గ ఆర్యజాతి సంతానంతో వెలసిన గ్రీకు, రోమన్ రాజ్యాలకు తుదిచిహ్నమైన కాన్‌స్టాంటినోపుల్ శక్తివంతమైన, అనాగరికమైన తురుష్కజాతి పదాఘాతాలకు తట్టుకోలేక నశించింది. భారతదేశాన్ని పరిపాలించిన మొగల్ చక్రవర్తులు మాత్రం ఈ తురుష్కుల ధాటికి తట్టుకోగలిగారు – బహుశా హైందవ భావాలు, తద్రక్తం వీరికి సంక్రమించటం కారణంగానేమో! రాజపుత్ర కవుల పాటల్లో, కవితల్లో, చారిత్రక గాథల్లో భారతదేశాన్ని జయించిన రాజవంశాలన్నీ తురుష్కవంశాలుగా చెప్పబడ్డాయి. ఇది ఎంతో సమంజసమే. మహమ్మదీయ సైన్యంలో ఏఏ జాతులు కలిసివున్నా నాయకత్వం మాత్రం తురుష్కులదే.

మహమ్మదీయ మతంలో కలిసిపోయిన తురుష్కు లొకప్పుడు బౌద్ధులు. వారికింద సైన్యంలో చేరిన జాతులన్నీ మహమ్మదీయ మతం పుచ్చుకోకపూర్వం బౌద్ధులో లేక వైదిక మతస్థులో అయివుంటారు. వీరంతా బలవంతంగా తురుష్కులచేత మహమ్మదీయ మతంలో కలుపబడ్డారు. ఇలా మహమ్మదీయులైన హైందవులే తత్పూర్వంనుండి తమ పూర్వీకుల మతాన్నే అవలంబించి వస్తున్న ప్రజలను అనేకసార్లు జయించారు. వీటికే మహమ్మదీయ దండయాత్రలనీ, మహమ్మదీయ విజయమనీ, సామ్రాజ్యస్థాపనమనీ చరిత్రకారులంటారు. తురుష్కుల భాష వారి శరీర నిర్మాణం మాదిరే కొంత సాంకర్యానికి స్థానమైనదనుకోవచ్చును. వారి స్వస్థానమైన 'చాగ్‌వోయీ' నుండి చాలాదూరదేశాలకు వెళ్లిన తురుష్కులు ఎంతో సంకరభాష మాట్లాడతారు. ఈ సంవత్సరం పర్షియా షా 'పారిస్ ఎగ్జిబిషన్' చూడ్డానికి వచ్చి, కాన్‌స్టాంటినోపుల్‌నుండి రైలులో తమ దేశానికి వెళ్లాడు. దేశకాల సంబంధమైన పలుభేదాలున్నప్పటికీ పర్షియా షా మరియు టర్కీ సుల్తాన్ వారి పురాతన మాతృభాష అయిన టర్కీ భాషలో మాట్లాడుకొన్నారు. కాని సుల్తాన్ టర్కీ భాషలో పర్షియన్, అరబ్, గ్రీకు భాషాపదాలు చేరివుండగా, అంతకంటె షా భాష కొంత శుద్ధంగా వుందని చెప్పాలి.

ప్రాచీనకాలంలో ఈ చాగ్వోయీ తురుష్కులు రెండు తెగలుగా విడిపోయారు. ఒక తెగ 'తెల్ల గొర్రెలు'.రెండవ తెగ 'నల్లగొర్రెలు'. కాశ్మీర్‌కు ఉత్తరంగావున్న వీరి నివాసస్థానంలో గొర్రెలను మేపుకొంటూ – దేశాలను దోచుకొంటూ కాస్పియన్ సముద్రతీరంవరకు కలిసి పయనించారు. 'తెల్లగొర్రెల' శాఖ అక్కణ్ణుండి కాస్పియన్ సముద్రానికి ఉత్తరతీరం వెంట ఐరోపాలోకి చొచ్చుకొనిపోయి అప్పటికి శిథిలావస్థలో వున్న రోమన్ సామ్రాజ్యంలోని ఒక భాగాన్ని ఆక్రమించి హంగేరీ రాజ్యాన్ని స్థాపించింది.

'నల్లగొర్రెల' శాఖ కాస్పియన్ సముద్ర దక్షిణతీరం వెంట చొచ్చుకొనిపోయి, పర్షియా పశ్చిమభాగం ఆక్రమించి, 'కాకేసస్' పర్వతం దాటి, క్రమంగా ఆసియా మైనర్ మొదలైన ప్రాంతాలను, అరేబియాను ఆక్రమించి, కాలిఫ్ సింహాసనాన్ని ఆక్రమించుకొని నెమ్మది నెమ్మదిగా అప్పటికి మిగిలిన పశ్చిమ రోమన్ సామ్రాజ్యాన్ని కబళించి వేసింది. అతిప్రాచీన కాలంలో ఈ తురుష్కులు సర్పారాధకులు. బహుశా ఈ రాజవంశీకులనే ప్రాచీన భారతీయులు 'నాగుల' ని, 'తక్షకుల' ని నిర్దేశించి వుంటారు. తర్వాత వీరు బౌద్ధమతాన్ని స్వీకరించారు. తరువాత వారు జయించిన దేశాల్లోని మతాన్ని అవలంబిస్తూ వచ్చారు. మరి కొంతకాలం తర్వాత మన మిప్పుడు చెప్పుకొంటున్న ఈ రెండు జాతుల్లో 'తెల్లగొర్రెల' శాఖ క్రైస్తవులను జయించి తానా మతమే పుచ్చుకొంది. నల్ల గొర్రెల శాఖ మహమ్మదీయులను గెలిచి తానా మతమే పుచ్చుకొంది. ఈ రెండు మతాల శాఖలను పరిశోధిస్తే సర్పారాధన, బౌద్ధం వీరిలో వున్నట్లు గోచరిస్తుంది.

హంగేరి ప్రజలు జాతి, భాషల్లో తురుష్కులైనా రోమన్ కాథలిక్ మతానికి చెందినవారు. పూర్వం భాషా సంబంధానికిగాని, దేశ రక్త సంబంధాలకుగాని, మత దురభిమానానికిగాని స్థానం లేదు. హంగేరీ ప్రజలకు, టర్కీ ప్రజలకు మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమంటుంది. ఈ హంగేరీ ప్రజల సాయం లేకపోతే అనేక సందర్భాల్లోనూ ఆస్ట్రియా మొదలైన క్రైస్తవ రాజ్యాల ఉనికికే ముప్పు వాటిల్లేది. అధునాతనకాలంలో విద్యావ్యాప్తిచేత భాషా పరిశోధనలవల్ల,

మానవజాతి నిర్ణయ శాస్త్రం వల్ల ప్రజలు భాషాసంబంధం, రక్తసంబంధం మొదలైనవానివంక ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. మత సంబంధం క్రమంగా తగ్గిపోతోంది. ఈ కారణాలచే విద్యావంతులైన హంగేరీ ప్రజల్లోను, తురుష్క ప్రజల్లోను జాతీయైక్యభావం ప్రబలుతోంది.

హంగేరీ, ఆస్ట్రియా సామ్రాజ్యంలో ఒక భాగంగా వున్నా, దాన్నుండి తెంచుకొని బైటపడటానికి ఎన్నో ప్రయత్నాలు చేసింది. అనేక తిరుగుబాట్లు, అనేక విప్లవాలు సంభవించి హంగేరీ ప్రస్తుతం ఆస్ట్రియా సామ్రాజ్యంలో పేరుకుమాత్రం కలిసివుంది. అన్ని విషయాల్లోనూ హంగేరీ స్వతంత్ర రాజ్యమే. ఆస్ట్రియా చక్రవర్తికి హంగేరీ రాజనీ పేరుంది. దేశీయ వ్యవహారాలన్నీ హంగేరీ ఆస్ట్రియాతో సంబంధం లేకుండానే నిర్వర్తించుకొంటుంది. ఆస్ట్రియా చక్రవర్తి పేరుకుమాత్రం నాయకుడు. కాని ఈ కొద్ది సంబంధంకూడా ఎక్కువకాలం వుండేటట్లు తోచదు. హంగేరీ ప్రజల్లో తురుష్కజాతి లక్షణమైన యుద్ధప్రావీణ్యం, ఔదార్యాది సద్గుణాలు సమృద్ధిగా వున్నాయి. పైగా మహమ్మదీయ మతంలో చేరని కారణంగా సంగీతాది లలితకళలు మహమ్మదీయుల మాదిరి పైశాచికాలని వారు భావించరు. కాబట్టి హంగేరీ ప్రజలు సంగీతంలో గొప్ప ప్రావీణ్యులు. వారి సంగీత ప్రావీణ్యం ఐరోపా అంతటా ప్రసిద్ధి పొందింది.

చలిదేశంలో నివసించే ప్రజలు కారం తినరని పూర్వం నేననుకొనేవాణ్ణి. ఈ కారం తినటం కేవలం ఉష్ణదేశస్థుల దురభ్యాస మనుకొనేవాణ్ణి. కాని ఈ కారం తినటం హంగేరియన్లలో మొదలై రుమేనియా, బల్గేరియాలలో శ్రుతి మించి, మద్రాసీయులకంటెకూడా మించిన ధోరణిలో నాకు కనిపించింది.

దౌ ర్బల్యమునకు వశుడు కాక, దేనినైనా
ఎదుర్కొంటూ తుదివరకూ పట్టు విడువకుండా
ఉండేవాడే యోగి.

# Footnotes

1. సన్న్యాసులను సామాన్యంగా సంబోధించే విధం ఇది. 1900 సం.లో రెండవసారి పాశ్చాత్య దేశాలకు వెళ్లినప్పుడు వివేకానందస్వామి తన ఐరోపాయాత్రా విశేషాలను ఉద్బోధన పత్రికా సంపాదకులైన స్వామి త్రిగుణాతీతానందను సంబోధించి వ్రాశారు. కాబట్టి యీ విధంగా ఆరంభించారు. స్వామీజీ యీ ఉదంతాన్ని సరళమైన, హాస్య బంధురమైన వంగభాషా శైలిలో వ్రాశారు. ఆంగ్లానువాదం దానికి సముచిత దర్పణం కాలేదు.

1. ఇంటింటికీ వెళ్ళి సేకరించింది.

1. సర్వతోక్షి శిరో ముఖం. గీత: 13–13

1. దామోదర్ రూపనారాయణ శబ్దాల్లోశ్లేష వుంది. ఇవి నదుల పేర్లు: ఇదో అర్థం. దామోదరుడైన నారాయణుడు సమస్తాన్నీ దిగమింగాడని రెండవ అర్థం.

1. వివాహం అంటే ఏమిటో తెలియని, వ్యక్తిపట్లగాని, ఆస్తిపాస్తుల పట్ల గాని గౌరవంలేని అనాగరిక, ఆటవిక వ్యక్తిని హాస్యయుక్తంగా స్వామీజీ యిక్కడ వర్ణిస్తున్నారు.

1. పాశ్చాత్య దేశాలకు రెండవమారు వెళ్లేటప్పుడు స్వామి వివేకానంద పయనించిన బి.ఐ.ఎస్.ఎన్ వారి స్టీమర్ పేరు.

1. 'దుర్గాసప్తశతి' లో ప్రస్తావించబడ్డ రాక్షసుడు. వాడి శరీరం నుండి నేలమీద చిందిన ప్రతి రక్తబిందువునుండి వాడిని పోలిన రాక్షసుడొక్కొక్కడు పుట్టుకొస్తాడు.

1. వేదాలకు భాష్యం రచించిన సాయనుడు విద్యారణ్యముని సోదరుడని కొందరి

అభిప్రాయం.

1. వంగభాషలో లంక అంటె మిరపకాయ.

1. హరప్పా, మొహంజొదరో అనే ప్రాంతపు తవ్వకాల్లో ప్రాచీన కాలంలో ఎంతో అభివృద్ధిగాంచిన నాగరికతా ఋజువులు లభించాయి. ఇవి క్రీస్తుపూర్వం 3000 సంవత్సరాల నాటివని నిర్ణయించబడ్డాయి. ఈ తవ్వకాలు 1922 సం. ముందు జరగలేదు. –సంపాదకుడు.

1. సింధులిపి, సుమేరియన్–ఈజిప్షియన్ లిపులు సమకాలీనాలని తెలుసుకోబడ్డాయి.

1. పాశ్చాత్య దేశాల్లో నలుగురిలో కలసిమెలసి వున్నప్పుడు ఏ ఒక్కరికైనా తెలియని భాషలో మాట్లాడటం మర్యాదకాదు.

1. యాత్యేకతో స్త శిఖరం పతిరోషధీనాం – కాళిదాసు 'శాకుంతలం' నుండి – ఒకపక్క చంద్రుడు అస్తమిస్తున్నాడు.

1. రెండవ ఫ్రాన్సిస్ జోసెఫ్. ఇతడు 1916 లో మరణించాడు.